ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 05.09.2026 | సంపుటి :13 సంచిక : 47 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్
# సుడిగాలి పర్యటన


దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్

**మద్దూరులో, హకీంపేట, దౌల్తాబాద్‌లలో అభివృద్ధి పనుల పరిశీలన**

- నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలి
- డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన ముఖ్యమంత్రి
- అభివృద్ధి పనులపై అధికారులతో సీఎం సమీక్ష

**నారాయణపేట బ్యూరో(జనంసాక్షి):** తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరి శీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం మద్దూరులో ని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్

మిగతా 2లో..

## సీఎం రేవంత్‌రెడ్డి భద్రతా సమాచారం లీక్
**కేసు నమోదు**

తెలంగాణలో కొత్తగా
## చేయూత పింఛన్లు
**15 వరకు దరఖాస్తులు స్వీకరణ**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ

మిగతా 2లో..



## రేపు ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసన సభా పక్ష సమావేశం
**పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని మాజీ సీఎం కేసీఆర్ సూచన**

2లో..

## నింగిలోకి 'ఇస్రో'
# నిఘా నేత్రం



- విజయవంతంగా కక్ష్యలోకి ఈఓఎస్-05 (జీశాట్-1ఏ) ఉపగ్రహం
- జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్

**తిరుపతి(జనంసాక్షి):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఖాతాలో మరో చారిత్రక ఘనత చేరింది. దేశ రక్షణ, విపత్తుల నిర్వహణ రంగాల్లో కీలకమైన 'ఈఓఎస్-05'(జీశాట్-1ఏ) ఉపగ్రహ ప్రయోగం దిగ్విజయం అయింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శుక్రవారం చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 మిషన్ విజయవంతమైంది.

**కచ్చితత్వంతో కక్ష్యలోకి..**

శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 వాహకనౌక మేఘాలను చీల్చుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. సరిగ్గా 18 నిమిషాల తర్వాత(3.13 గంటలకు) 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని సబ్-జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(సబ్-జీటీఓ)లోకి రాకెట్ కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. ఉపగ్రహం పెరీజీ(భూమికి దగ్గరి బిందువు) 170 కి.మీ, అపోజీ(దూరపు బిందువు) 28,934 కి.మీ కక్ష్యలోకి చేరుకుంది. 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న ఈ రాకెట్ ద్వారా చేపట్టిన ప్రతిష్ఠాత్మక జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం కావడం విశేషం.

మిగతా 2లో..

**అంతరిక్షంలో అద్భుత కెమెరా..**

సాధారణంగా లో-ఎర్త్ ఆర్బిట్(లియో), సన్ సింక్రోనస్ ఆర్బిట్లలో ఉండే ఉపగ్రహాలు ఒక ప్రాంతాన్ని ఫొటో తీయడానికి కొన్ని రోజుల నుంచి వారాల సమయం పడుతుంది. కానీ ఈఓఎస్-05 భూస్థిర కక్ష్యలో (జియో ఆర్బిట్) ఉంటూ.. ఒకే ఫ్రేమ్‌లో మొత్తం దక్షిణాసియాను ఫొటో తీయగలదు.

మిగతా 2లో..

'ఇస్రో' విజయం..
## దేశానికి గర్వకారణం
**అంతరిక్ష రంగంలో భారత సాంకేతిక సామర్థ్యానికి ఇది మరొక నిదర్శనం**

**ప్రధాని మోదీ ప్రశంసలు**

2లో..

## సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు
**తనపై వస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించిన కొండా సురేఖ**



**హైదరాబాద్, (జనంసాక్షి):** తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి

మిగతా 2లో..

## కొండా సురేఖ తీరు ఆక్షేపణీయం..
# అందుకే బర్తరఫ్



- హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు
- కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుంది
- క్రమశిక్షణ విషయంలోనూ అంతే కఠినంగా ఉంటుంది
- ఏవరికైనా ఇబ్బందులుంటే నేరుగా పీసీసీ అధ్యక్షుడి వద్దకు వచ్చి చెప్పుకోవచ్చు.
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్(జనంసాక్షి):** కొండా సురేఖ తీరు ఆక్షేపణీయంగా ఉండటంతోనే ఆమెపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుందని.. అయితే క్రమశిక్షణ విషయంలోనూ పార్టీ అంతే కఠినంగా ఉంటుందని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. "కొండా సురేఖ కాంగ్రెస్‌లో కొనసాగుతానని చెప్పారు. పార్టీలో ఉంటే తప్పకుండా అవకాశం ఇస్తాం. గురువారం కొండా సురేఖ ఆవేశం, ఆవేదనతో మాట్లాడారు. ఇకపై అలా మాట్లాడకూడదని సూచిస్తున్నా. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు

మిగతా 2లో..

లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టిన
## పొంగులేటిపై చర్యలేవి?
**హరీశ్ రావు**



**హైదరాబాద్, సెప్టెంబర్3(జనంసాక్షి):** తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని

మిగతా 2లో..

# విద్యుత్ అవసరాల కోసం నీటి విడుదల వద్దు
## కేవలం తాగునీటికే వాడుకోండి




- ఉమ్మడి జలాశయాల్లో తక్కువ నీరు ఉన్నందున పొదుపుగా వాడుకోండి
- ఏపీ,తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా బోర్డు కీలక సూచనలు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఏపీ,తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే జలాశయాల నుంచి నీటిని దిగువకు విడుదల చేయవద్దని సూచించింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలని పేర్కొంది. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పింది. ఉమ్మడి జలాశయాల్లో తక్కువ నీరు ఉన్నందున పొదుపుగా వాడుకోవాలని సూచించింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యమివ్వాలని విభజన చట్టం చెబుతోందని కృష్ణా బోర్డు పేర్కొంది.

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం
**స్పష్టం చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

2లో..

## వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు
# కన్నీళ్లే..
**కేటీఆర్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల నిరసనలు**



**హైదరాబాద్(జనంసాక్షి):** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్‌శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది.వికారబాద్ జిల్లా నవాబ్‌పేటలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు

మిగతా 2లో..

# ఆశలు ఆవిరేనా..
**నేపాల్ విషాదంలో ఇంకా ఆచూకీ లేని 275 మంది భారతీయులు**


**టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం**

**9 రోజుల తర్వాత సజీవంగా బయటపడ్డ ఇద్దరు కార్మికులు**

**ఖాట్మండు(జనంసాక్షి):** నేపాల్ జలప్రళయంలో 275 మంది భారతీయుల ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. నేపాల్‌లో చిక్కుకుపోయిన 166 మందిని అక్కడి సిబ్బంది రక్షించినట్లు తెలిపింది. 1,907 మంది భారతీయులు చైనా నుంచి నేపాల్‌కు సురక్షితంగా చేరుకున్నారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. నేపాల్ వరదల్లో మరణించినవారి సంఖ్య 1,295కు చేరగా, సుమారు 5వేల మంది ఆచూకీ లభ్యం కాలేదు.

మిగతా 2లో..





# భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది
**అప్పుడు మేం వినకపోవడంతో రాజకీయ ఒత్తిడికి గురయ్యే పరిస్థితి వచ్చింది : బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్**


**న్యూఢిల్లీ, సెప్టెంబర్4(జనంసాక్షి):** చైనాపై ఎక్కువగా ఆధారపడిన యూరప్.. ఇప్పుడు దాని ప్రభావాలను ఎదుర్కొంటోందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. ఈ విషయంలో భారత్ మమ్మల్ని ఎప్పుడో హెచ్చరించిందని, అప్పట్లో తాము పట్టించుకోలేదని ఆయన అంగీకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కి వచ్చిన బార్ట్ డి వెవర్.. ఢిల్లీలో

మిగతా 2లో..

'డిజిటల్ అరెస్ట్' కేసులు..
## 20 రాష్ట్రాల్లో సీబీఐ సోదాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** డిజిటల్ మోసాలపై నమోదైన కేసులకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ కీలక ఆపరేషన్ చేపట్టింది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 89 చోట్ల సోదాలు జరిపింది. మూడు కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిని అరెస్టు చేసింది. వారి నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు, డిజిటల్ పరికరాలు, ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. డిజిటల్ అరెస్టుల పేరుతో బాధితుల నుంచి రూ.కోట్ల

మిగతా 2లో..



# సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ సుడిగాలి పర్యటన



ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్?ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**అధికారులకు దిశానిర్దేశం**

430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొండంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కొండా సురేఖ తీరు ఆక్షేపణీయం.. అందుకే బర్తరఫ్

తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటిపై చర్యలేవి?

అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బంధీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు

రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

**కొండా సురేఖకు మరో షాక్..**

రాష్ట్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు వరసగా షాక్‌లు ఇస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ఆమోదంతో దేవాదాయ శాఖ మంత్రి పదవిని కోల్పోయిన ఆమె భద్రతను కుదించింది ప్రభుత్వం. శుక్రవారం సురేఖకు కేటాయించిన గన్‌మెన్లను వెనక్కి పిలిచిన అధికారులు.. ఆమె నుంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు వరసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో, ఢిల్లీ పెద్దల నిర్ణయంతో మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన ఆమె భద్రతను కుదించింది ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 3, గురువారం ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసినందున గన్‌మెన్లను వెనక్కి పిలిచింది సర్కార్. మొన్నటి వరకూ మంత్రి హోదాలో సురేఖకు ఉన్న 4 4 భద్రతను మొత్తంగా తీసేశారు అధికారులు. అంతేకాదు ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే అన్యాయంగా తనను తొలగించారని మండిపడుతున్న సురేఖ ఈ నిర్ణయాలతో మరింత ఆగ్రహంతో ఉన్నారని సమాచారం.

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం

### స్పష్టం చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశంపైనా జగదీశ్‌రెడ్డి స్పందించారు. "పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకునేది లేదని చాలా మంది నేతలకు ఇప్పటికే చెప్పాం. కొండా సురేఖను కూడా పార్టీలోకి తీసుకోం. బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా ఆయన్ను తీసుకునేది లేదు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామంటే పార్టీ తిరస్కరించింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే. ఆరోపణలు చేసింది కొండా సురేఖ కాదు.. ఆమె కుమార్తె. గతంలో రాజగోపాల్‌రెడ్డితో పాటు చాలా మంది నేతలు నేరుగా పార్టీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను తప్పుబట్టారు" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి భద్రతా సమాచారం లీక్

హైదరాబాద్(జనంసాక్షి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన బందోబస్తుకు సంబంధించి రహస్య వివరాలను పోస్టు చేసిన తెలుగు స్క్రైబ్ 'ఎక్స్' ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. సీఎం ప్రధాన భద్రతాధికారి(సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మేరకు కేసు నమోదు చేశారు. జులై 14న ఖైరతాబాద్ ఠాణాలో ఇదే ఫిర్యాదుతో కేసు నమోదవ్వగా.. నగర అదనపు కమిషనర్(క్రైమ్స్) ఆదేశాలతో సైబర్‌క్రైమ్‌కు బదిలీ చేసి రీరిజిస్టర్ చేశారు. ఫిర్యాదులోని వివరాలివీ.. 'సీఎం జడ్ ప్లస్ కేటగిరీ భద్రతకు సంబంధించి అత్యంత రహస్య సమాచారాన్ని తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతాలో బహిర్గతం చేసినట్లు గుర్తించాం. జూన్ 13న సీఎం ఢిల్లీ పర్యటన, నిమిషాల వారీగా షెడ్యూల్, బందోబస్తు ఏర్పాట్ల గురించి ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు, డీజీపీ, సహా కొందరు అధికారులకు వైర్‌లెస్ సందేశం పంపించాం. జడ్ ప్లస్ స్థాయికి అనుగుణంగా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎం బ్లడ్ గ్రూపు, ప్రధాన భద్రతాధికారి ఫోన్ నంబర్లను ఆ సందేశంలో పేర్కొన్నాం. ఈ విషయాలను తెలుగు స్క్రైబ్ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్టు చేయడంతో భద్రతకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర వివరాలు సీఎం పర్యటన కొనసాగుతుండగానే బయటకు వచ్చాయి. వైర్‌లెస్ సందేశం బహిరంగంగా వెలువరించడానికి అనుమతి లేదు. అధికారుల్లోని ఒకరు అక్రమంగా సామాజిక మాధ్యమ ఖాతాకు పంపినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

## భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది

జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. తక్కువ ధరలకే విదేశీ వస్తువులు యూరప్ మార్కెట్‌లోకి భారీగా రావడం వల్లే అక్కడి స్థానిక పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గడిచిన కాలం యూరప్‌కు ఒక మేలుకొలుపు. చాలా కాలంగా తక్కువ ధరలకు భారీగా వస్తువులు మా మార్కెట్‌లోకి వచ్చాయి. దాంతో మా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి పెరిగింది. చివరికి ఆ ఆధారపడటాన్నే రాజకీయ ఒత్తిడికి ఉపయోగించే పరిస్థితి వచ్చింది" అని డివెవర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా చైనా పేరును ప్రస్తావించలేదు, కానీ చైనా నుంచే యూరప్ మార్కెట్‌లోకి చౌకధరల వస్తువులు రావడంతో.. ఆయన చైనాను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు అందరికీ అర్థమవుతోంది. "మే గుర్తించకముందే భారత్ ఈ ప్రమాదాన్ని చూసింది. మమ్మల్ని హెచ్చరించింది. కానీ మేమే వినలేదు" అని డి వెవర్ ఒప్పుకొన్నారు. ఒక దేశంపై ఆర్థికంగా ఎక్కువగా ఆధారపడటం భవిష్యత్‌లో రాజకీయ ఒత్తిడికి కారణమయ్యే అవకాశం ఉందని ఇప్పుడు యూరప్ గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా యూరప్‌ను చాలా కాలం కిందటే హెచ్చరించారని గుర్తు చేశారు. మీ ప్రధాని చాలా కాలం కిందటే యూరప్‌ను హెచ్చరించారు. కానీ అప్పట్లో ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మేం వింటున్నాం" అని బెల్జియం ప్రధాని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌ను అత్యంత ముఖ్యమైన, నమ్మకమైన భాగస్వామిగా బెల్జియం చూస్తోందన్నారు. అదేవిధంగా పాకిస్థాన్‌కు కీలకమైన సైనిక సామగ్రి ఇవ్వబోమంటూ ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ – బార్ట్ డి వెవర్ సమావేశాల సందర్భంగా భారత్ – బెల్జియం రక్షణ రంగ సంస్థల మధ్య పది ఒప్పందాలు కుదిరాయి.

## తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు అబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు,

## రేపు ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసన సభా పక్ష సమావేశం

### పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని మాజీ సీఎం కేసీఆర్ సూచన

హైదరాబాద్(జనంసాక్షి):సెప్టెంబర్ 07 వ తేదీ నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 06 న ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

## ఆశలు ఆవిరేనా..

నేపాల్ విలయంలో గల్లంతైన తమవారు బతికి వస్తారనే ఆశలు సన్నగిల్లుతోన్న వేళ ఓ అద్భుతం జరిగింది. 9 రోజులుగా ఎదురుచూసి.. కొందరి కర్మకాండలు కూడా చేస్తున్న సమయంలో టన్నెల్ నుంచి ఇద్దరు సజీవంగా బయటపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది భోటెకోషి నది ఉప్పొంగడంతో 60 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా దెబ్బతినగా.. పలువురు సిబ్బంది త్రిశూలి 3ఏ టన్నెల్‌లో చిక్కుకుపోయారు. అలా కొట్టుకుపోయిన వారి సంఖ్య 42గా తెలుస్తోంది. తాజాగా సహాయ సిబ్బంది ఇద్దరిని రక్షించడంతో మిగిలిన వారూ ప్రాణాలతో బయటపడతారనే ఆశలు చిగురించాయి. మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్, మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్‌ను సొరంగంలో 170 మీటర్ల లోతు నుంచి కాపాడినట్లు నేపాల్ ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ రాజారామ్ బాస్నెట్ వెల్లడించారు. సహాయక చర్యలను పర్యవేక్షించే అధికారులు, నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మామూలుగా సొరంగం వంటి భూగర్భ ప్రాంతాల్లో కార్మికులు, పర్యాటకులకు సురక్షితమైన ఆక్సిజన్‌తో కూడిన ఎయిర్ ప్యాకెట్స్, ట్రాప్డ్ వాటర్ ఉంటాయి. టన్నెల్ లోపల హానికర వాయువుల కారణంగా ప్రాణాలు కోల్పోకుండా బయటనుంచి పైపులు ద్వారా ఆక్సిజన్ పంపుతుంటారు. మరోవైపు, టన్నెల్‌లో చిక్కుకుపోయిన సందర్భంలో తమను తాము రక్షించుకోవడానికి ఎత్తుగా ఉన్నవైపు వస్తుంటారు. కానీ, నేపాల్ జల ప్రళయంలో రాళ్లు, వరద, బురద పెద్ద ఎత్తున కొట్టుకురావడంతో అవి వారిని కిందికి నెట్టేసి ఉండొచ్చు కూడా. చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉన్నారా..? లేరా..? అనే ఊగిసలాట మధ్య సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బండరాళ్లు, శిథిలాలు తొలగిస్తుండగా.. సమీపానికి వెళ్లేకొద్దీ వారికి లోపల ఉన్నవారి గొంతు సన్నగా వినిపించింది. లోపల దొరికిన నీరు, ఆహారంతో ప్రాణాలు నిలబెట్టుకున్న ఇద్దరు వ్యక్తులు సహాయక సిబ్బందికి కనిపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో వారు సొరంగంలోకి దిగి, ఆ ఇద్దరినీ బయటకు తీసుకొచ్చిన దృశ్యాలను నేపాల్ ఆర్మీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. "ఆశ అందించిన అద్భుత విజయం ఇది" అని పేర్కొంది. "ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్నింటినీ తిరగరాస్తోంది ఎందుకంటే ఇంతకముందెప్పుడు ఈ స్థాయిలో విద్యుత్ కేంద్రాలు ధ్వంసమై, పలు సొరంగాల్లో సహాయక చర్యలు చేపట్టిన పరిస్థితి లేదు. కార్ల పరిమాణంలో ఉన్న రాళ్లను పగలగొట్టాం. ఇద్దరిని కాపాడటంతో లోపల ఉన్నవారు బతికే ఉండొచ్చనే అనుమానానికి ఇప్పుడు మాకు ఆధారం లభించింది. మేం పడిన శ్రమకు ఫలితం కనిపిస్తోంది" అని ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న టన్నెల్ రెస్క్యూ ఎక్స్‌పర్ట్ ఆర్నాల్డ్ డిక్స్ జాతీయ మీడియాతో అన్నారు. 2023లో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన ఆస్ట్రేలియాకు చెందిన ఈ నిపుణుడు.. భారత్‌కు సుపరిచితులు. ప్రస్తుతం టన్నెళ్ల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## నింగిలోకి 'ఇస్రో' నిఘా నేత్రం

భారత ఉపఖండం మొత్తాన్ని కేవలం 10 నిమిషాలకు ఒకసారి చిత్రీకరించి పంపగలదు. ఇందులో అమర్చిన ఎంఎక్స్–వీఎన్ఆర్ పేలోడ్ అద్భుతమైన 42 మీటర్ల(ఒక పిక్సెల్‌కు) స్పేషియల్ రిజల్యూషన్‌ను కలిగి ఉంది. జియో కక్ష్యలో ఇంతటి అత్యుత్తమ రిజల్యూషన్ కలిగిన కెమెరాతో ఉన్న ఉపగ్రహం ప్రపంచంలోనే ఇదే తొలిసారి. ప్రస్తుతం ఇస్రోకు ఉన్న సామర్థ్యంతో పోలిస్తే.. దీని పిక్సెల్ డెన్సిటీ 567 రెట్లు మెరుగ్గా ఉండటం విశేషం. అత్యుత్తమ పాన్‌క్రోమాటిక్(బ్లాక్ అండ్ వైట్) ఇమేజర్లను సైతం వెనక్కి నెట్టి అత్యంత స్పష్టమైన చిత్రాలను తీయగల సత్తా దీని సొంతం.

**రక్షణ, విపత్తుల నిర్వహణలో 'గేమ్ ఛేంజర్'**

సరిహద్దుల్లో శత్రు దేశాలు సైనిక స్థావరాలను ఎంత రహస్యంగా దాచినప్పటికీ.. వాటిని ఇట్టే పసిగట్టే సత్తా ఈ ఉపగ్రహానికి ఉంది. వరదలు, తుపాన్లు, కార్చిచ్చులు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పాత చిత్రాలతో పోల్చుకునే పని లేకుండా.. దాదాపు రియల్–టైమ్‌లో వాటి తీవ్రతను అంచనా వేయవచ్చు. పంటల ఆరోగ్యం, అటవీ ప్రాంతాలు, నీటి వనరుల్లో కాలుష్యం(నాచు), ఖనిజ సంపద పంపిణీ తదితర వివరాలను ఈ హైపర్, మల్టీ స్పెక్ట్రల్స్ కెమెరాలు సులువుగా గుర్తిస్తాయి.

**పాత ఓటమికి బదులు తీర్చుకున్న ఇస్రో**

2021 ఆగస్టులో జీఎస్ఎల్‌వీ–ఎఫ్10 మిషన్ ద్వారా ప్రయోగించిన జీశాట్–1 ఉపగ్రహం విఫలమై కక్ష్యను చేరుకోలేకపోయింది. ఆ చేదు జ్ఞాపకాన్ని చెరిపేస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మరింత మెరుగైన సాంకేతికతతో ఇస్రో ఇప్పుడు ఈఓఎస్–05(జీశాట్–1ఏ)ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చి తన సత్తా చాటింది. ఈ ఏడాది ఆరంభంలో ఎదురైన పీఎస్ఎల్‌వీ వైఫల్యాన్ని సైతం పక్కకునెట్టి ఇస్రో శాస్త్రవేత్తలు సరికొత్త ఉత్సాహంతో అడుగులు ముందుకేశారు.

వర్షంలోనూ తగ్గని ఉత్సాహం..

ఇస్రో శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు చేపట్టిన జీఎస్ఎల్వీ–ఎఫ్17 రాకెట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. రాత్రి 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. వానలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లే అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి ఉత్సాహం చాటారు.

చారిత్రక విజయం : ఇస్రో ఛైర్మన్ నారాయణన్

తిరుపతి: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో చారిత్రక ఘనతను సొంతం చేసుకుంది. శుక్రవారం జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 వాహకనౌక ద్వారా అడ్వాన్స్‌డ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్–05 ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశ పెట్టిందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ మీడియా సమావేశంలో తెలిపారు. ఉపగ్రహాన్ని 170 కి.మీ / 29,000 కి.మీ కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని శాస్త్రవేత్తలు లక్ష్యంగా పెట్టుకోగా, రాకెట్ మరింత మెరుగైన పనితీరును కనబరిచి 171 కి.మీ / 31,026 కి.మీ కక్ష్యలోకి విజయవంతంగా చేర్చిందన్నారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని పేర్కొన్నారు. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో శ్రీహరికోట నుంచి ఇది రెండో విజయవంతమైన మిషన్. మొదటిది స్కైరూట్ స్టార్టప్ ప్రయోగం కాగా.. ఇస్రో(ఎంఖీూ)కు ఈ ఆర్థిక సంవత్సరానికి ఇదే తొలి ప్రయోగం. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు అద్భుతంగా పని చేయడంతో ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించింది. ఈ ఏడాది కమ్యూనికేషన్ ఉపగ్రహాలతో పాటు, గగన్‌యాన్‌కు సంబంధించిన రెండు మానవరహిత ప్రయోగాలు కలుపుకొని మొత్తం ఆరు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని నారాయణన్ తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ థామస్ కురియన్, షార్ డైరెక్టర్ ముత్తుచెజియన్, మిషన్ డైరెక్టర్ ఇంతియాజ్, శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ డీకే సింగ్ వివిధ విభాగాల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఇస్రో అధికారులు బదులిచ్చారు.

**ఈఓఎస్–05 ప్రయోగం దిగ్విజయం**

**కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మువ్వన్నెల పతాకాన్ని అంతరిక్షంలో మరోసారి రెపరెపలాడించింది. జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్–05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ అద్భుత విజయంతో ప్రపంచ అంతరిక్ష శక్తిగా(గ్లోబల్ స్పేస్ పవర్) భారత్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## 'ఇస్రో' విజయం.. దేశానికి గర్వకారణం

న్యూఢిల్లీ(జనంసాక్షి):

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన చరిత్రాత్మక విజయాన్ని ప్రధాని మోదీ అభినందించారు. జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 మిషన్ విజయవంతం కావడం.. దేశానికి గర్వకారణమంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అంతరిక్ష రంగంలో భారత సాంకేతిక సామర్థ్యానికి ఇది మరొక నిదర్శనమంటూ ప్రధాని ప్రశంసలు కురిపించారు. "ఇస్రో సాధించిన మరొక అద్భుతమైన విజయం ఇది. మన దేశానికి ఇది ఎంతో గర్వకారణమైన క్షణం. జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఈవోఎస్–05.. జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 ద్వారా జరిగిన ఈ విజయవంతమైన ప్రయోగం.. భారత అంతరిక్ష రంగం సాధిస్తోన్న అత్యుత్తమ ప్రగతికి, ఆవిష్కరణలకు, విస్తృత సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం మన అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకువెళ్లడంతో పాటు.. ఈ రంగంలో మన సమర్థతను మరింత బలోపేతం చేస్తోంది" అని మోదీ రాసుకొచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 వాహకనౌక మేఘాలను చీల్చుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ వ్యోమనౌక ఈఓఎస్–05 ఉపగ్రహాన్ని సబ్–జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(సబ్–జీటీఓ)లోకి కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. సరిహద్దుల్లో శత్రు దేశాలు సైనిక స్థావరాలను ఎంత రహస్యంగా దాచినప్పటికీ.. వాటిని ఇట్టే పసిగట్టే సత్తా ఈ ఉపగ్రహానికి ఉంది. భవిష్యత్తులో ప్రకృతి విపత్తులను, వాటి తీవ్రతను ఇది అంచనా వేయనుంది.

## వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే..

ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది. స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డుపైనే వంట చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'డిజిటల్ అరెస్ట్' కేసులు..

### 20 రాష్ట్రాల్లో సీబీఐ సోదాలు



డబ్బును దోచుకోవడం, వాటిని ఇతర ఖాతాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ సైబర్ నేరగాళ్లు అనేక రాష్ట్రాల్లో డిజిటల్ అరెస్టులకు పాల్పడుతూ బాధితుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్న విషయం తెలిసిందే. ఈ తరహా నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన సీబీఐ.. మూడు కేసుల్లో ప్రధాన నిందితులను అరెస్టు చేసింది. ఈ మూడు కేసుల్లోనే బాధితులు సుమారు రూ.42 కోట్లు నష్టపోయినట్లు సీబీఐ వెల్లడించింది. బిట్స్ పిలానీకి సంబంధించిన ఓ కేసులో పోలీసు అధికారిగా నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మూడు నెలల పాటు డిజిటల్ అరెస్టు చేశారు. బాధితుడి నుంచి రూ.7.67 కోట్లు దోచుకున్నారు. గుజరాత్‌లో మరో కేసులోనూ పోలీసులుగా నటిస్తూ మరో వ్యక్తి నుంచి రూ.19.24 కోట్లు దోపిడీ చేశారు. కర్ణాటకకు సంబంధించిన కేసులోనూ బాధితుడిని నెల రోజుల పాటు డిజిటల్ అరెస్టు చేసి రూ.14.45 కోట్లు తమ ఖాతాలకు మళ్లించుకోవడం గమనార్హం. అరెస్టైన వారిలో హరియాణాకు చెందిన ఆకాశ్.. తన అకౌంట్లోకి రూ.1.95 కోట్ల నగదు స్వీకరించినట్లు సీబీఐ గుర్తించింది. కోల్‌కతాకు చెందిన రాజ్ కర్మాకర్ ఖాతాలోకి రూ.1.5 కోట్లు, జ్యోతి రాణి అనే యువతి ఖాతాలోకి భారీ మొత్తంలో మోసపూరిత నగదు వచ్చినట్లు సీబీఐ గుర్తించింది. వీటిలో కొంత నగదు విత్‌డ్రా చేయడం, మిగతా మొత్తాన్ని వివిధ ఖాతాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించామని సీబీఐ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

# ఇంటర్‌ను కదిలిస్తే.. సర్కారే కదులుతుంది!



- ఇంటర్ విద్యను రద్దు చేయాలనుకోవడం కొరివితో తలగొక్కున్నట్టే : కవిత
- విలీనం యోచన విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం : జేఏసీ
- 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' సదస్సులో సర్కార్ తీరుపై భగ్గుమన్న వక్తలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవరూ ఇంటర్మీడియట్ విద్యను తీసేస్తామని అనరని బీఆర్ఎస్ నేత, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నాంపల్లిలోని మీడియా అకాడమీలో శుక్రవారం జరిగిన 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' జంగ్ సైరన్ సదస్సులో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలు చూస్తుంటే తుగ్లక్ కూడా సిగ్గుపడతాడని ఎద్దేవా చేశారు. మేధావులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ఇంటర్ విద్యను తీసేయడం కొరివితో తలగొక్కున్నట్టేనని, విద్యార్థుల తల్లిదండ్రులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇంజనీరింగ్ విద్య వేస్ట్ అనడం, వైట్‌కాలర్ ఉద్యోగాలు వదిలి బ్లూకాలర్ ఉద్యోగాలు వెతుక్కోవాలని చెప్పడం సరికాదన్నారు.

ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ ఫిన్లాండ్‌కు వెళ్లి విద్యా విధానాన్ని పరిశీలించే అధికారులకు పక్క రాష్ట్రం ఏపీలో పరిణామాలు తెలుసుకునే తీరిక లేదని విమర్శించారు. పీవీ నరసింహారావు దూరదృష్టితో, కొఠారి సిఫారసుల అనంతరం వచ్చిన ఇంటర్ విద్య ఉన్నత విద్యకు తొలి మెట్టన్నారు. 10 లక్షల మంది విద్యార్థులు, 20 లక్షల మంది తల్లిదండ్రులు, 6 వేల మంది బోధనా సిబ్బంది, 4 వేల మంది బోధనేతర సిబ్బందితో సమర్థంగా పని చేస్తున్న వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. విలీనం యోచనను విరమించుకోకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇంటర్‌ను ముట్టుకుంటే 2028 వరకు సీఎం పదవిలో ఉంటారో లేదో చూసుకోవాల్సి వస్తుందని అన్నారు. సదస్సులో జేఏసీ సెక్రటరీ జనరల్ కృష్ణకుమార్, కో-చైర్మన్ కనకచంద్రం, నేతలు మాధవరావు, బలరాం జాదవ్, రజిత, కవితకిరణ్, లక్ష్మీ, శివకుమార్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో అంబరాన్నంటిన సంబరాలు

- మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్.. టపాసులు, బ్యాండ్ బాజాలతో కాంగ్రెస్ శ్రేణుల సందడి..
- రైతు రుణమాఫీ నుంచి ఇందిరమ్మ ఇండ్ల వరకు.. ప్రజా సంక్షేమమే రేవంత్ సర్కార్‌కు శ్రీరామరక్ష..

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నాంపల్లి గాంధీ భవన్‌లో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) ముఖ్య అతిథిగా హాజరై మెట్టు సాయికుమార్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాలుస్తూ, బ్యాండ్ బాజాల మేళతాళాలతో నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకుని ప్రజాపాలన విజయాన్ని ఆనందంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలు, రైతులు, మహిళలు, యువత జీవితాల్లో సానుకూల మార్పును తీసుకొస్తున్నాయని మెట్టు సాయికుమార్ అన్నారు. పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. "ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలే బలం" అని పేర్కొన్న ఆయన.. ప్రజా సంక్షేమాన్ని మరింత విస్తరించడంతో పాటు తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజలు, పార్టీ శ్రేణులు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతులకు అండగా దాదాపు 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సుమారు రూ.18 వేల కోట్ల నిధుల విడుదల, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు వంటి చర్యలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి ఉచిత



బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. యువతకు 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పింఛన్లు, సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం వంటి చర్యలను వివరించారు.

కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల దిశగా చర్యలతో పాటు మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నాయకులు పేర్కొన్నారు. 1000 రోజుల ప్రజాపాలనను ప్రజల విజయంగా అభివర్ణించిన మెట్టు సాయికుమార్.. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం



- కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** సమాజంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలువురు నూతన వధూవరులను ఆశీర్వదించి, మండలంలోని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, పెన్షన్స్, రైతు భరోసా, పారిశ్రామిక విధానం, విద్య, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యత ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా పని చేస్తుందన్నారు. ప్రతి పక్షాల అనవసర మాటలు పట్టించుకునే స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వం లేదన్నారు. ప్రజా పాలనకు మేము కట్టుబడి ఉన్నామని వివరించారు. మాకు ప్రజల దీవెనేలే ముఖ్యమని, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్ని నిధులు అయినా కేటాయించి అభివృద్ధి చేస్తారని వివరించారు. అంతకుముందు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు,రియల్ ఎస్టేట్ వ్యాపారి నరేందుల సతీష్, మూల కిషన్ గౌడ్ కుటుంబాల నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పలు రకాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం చందారంలో మాజీ ఏంపీపీ అన్నం మంగ చిన్నన్న,తాజా మాజీ జడ్పీటీసీ ముత్తే సత్తయ్య కుటుంబాలను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంతెన జగన్ మోహన్ రావు,కౌన్సిలర్లు రాయలింగు, రాజేంద్ర ప్రసాద్,బిరుదుల సత్యనారాయణ, గుల్లకోట సర్పంచ్ దేవమ్మ భీమయ్య, ఉప సర్పంచ్ భూపెల్లి మల్లేష్,నాయకులు పెరుగు తిరుపతి,మినుముల శాంతి కుమార్,రంజిత్ సింగ్,అమీర్,గౌస్,రషీద్,తొగరు రాజు,దమ్మ సునీల్,దండేపల్లి మాజీ ఏంపీపీ గడ్డం శ్రీనివాస్,వైస్ ఏంపీపీ ఆకుల రాజేందర్, కొండ నరేష్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే రాజీనామా చెయ్..

- సీఎంను ఏమైనా అంటే ఊరుకోం
- ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య
- మాజీ మంత్రి కొండా సురేఖకు స్ట్రాంగ్ వార్నింగ్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 04 ( జనం సాక్షి) :** దమ్ముంటే రాజీనామా చెయ్ ఇండిపెండెంట్గా వరంగల్ తూర్పు నుంచి నిలబడు, నేను కూడా ఇండిపెండెంట్గా నిలబడతా ఎవరి సత్తా ఏందో చూసుకుందాం అని మాజీ మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. వరంగల్ నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు చాలామంది బసవరాజు సారయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గం లో తనకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు బాగా పరిచయమని, తన మంచితనం గురించి ప్రజలందరికీ తెలుసని అన్నారు.ఇన్ని సంవత్సరాలు ప్రజల రక్తం తాగిన మీరు, ఈరోజు బీసీ కార్డు వాడుకుంటున్నారు.

బీసీలను అణగదొక్కింది మీరు కాదా అని సారయ్య సురేఖను ప్రశ్నించారు.ముఖ్యమంత్రిని తిడితే ఊరుకోము అన్నారు. కొండా సురేఖ మీద హై కమాండ్ కి కంప్లైంట్ చేసింది నేనే అని సారయ్య అన్నారు.బ్లాక్ మెయిల్ కల్చర్ చేసేది కొండా సురేఖనే అన్నారు.250 మూగజీవాలను కాల్చింది ఎవరు?, కాలిపోయిన స్థలం ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ అయ్యి ఉన్నది అని సారయ్య అడిగారు. ఏ పార్టీలో ఉన్నా కూడా ఆ పార్టీలో తగవులు పెట్టుకునే రకం కొండా సురేఖ తత్వం అని సారయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏ రోజు కూడా సరైన సేవలు అందించలేదని అన్నారు. ఈ సందర్భంగా బసవరాజు సారయ్య వెంట తాజా మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, పోలా నటరాజ్ తదితరులు ఉన్నారు.

# రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

- బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు నేను ముందే చెప్పాను..
- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** "కేసీఆర్‌కు ముందే చెప్పాను. రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే" అని ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సైదాబాద్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము గతంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చామని, అది నిజం అన్నారు. కానీ తాను పదే పదే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా చెబుతూనే ఉండేవాడినన్నారు. రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోండి.. లేకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని చెప్తుండేవాడనన్నారు. "ఇప్పుడు ముఖ్యమైన విషయం ఏమిటంటే... సీఎం సాబ్, మీరు కాస్త మరీ ఎక్కువ మర్యాదస్తుడిగామారిపోయారు. కాస్త మీ పాత దూకుడు చూపించండి, ప్రజల్లోకి రండి. మిమ్మల్ని ఏ విషయం ఆపుతోందో నాకైతే అర్థం కావడం లేదు. హనుమంతరావు సాబ్, మీరేమైనా చెబుతారా వచ్చి? నేను చెప్పింది తప్పు కాదు కదా? మీరు కూడా నాతో ఏకీభవిస్తున్నారు కదా... మీరు ఒప్పుకుంటున్నారు... మీరొక సీనియర్ నాయకులు, మీరే ఒప్పుకున్నారంటే ఇక అంతే, నేను సరైన మాటే చెప్పాను. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, యావత్ తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ ప్రగతి సాధించాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.



ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీపై ప్రశంసలు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఓవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమనే ప్రచారం కేవలం కొందరి దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. అసదుద్దీన్ ఓవైసీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్బరుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీలతో కలిసి పాతబస్తీ అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. గతంలో ఎంతమంది సీఎంలు ఓల్డ్ సిటీకి వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీ అభివృద్ధికి అసదుద్దీన్ ఓవైసీ ఏ ప్రతిపాదన తీసుకొచ్చినా పరిశీలించి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.



## తీవ్ర కలకలం రేపిన గుంటూరు

# బాలిక కిడ్నాప్ కేసు

**అమరావతి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

# ఫుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం..

- డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 (జనంసాక్షి) :** విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది. వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ-2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్-నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కో-పైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

# జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు

- కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు



**హైదరాబాద్, సెప్టెంబర్4 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. గురువారం రాత్రి తీజ్ వేడుకల్లో ఓ విద్యార్థిపై దాడిచేయడంతో ఘర్షణగా మారింది. అనంతరం గౌతమి, మంజీరా హాస్టళ్లలోని విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో జేఎన్టీయూ రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనతో మిగతా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హాస్టల్ సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని విద్యార్థులను నిలువరించారు. విషయం తెలుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు.. హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌లో తీజ్ కార్యక్రమం సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం మొదలైంది. దీంతో మాటా మాటా పెరిగి.. ఘర్షణగా మారింది. ఈ ఘటనపై వర్సిటీ యాజమాన్యం విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మొలకల పండుగ తీజ్. ప్రకృతి ఆరాధన వేడుకల్లో అవివాహిత యువతులదే ప్రధాన పాత్ర. ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్టమట్టితో వస్త్రంలో గోధుమలను విత్తుతారు. తొమ్మిది రోజుల పాటు మూడు పూటలా నీరు పోసి మొలకలు పెంచుతారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్ మహారాజ్, ఇతర దేవతలను ప్రార్థిస్తారు. భజనలు, ఆటపాలలతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
05 సెప్టెంబర్ 2026

## కేంద్ర ఉద్యోగులకు పౌరహక్కులు వర్తించవా?

సంపాదకీయం

ఉద్యోగం ఇచ్చామంటే పౌరసత్వాన్ని తాకట్టు పెట్టుకోవాలా? ప్రభుత్వ కొలువులో చేరాడంటే గొంతు మూయించాలా? కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై మరింత కఠినమైన నియంత్రణలు తీసుకురావాలన్న ఆలోచన చేస్తోందన్న వార్తలు ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి కావడం అంటే పౌరహక్కులను వదులుకునే ఒప్పందం కాదు. ఉద్యోగి ముందు పౌరుడు.. ఆ తర్వాతే ప్రభుత్వ సేవకుడు. రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటనా స్వేచ్ఛకు జీతం తీసుకుంటున్నాడన్న కారణంతో వేరే కొలమానం ఉండకూడదు.

ప్రభుత్వ ఉద్యోగుల విధుల్లో నిష్పక్షపాతం, గోప్యత, క్రమశిక్షణ తప్పనిసరి. కానీ విధి నిర్వహణలో తటస్థతకు, వ్యక్తిగత పౌరుడిగా అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి మధ్య ఉన్న గీత చెరిగిపోకూడదు. విధుల్లో రాజకీయ పక్షపాతం చూపకూడదనేది సమర్థించదగిన నియమం. కానీ ప్రభుత్వం మీద ప్రశ్న అడిగినా, సామాజిక సమస్యపై స్పందించినా, ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపినా అది క్రమశిక్షణా రాహిత్యంగా మారితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమే. ఈ దేశ చరిత్రను తిరగేస్తే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కేవలం కార్యాలయాలకే పరిమితమైన వర్గం కాదని స్పష్టమవుతుంది. స్వాతంత్ర్యోద్యమంలో అనేకమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ ఉద్యోగాలను సైతం పణంగా పెట్టి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. తరగతి గదులను వదిలి గ్రామగ్రామాన తిరిగి ప్రజల్లో చైతన్యం నింపారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా భూసంస్కరణల నుంచి ప్రజా హక్కుల ఉద్యమాల వరకు, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల నుంచి సమాచార హక్కు కోసం జరిగిన ఉద్యమాల వరకు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల పాత్ర కీలకంగా ఉంది. విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, ప్రభుత్వ ఉద్యోగులు వీధుల్లోకి వచ్చి ఉద్యమానికి మేధో బలం, సంఘటిత శక్తిని అందించిన విషయం చరిత్రలో సజీవంగానే ఉంది. అలాంటి చరిత్ర కలిగిన దేశంలో ఇప్పుడు ఒక సోషల్ మీడియా పోస్టు చేశాడని ఉద్యోగి గొంతుకు తాళం వేయాలనుకోవడం ఆ వారసత్వానికే అవమానం.

ప్రత్యేకంగా విశ్వవిద్యాలయ ఆచార్యుల విషయంలో ఈ అంశం మరింత సున్నితమైనది. ఆచార్యుడు కేవలం పాఠాలు చెప్పే ఉద్యోగి కాదు. సమాజాన్ని చదవడం, ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, ప్రజలను చైతన్యపరచడం కూడా విద్యా వ్యవస్థలో భాగమే. విశ్వవిద్యాలయాలు నాలుగు గోడల మధ్య పాఠాలు చెప్పే కేంద్రాలు మాత్రమే కావు. అవి సమాజాన్ని ఆలోచింపజేసే వేదికలు. అందుకే ఒక ఆచార్యుడు తన వృత్తిపరమైన విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాలని కోరడం సమంజసం. కానీ అదే పేరుతో అతడి వ్యక్తిగత పౌరస్వేచ్ఛను పూర్తిగా హరించడం మాత్రం సమర్థనీయం కాదు. అస్పష్టమైన, అనిర్దిష్టమైన "ప్రవర్తనా నియమావళి" పేరుతో వచ్చే ఆంక్షలే మరింత ప్రమాదకరం. ఏది తప్పు? ఏది నేరం? ఏది క్రమశిక్షణా ఉల్లంఘన? అన్నది స్పష్టంగా లేకపోతే ఆ నిబంధనలు అధికారుల చేతుల్లో ఆయుధాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించిన ఉద్యోగిపై చర్య తీసుకోవచ్చు. సామాజిక సమస్యపై మాట్లాడిన ఉద్యోగిని హెచ్చరించవచ్చు. చివరికి "క్రమశిక్షణ" అనే పదం ఉద్యోగి గొంతును నొక్కే సాధనంగా మారవచ్చు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై మాట్లాడడం, అవినీతిని ఎత్తిచూపడం వంటి చర్యలను క్రమశిక్షణా రాహిత్యంగా ముద్ర వేస్తే ఉద్యోగుల్లో భయం పెరుగుతుంది. భయంతో పనిచేసే వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థ కాదు. అయితే ఉద్యోగుల సోషల్ మీడియా స్వేచ్ఛకు ఎలాంటి పరిమితులూ ఉండకూడదని చెప్పడం కూడా సరైంది కాదు. ప్రభుత్వ రహస్యాలను బహిర్గతం చేయడం, అధికారిక సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, తప్పుడు అధికారిక సమాచారం ప్రచారం చేయడం, విధుల్లో రాజకీయ పక్షపాతం చూపడం వంటి అంశాలపై స్పష్టమైన నియంత్రణలు అవసరం. కానీ నియంత్రణకు, గొంతు నొక్కడానికి మధ్య ఉన్న తేడాను ప్రభుత్వం గుర్తించాలి. ఉద్యోగి విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాలి. అదే సమయంలో పౌరుడిగా ఆలోచించే, మాట్లాడే హక్కును కూడా కలిగి ఉండాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ప్రజాస్వామ్య పరిపక్వతకు కొలమానం.

ప్రభుత్వం ప్రజాధనంతో ఉద్యోగుల జీతాలు చెల్లిస్తుందన్న వాదనతో వారి పౌరహక్కులను పూర్తిగా పరిమితం చేయడం తగదు. పౌరసత్వాన్ని తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఉద్యోగి ప్రజల సేవకుడు.. రాజకీయ అధికారానికి విధేయుడిగా ఉండాల్సిన వ్యక్తి కాదు. ప్రభుత్వాలు మారుతాయి. పాలకులు మారుతారు. కానీ రాజ్యాంగ విలువలు మారకూడదు. అవినీతిని ప్రశ్నించే ఉద్యోగి గొంతు మూగబోతే నష్టపోయేది ఎవరు? ప్రజా సమస్యపై మాట్లాడే ఉపాధ్యాయుడి కలం ఆగిపోతే లాభపడేది ఎవరు? ప్రభుత్వ తప్పిదాన్ని చూపించే ఉద్యోగిని "క్రమశిక్షణా రాహిత్యం" పేరుతో భయపెడితే చివరికి మిగిలేది భయంతో పనిచేసే వ్యవస్థ మాత్రమే. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించే హక్కు ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం కాదు. అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియ. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పౌరహక్కులు వర్తించవా? ఉద్యోగంలో చేరినంత మాత్రాన పౌరుడి గొంతు మూగబోవాలా? ప్రభుత్వ సేవ అంటే రాజుకు సేవ చేయడమా.. ప్రజలకు సేవ చేయడమా? ఉద్యోగం ఇచ్చిన చేయి పౌరహక్కులను లాక్కునే చేయిగా మారకూడదు. ప్రభుత్వ ఉద్యోగుల విధి నిర్వహణను క్రమబద్ధీకరించండి. అవసరమైన చోట బాధ్యతలు విధించండి. తప్పు చేస్తే చర్యలు తీసుకోండి. కానీ అభిప్రాయాన్ని నేరంగా మార్చకండి. ప్రశ్నను క్రమశిక్షణా రాహిత్యంగా చిత్రీకరించకండి. పౌరుడి గొంతుకు ప్రభుత్వ ఉద్యోగం సంకెళ్లు కాకూడదు. ఎందుకంటే ఉద్యోగి గొంతును మూయించడం అంటే ఒక వ్యక్తి స్వేచ్ఛను మాత్రమే కట్టడి చేయడం కాదు.. ప్రజాస్వామ్యంలో ఒక ప్రశ్నించే గొంతును కోల్పోవడం.

## జర్నలిస్ట్ గౌరీ లంకేష్ ఆచరణలో ముందుకెళ్దాం



సెప్టెంబర్ 5
జర్నలిస్టు గౌరీ లంకేష్ వర్ధంతి

2013 ఆగస్టు 20న నరేంద్ర దబోల్కర్ హత్యతో ప్రారంభమైన మేధావులు, హేతువాదుల హత్యల పరంపర 2015లో గోవింద్ పన్సారే, ప్రొఫెసర్ ఎం.ఎం. కల్బుర్గి హత్యలతో కొనసాగి, 2017 సెప్టెంబర్ 5న జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్యతో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ హత్యల వెనుక పరస్పర సంబంధాలు ఉన్నాయనే దర్యాప్తు సంస్థల వాదనలు, అనుమానాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. మేధావులు, హేతువాదులు, ప్రజాస్వామికవాదులు తుపాకీ గుళ్లకు బలవుతున్నప్పటికీ, ఇటువంటి ఘటనలను నిరోధించడంలో ప్రభుత్వాల వైఫల్యం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తింది.

నరేంద్ర దబోల్కర్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ దృక్పథం కోసం పోరాడారు. గోవింద్ పన్సారే సామాజిక సమానత్వం, లౌకికవాదం కోసం పనిచేశారు. ఎం.ఎం. కల్బుర్గి మత ఛాందసవాదాన్ని, మూఢ విశ్వాసాలను ప్రశ్నించారు. గౌరీ లంకేష్ కూడా కుల వ్యవస్థ, మత ఛాందసవాదం, అసమానతలను తీవ్రంగా ప్రశ్నిస్తూ భావప్రకటన స్వేచ్ఛకు అండగా నిలిచారు. వారి ఆలోచనల్లో భిన్నత్వం ఉన్నప్పటికీ, శాస్త్రీయ దృక్పథం, సామాజిక న్యాయం, లౌకికత, ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత వారందరిలోనూ కనిపిస్తుంది.

గౌరీ లంకేష్ 2017 సెప్టెంబర్ 5న బెంగళూరులోని రాజరాజేశ్వరి నగర్‌లో తన నివాసం వద్ద కాల్పుల్లో హత్యకు గురయ్యారు. ఆమె హత్య దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. హత్య వెనుక హిందూత్వ తీవ్రవాద భావజాలానికి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందనే ఆరోపణలు, దర్యాప్తులు వెలుగులోకి వచ్చాయి. అయితే ఏ సంస్థ లేదా రాజకీయ నాయకుడినైనా న్యాయపరమైన నిర్ధారణ లేకుండా హంతకులుగా పేర్కొనడం సరికాదు. అసలు ప్రశ్న మాత్రం ఒకటే ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కును కాపాడే బాధ్యత ప్రభుత్వాలపై లేదా?

గౌరీ లంకేష్ తన రచనలు, ప్రసంగాల ద్వారా కుల వివక్షను, మత ఛాందసవాదాన్ని, మూఢనమ్మకాలను ప్రశ్నించారు. మహిళలకు సమాన హక్కులు, సామాజిక సమానత్వం, లౌకిక విలువలు, భావప్రకటన స్వేచ్ఛ కోసం ఆమె గళమెత్తారు. అందుకే ఆమెను కేవలం ఒక జర్నలిస్టుగా కాకుండా, ప్రశ్నించే గొంతుకగా గుర్తించాలి. ఆమె హత్య ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు; ప్రశ్నించే హక్కుపై జరిగిన దాడిగా ప్రజాస్వామిక వర్గాలు భావించాయి.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి జీవించే హక్కు, భావప్రకటన స్వేచ్ఛను కల్పించింది. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, సామాజిక వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. ప్రశ్నించడమే నేరంగా మారితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం. ప్రజల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు విమర్శలను సహించగలిగే స్థాయిలో ప్రజాస్వామికంగా వ్యవహరించాలి.

మూఢనమ్మకాలపై పోరాటం కూడా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమే. ఒకవైపు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం పురోగమిస్తున్న సమయంలో మరోవైపు చేతబడి, మూఢనమ్మకాల పేరుతో మనుషులపై దాడులు, సజీవదహనాలు, సామాజిక బహిష్కరణలు జరుగుతున్నాయి. ఈ వైరుధ్యాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. శాస్త్రీయ ఆలోచనను ప్రజల్లో పెంపొందించడం ప్రభుత్వాలు, విద్యావేత్తలు, మేధావులు, ప్రజాసంఘాల బాధ్యత.

ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో పూర్తయ్యేది కాదు. ప్రజల హక్కులు, భావప్రకటన స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత, సామాజిక న్యాయం అమలులో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఆధిపత్య కులాలు, మత ఛాందసవాద శక్తులు లేదా అధికార వ్యవస్థలు ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలి. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, కార్మికులు, ప్రజా ఉద్యమకారుల హక్కులను రక్షించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత.

దేశంలో హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తలు, మేధావులు, జర్నలిస్టులపై కేసులు, నిర్బంధాలు, బెదిరింపులు, దాడుల ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులు ప్రజల్లో భయాన్ని కలిగిస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ఉండాలి. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా తాత్కాలికంగా నిశ్శబ్దం సాధించవచ్చేమో కానీ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేం.

గౌరీ లంకేష్ హత్యకు సంబంధించిన దర్యాప్తు, నిందితులపై న్యాయపరమైన చర్యలు వేగంగా, పారదర్శకంగా సాగాల్సిన అవసరం ఉంది. మేధావుల హత్యలపై దర్యాప్తులు ఏళ్ల తరబడి కొనసాగడం, న్యాయం ఆలస్యం కావడం ప్రజల్లో న్యాయవ్యవస్థపై అనుమానాలకు తావిస్తుంది. నిందితులు ఎంత ప్రభావవంతులైనా చట్టం ముందు సమానమే అన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలి.

ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో రాజకీయ పార్టీలకు కూడా బాధ్యత ఉంది. మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు బదులు రాజ్యాంగ విలువలను ముందుకు తీసుకెళ్లాలి. అన్ని మతాలు, అన్ని వర్గాలు సమాన గౌరవంతో జీవించే లౌకిక వ్యవస్థను బలోపేతం చేయాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటమే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం.

గౌరీ లంకేష్ వర్ధంతి సందర్భంగా ఆమెను స్మరించుకోవడం అంటే కేవలం నివాళులు అర్పించడం కాదు. ఆమె ప్రశ్నించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, కుల-మత వివక్షను వ్యతిరేకించడం, భావప్రకటన స్వేచ్ఛను కాపాడటం, ప్రజాస్వామ్య హక్కుల కోసం నిలబడటం అవసరం. గౌరీ లంకేష్ వంటి గొంతుకలు హత్యకు గురైనప్పటికీ, వారి ఆలోచనలను హత్య చేయడం సాధ్యం కాదు.

ప్రభుత్వాలు ప్రజలను భయపెట్టి, బెదిరించి పాలించడం ద్వారా కొంతకాలం నిశ్శబ్దాన్ని సాధించవచ్చు. కానీ ప్రజల ఆకాంక్షలను గౌరవించే ప్రజాస్వామిక పాలన మాత్రమే శాశ్వతంగా నిలుస్తుంది. ప్రశ్నించే హక్కు, ఆలోచించే స్వేచ్ఛ, శాస్త్రీయ దృక్పథం, సమానత్వం, లౌకికత ఇవే ప్రజాస్వామ్యానికి పునాదులు.

అందుకే గౌరీ లంకేష్ వర్ధంతి సందర్భంగా మనం ఆమెను స్మరించుకోవడమే కాకుండా, ఆమె ఆశయాలను ఆచరణలోకి తీసుకెళ్లాలి. హత్యలకు, ద్వేషానికి, మూఢనమ్మకాలకు, మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యంగా నిలవాలి. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, భావప్రకటన స్వేచ్ఛను కాపాడేందుకు నిరంతరం ప్రజల్లో చైతన్యం కల్పించాలి. గౌరీ లంకేష్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు నిజమైన నివాళి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఆమె ఆశయాలకు ఆచరణాత్మక రూపం.



ఎన్.నారాయణరావు
ప్రధాన కార్యదర్శి,
పౌరహక్కులసంఘం

### పుడమి వేల్పు

గురువు పండ్ల తరువు
కూర్మికిని నెలవు
గురువు రాజహంస
పరిహరించి
మంచి చెడుల చూపు
మహనీయ మనిషి
పూజనీయ గరువు
పుడమి వేల్పు

రేడియమ్
9291527757

### జలఖడ్గం

హిమానీ నదుల వలయం
వరద బురదల విలయం
యల్ నినో గారి ప్రభావం
ప్రకృతి వికృత స్వరూపం

నేపాల్ అయోమయం
జన విలాపాల నిలయం
విగత జీవులతో కలకలం
కలుషిత గాలులే ప్రళయం

గ్రామ రూపురేఖలు
మటుమాయం
ప్రజలు ప్రవాహంలో

కనుమరుగవడం
పెను విపత్తుల రుద్ర ప్రాంగణం
గృహాలను కబళించిన జలఖడ్గం
ఆచూకీ లేని పౌరులదృశ్యం
నోరుజారి మాట పెగలక విషాద
భరితం
సహాయ సేవకుల కన్నీటి వదనం
కనివిని ఎరుగని మరణ

మృదంగం
మనుగడ సాగడమిక అబద్ధం
తోడు నీడలు కరువై కుమలడం
గుండెను బండగా మార్చలేం
నిండుగా జగతిలో బతకలేం

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్

## విలువలతోనే గురువుకు గౌరవం



సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి అయిన సెప్టెంబర్ 5ను దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం 1962 నుంచి ఆనవాయితీగా మారింది. భారత తొలి ఉపరాష్ట్రపతిగా, అనంతరం రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత ప్రస్థానం ఉపాధ్యాయ వృత్తి గొప్పతనానికి ప్రతీక. ఆయన రాష్ట్రపతిగా ఉన్న సమయంలో తన జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవాలని శిష్యులు, శ్రేయోభిలాషులు కోరగా, "నా పుట్టినరోజును ప్రత్యేకంగా జరుపుకోవడం కంటే సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటే నాకు ఎంతో ఆనందం" అని సూచించారు. అప్పటి నుంచి సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవంగా చరిత్రలో నిలిచిపోయింది.

అన్ని ఉద్యోగాల మాదిరి కాదు ఉపాధ్యాయ వృత్తి. విద్యార్థుల ఆశయాలను, ఆకాంక్షలను గుర్తించి వాటి సాకారానికి మార్గనిర్దేశం చేయాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులది. ఒక ఉపాధ్యాయుడు తన ఉద్యోగ జీవితంలో వేలాది మంది విద్యార్థులతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం కలిగి ఉంటాడు. తన నడవడి, ప్రవర్తన, బోధన ద్వారా వారి జీవితాలను ప్రభావితం చేయగలడు. అందువల్ల మంచి ఉపాధ్యాయులు కేవలం మంచి విద్యార్థులనే కాదు, మంచి సమాజాన్ని కూడా నిర్మించగలరు. గురువు మాటకంటే గురువు జీవన విధానమే విద్యార్థిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది.

సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న జన్మించారు. తత్వవేత్తగా, ఉపాధ్యాయుడిగా, విద్యావేత్తగా, దౌత్యవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలు అపూర్వమైనవి. భారతీయ తత్వశాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. ప్రాచ్య, పాశ్చాత్య తత్వశాస్త్రాల మధ్య వారధిగా నిలిచిన ఘనత రాధాకృష్ణన్‌ది. భారతీయ తాత్విక సంప్రదాయాన్ని ఆధునిక ప్రపంచానికి అర్థమయ్యే రీతిలో వివరించి ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని సంపాదించారు.

"ది హిందూ వ్యూ ఆఫ్ లైఫ్", "ఇండియన్ ఫిలాసఫీ", "అన్ ఐడియలిస్ట్ వ్యూ ఆఫ్ లైఫ్" వంటి రచనల ద్వారా ఆయన ప్రపంచఖ్యాతిని పొందారు. భారతీయ తత్వశాస్త్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ఆయన రచనలు కీలక పాత్ర పోషించాయి.

రాధాకృష్ణన్ దృష్టిలో ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను బోధించే వ్యక్తి కాదు. ఆయన విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శిల్పి, సమాజ భవిష్యత్తును నిర్మించే నిర్మాత. ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి? విద్యార్థి ఉపాధ్యాయ సంబంధం ఎలా ఉండాలి? ఎలాంటి లక్షణాలు ఉంటే గురువుకు నిజమైన గౌరవం లభిస్తుంది? సమాజం పట్ల ఉపాధ్యాయుని బాధ్యత ఏమిటి? వంటి అంశాలకు ఆయన ఆలోచనల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

ఉపాధ్యాయ వృత్తికి ప్రతిభ ఒక్కటే కొలమానం కాదు. ప్రతిభతో పాటు సత్యనిష్ఠ, నిజాయితీ, దయ, కరుణ, మైత్రి, వినయం, అణకువ, ఆత్మనిగ్రహం, నిరంతర అధ్యయనం, బాధ్యతాయుతమైన బోధన వంటి విలువలు ఉండాలి. ఒక ఉపాధ్యాయుడు తన మాటల ద్వారా బోధించే దానికంటే తన ఆచరణ ద్వారా విద్యార్థులకు నేర్పించేది ఎక్కువ. "సమాజంలో గుణాత్మకమైన మార్పును తీసుకురావాలంటే ఉపాధ్యాయులు ముందుగా తమలో నైతిక, సామాజిక, ప్రజాస్వామ్య, శాస్త్రీయ, మానవీయ విలువలను పెంపొందించుకోవాలి."ఉపాధ్యాయునికి ఉండాల్సిన లక్షణాలు, ఆశయాలు, విధులు, విద్యా వ్యవస్థ లక్ష్యాలపై రాధాకృష్ణన్ లోతైన ఆలోచనలు చేశారు. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే కేంద్రాలుగా కాకుండా, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, మానవీయ విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించే నాగరికతా కేంద్రాలుగా భాసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. మన విద్యావిధానం విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీయాలి. వారిని కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. మానసిక పరిపక్వతతో పాటు సామాజిక చైతన్యం, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవన విధానం కూడా విద్యలో భాగం కావాలి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి ప్రజాస్వామ్య విలువలను విద్యాసంస్థలు కాపాడాలి. అందుకు ఉపాధ్యాయులే విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి.

అయితే నేడు విద్యా వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఉపాధ్యాయులపై పెరుగుతున్న పనిభారం, మారుతున్న విద్యా విధానాలు, వాణిజ్య ధోరణులు, సాంకేతిక పరిణామాలు, విలువల క్షీణత వంటి అంశాలు బోధనా ప్రక్రియపై ప్రభావం చూపుతున్నాయి. విద్యా ప్రమాణాలు క్షీణించడానికి ఉపాధ్యాయులను మాత్రమే బాధ్యులను చేయడం సమంజసం కాదు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం, తల్లిదండ్రులు అందరూ విద్యాభివృద్ధిలో తమ బాధ్యతను నిర్వర్తించాలి. అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా నిరంతర అధ్యయనం, విషయ పరిజ్ఞానం, నూతన బోధనా పద్ధతులు, మానవీయ విలువల పెంపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హక్కులు ఎంత ముఖ్యమో, బాధ్యతలు కూడా అంతే ముఖ్యమనే స్పృహ ఉపాధ్యాయ వృత్తికి ఉండాలి.నేటి డిజిటల్ యుగంలో సమాచారం విద్యార్థులకు సులభంగా అందుబాటులోకి వచ్చింది. కానీ సమాచారాన్ని జ్ఞానంగా, జ్ఞానాన్ని వివేకంగా, వివేకాన్ని విలువలతో కూడిన జీవనంగా మార్చేది మాత్రం గురువే. అందుకే సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా ఉపాధ్యాయుని స్థానాన్ని మరెవరూ భర్తీ చేయలేరు.గురువును కేవలం ఒక రోజున సన్మానించడం కాదు; ఆయన బోధించిన విలువలను ఆచరించడం, ఉపాధ్యాయ వృత్తికి అవసరమైన గౌరవాన్ని సమాజం కల్పించడం, విద్యను వ్యాపారంగా కాకుండా వ్యక్తిత్వ నిర్మాణానికి సాధనంగా చూడడమే నిజమైన ఉపాధ్యాయ దినోత్సవం.

(ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా)



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్
రాష్ట్ర అధ్యక్షులు
పూలే ఆశయ సాధన సమితి, తెలంగాణ

## మనిషికి విద్య అవసరం.. ఉపాధ్యాయుడు అవసరమేనా..?

**సెప్టెంబర్ 5 వస్తే మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటాం. వారి గొప్పదనం గురించి మాట్లాడుతాం. వాళ్లు మన జీవితాలను తీర్చిదిద్దారని చెబుతాం. ఇవన్నీ నిజమే. కానీ ప్రతి సంవత్సరం అదే మాటను పునరావృతం చేయడం కంటే ఒకసారి అసలు ప్రశ్ననే అడిగి చూద్దాం. మనిషికి విద్య అవసరమే. కానీ ఆ విద్య కోసం ఉపాధ్యాయుడు ఎందుకు అవసరం?**

మనిషి పుట్టినప్పుడు అతని మనసు ఒక కాళీ పుస్తకమే. కానీ ఆ పుస్తకంలో ఏ అక్షరాలు పడాలో అతనికి తెలియదు. అతను పాఠశాలకి వెళ్లకముందే నేర్చుకోవడం మొదలుపెడతాడు. ఇంట్లో ఎవరి మాటకు భయపడాలో, ఎవరిని గౌరవించాలో, ఎవరిని దూరంగా ఉంచాలో,ఏది తనదో ఏది పరాయిదో, ఏది మంచి ఏది చెడు అనీ అతనికి తెలియకుండానే ఒక ప్రపంచాన్ని అతని మనసులో నిర్మించడం మొదలవుతుంది. తల్లి,తండ్రి, కుటుంబం, చుట్టూ ఉన్న మనుషులు, రోజువారి అనుభవాలు ఆ ఖాళీ పుస్తకంలో ఒక్కొక్క అక్షరాన్ని రాయడం మొదలుపెడతాయి. పాఠశాలకు వెళ్లే సమయానికి అతను పూర్తిగా ఖాళీ మనస్సుతో వెళ్లడు. అప్పటికే అతనిలో ఒక చిన్న సిలబస్ సిద్ధమై ఉంటుంది. పాఠశాల అతనికి అక్షరాలు నేర్పుతుంటే, జీవితం అప్పటికే అతనికి మనిషిగా ఎలా ఉండాలో ఒక నిర్వచనాన్ని మొదలు పెట్టి ఉంటుంది. అందుకే అసలు విద్య ఎక్కడ మొదలవుతుంది అనే ప్రశ్నకు పాఠశాల గుమ్మం సమాధానం కాదు. మనిషి మొదటిసారి ప్రపంచాన్ని తనలోకి తీసుకునే క్షణమే దాని ఆరంభం. ఇక్కడే విద్యకు సంబంధించిన రెండు వేరు వేరు రంగాలు మనకు కనిపిస్తాయి. ఒకటి సిలబస్, పుస్తకాలు, తరగతులు, పరీక్షలు, మార్కులు, ప్రశ్నలు, సమాధానాలు.మరొకటి మనిషి పెరిగే వాతావరణం అందించే జీవన అవగాహన.దానికి పుస్తకం ఉండదు. పరీక్ష, టైంటేబుల్ ఉండదు. అయినా ఎవరిని దూరంగా ఉంచాలి.కులం, మతం, వర్గం ఆధారంగా మనుషుల ను ఎలా చూడాలి వంటి విషయాలకు అది ఒక రూపాన్ని ఇస్తుంది. ఈ ప్రభావమే తర్వాత అతని వ్యక్తిత్వంలో భాగంగా కనిపిస్తుంది. మనిషి పెరుగుతున్న కొద్ది ఈ నేర్చుకోవడం అతనికి తెలియకుండానే ఒక అలవాటుగా మారుతుంది. కొన్ని విషయాలను ప్రశ్నించాల్సిన అవసరం లేదనిపిస్తే,కొన్ని విషయాలను మాత్రం సహజంగానే అంగీకరిస్తాడు. ఎందుకంటే మనిషి ప్రతి అనుభవాన్ని కొత్తగా పరిశీలిస్తూ జీవించడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఇప్పటికే కనిపించిన నమూనాలను కూడా ఆధారంగా చేసుకుంటాడు. చిన్నప్పుడు ఏర్పడిన అలవాట్లు తర్వాత అభిప్రాయాలుగా, అభిప్రాయాలు నిర్ణయాలుగా మారుతాయి. మనస్తత్వశాస్త్రంలో కండిషనింగ్(conditioning) అనే భావన ఈ ప్రక్రియలో అలవాటు, పునరావృత్త అనుభవం మన ప్రతిస్పందనలను ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకే మనిషి పెద్దయ్యాక తనకు సహజంగా అనిపించే ప్రతి భావన నిజంగా తన సొంత ఆలోచనేనా లేక తనకు తెలియకుండానే ఏర్పడిన అలవాటా అనే తేడాను గుర్తించడం అంత సులభం కాదు. ఇక్కడి నుంచే విద్యకు సంబంధించిన అసలు వైరుధ్యం మొదలవుతుంది. పాఠశాల ఒక విలువను చెబితే సమాజం మరో విలువను ఆచరణలో చూపిస్తుంది. పుస్తకం అందరూ సమానమని చెబుతుంటే, జీవితంలో మాత్రం అందరిని సమానంగా చూడని దృశ్యాలు కనిపిస్తాయి. పాఠ్యాంశం మనిషి విలువను గుర్తు చేస్తుంటే, రోజు వారి అనుభవం కొందరికి ఎక్కువ గౌరవం, మరికొందరికి తక్కువ స్థానం ఎందుకు దక్కుతుందో చూపిస్తుంది. ఈ రెండు అనుభవాలు ఒకే పిల్లవాడి లోపల చేరుతాయి. ఒకటి అతనికి ఎలా ఉండాలో చెబితే, మరొకటి ప్రపంచం ఎలా ఉందో చూపిస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను అర్థం చేసుకోకపోతే ఒకదాన్ని పరీక్షకు గుర్తు పెట్టుకొని మరొక దాన్ని జీవితానికి సరైనదిగా అంగీకరించే అవకాశం ఉంది. అప్పుడు విద్య మనిషి లోపల మార్పును సృష్టించకుండా అతని జ్ఞాపకంలో కొన్ని మంచి మాటలను మాత్రమే మిగులుస్తుంది. అందుకే పుస్తకంలోని విలువలను ఎంత బాగా గుర్తుపెట్టుకున్నాడనేది కాదు; వాటిని జీవితంలో కనిపించే వాస్తవంతో ఎదురు ఎదురుగా పెట్టి చూడగలిగాడా అనేదే. ఇక్కడే ఉపాధ్యాయుడి పాత్రను కొత్తగా చూడాల్సిన అవసరం వస్తుంది. పాఠ్యపుస్తకంలోని విషయాన్ని చెప్పడం,ప్రశ్నకు సిద్ధం చేయడం అవసరమే. కానీ అక్కడితో విద్య పూర్తయితే మనిషి సమాచారాన్ని మాత్రమే సంపాదించినట్టు అవుతుంది. సమాధానం గుర్తు పెట్టుకోవడం సామర్థ్యం. ఆ సమాధానం ఎందుకు సరైందో అర్థం చేసుకోవడం మరో సామర్థ్యం. ఈ రెండింటి మధ్య ఉన్న తేడానే చదువు ఎంత లోతుకు వెళ్ళిందో చెబుతుంది. విద్యార్థి ప్రతిసారి సరైన సమాధానం చెప్పడం నేర్చుకుంటే అతని పరీక్షలో విజయం సాధించవచ్చు. కానీ జీవితంలో ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు ముందే సమాధానం ఉండదు. చిన్నప్పటినుంచి తనకు చెప్పబడిన విషయాలను అలాగే మోసుకెళ్ళడం సులభం. వాటి ముందు ఇది నిజమేనా? నేను దీన్ని ఎందుకు నమ్ముతున్నాను?అని ఆలోచించడం అంత సులభం కాదు. ఆ స్థాయికి చేరినప్పుడే చదువు అతని జీవితంలో నిజమైన సంబంధాన్ని ఏర్పరచుకుంటుంది. విద్యను ఇక్కడనుండే మరో దశకు తీసుకెళ్లాలి. తెలిసిన విషయాలను గుర్తు పెట్టుకోవడమే కాకుండా వాటి మధ్య సంబంధాన్ని చూడగలిగే సామర్థ్యం మనిషిలో పెరగాలి. ఒక సంఘటన చూసినప్పుడు దాని వెనక ఉన్న కారణాన్ని, ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు దాని ప్రభావాన్ని, ఒక మనిషిని అంచనా వేసేటప్పుడు అతని స్థానాన్ని కాకుండా అతని మనిషితనాన్ని చూడగలిగితే విద్య తన అసలు ప్రయోజనాన్ని అందుకున్నట్టే. అప్పుడు విద్య అంటే మనిషి తలలో మరిన్ని విషయాలు నింపడం మాత్రమే కాదని అర్థమవుతుంది. ఇప్పటికే తనలో ఏర్పడిన భయాలు, అభిప్రాయాలు, పక్షపాతాలు, అలవాట్లు ఎలా పని చేస్తాయో చూసుకునే సామర్థ్యం కూడా దాని పరిధిలోకి వస్తుంది. సమాజాన్ని తిరస్కరించడం కాదు. మనకు అందిన ప్రతి భావనను, మనదిగా చేసుకునే ముందు దాని అర్థాన్ని తెలుసుకోవడం. ఆ స్థితిలోనే వ్యక్తి తన ఆలోచనలకు తానే బాధ్యత వహించడం మొదలుపెడతాడు. ఇలాంటి విద్యకు ఒక ముఖ్యమైన వాతావరణం అవసరం. తప్పు చేసే అవకాశం, ప్రతి ప్రశ్నకు వెంటనే సరైన సమాధానం చెప్పాలనే ఒత్తిడి ఉంటే విద్యార్థి తన ఆలోచనను బయటపెట్టడానికి భయపడతాడు. ఒక ప్రశ్నకు భిన్నమైన సమాధానం వచ్చినప్పుడు దాన్ని వెంటనే కొట్టి పారేయకుండా, దాని వెనుక ఉన్న ఆలోచనను కూడా చూడగలిగే వాతావరణం తరగతి గదిలో ఉండాలి. ఎందుకంటే తప్పు అనేది ఎప్పుడూ అజ్ఞానానికి గుర్తు కాదు. కొన్నిసార్లు అది ఇంకా పూర్తికాని ఆలోచనకు సంకేతం కావచ్చు. అలాంటి వాతావరణంలో విద్యార్థి ప్రశ్న అడగడానికి, సందేహాన్ని వ్యక్తం చేయడానికి, తనకు తెలిసిన దాన్ని మరో కోణం లో చూడడానికి వెనుకాడడు. అప్పుడు తరగతి గది పాఠ్యాంశాన్ని పూర్తి చేసే స్థలం మాత్రమే కాకుండా, మనిషి తన ఆలోచనకు రూపం ఇచ్చుకునే స్థలంగా మారుతుంది. అందుకే మొదట వేసుకున్న ప్రశ్నకు సమాధానం అంత సూటిగా ఉండదు. బడి సిలబస్కు ఉపాధ్యాయుడు అవసరం.కానీ ఉపాధ్యాయుడి పని విద్యార్థి స్థానంలో ఆలోచించడం కాదు. అతను తనంతట తాను ఆలోచించే స్థలాన్ని కల్పించడం. తను నేర్చుకున్న దాన్ని అర్థం చేసుకొని, పరిశీలించి, తన నిర్ణయాన్ని తానే తీసుకునే స్థాయికి విద్యార్థిని తీసుకెళ్లినప్పుడే ఉపాధ్యాయుడి అవసరం తన అసలు అర్థాన్ని పొందుతుంది. అప్పుడు ఉపాధ్యాయుడు సమాధానాల చివరి గమ్యం కాదు. మనిషి తన ఆలోచనలను తానే కనుగొనే ప్రయాణంలో ఒక అవసరమైన సహచరుడు.



ఆయిరబోయిన బిక్షపతి
(అగల్ జోయా) 7993248717

# ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే లక్ష్యం

- బీఆర్ఎస్ పాలనలో భద్రేశ్వర దేవాలయ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లేదు.
- బిఆర్ఎస్ నేతలు బురదజల్లే మాటలు మానుకోవాలి
- భద్రేశ్వర దేవాలయ రినోవేషన్ కమిటీ చైర్మన్ మేడి మహేష్



**తాండూరు, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలక్ష్యమని, అబివృద్ధి చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ నేతలు ఆరోపనలు చేస్తున్నారని భద్రేశ్వర దేవాలయ రినోవేషన్ కమిటీ చైర్మన్ మేడి మహేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ని శ్రీ భద్రేశ్వర దేవాలయంలోని దాసోహంలో కమిటీ సభ్యులు,దేవాలయ దుకాణ సముదాయ యజమానులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మేడి మహేష్ మాట్లాడుతూ తాండూరు భద్రేశ్వర దేవాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని, దేవాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలనే ముందుచూపుతో ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు.ఎన్నికల సమయంలో వీరశైవ సమాజానికి ఇచ్చిన హామీని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గెలిచిన అనంతరం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టారని మేడి మహేష్ తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన రెండు నెలల్లోనే భద్రేశ్వర ఆలయంలో దాసోహం నిర్మాణాన్ని చేపట్టి, నిత్య అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ద్వారా భక్తులకు మరింత సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. భద్రేశ్వర దేవాలయాన్ని కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా తాండూరు ప్రత్యేక గుర్తింపుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆలయ పరిసరాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. గతంలో శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయాన్ని పునర్నిర్మించి ఆధునిక వసతులతో అభివృద్ధి చేయడం ద్వారా ఆలయ పరిసరాలకు కొత్త రూపు తీసుకొచ్చారని చెప్పారు. అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాల వ్యాపార అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నూతన దుకాణ సముదాయాలను కేటాయించే చర్యలు చేపట్టడం ద్వారా వారికి జీవనోపాధికి అండగా నిలిచారని పేర్కొన్నారు. ఆలయం ముందు నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యను దుకాణ సముదాయం సెట్ బ్యాక్ ద్వారా తీర్చిన ఘనత ఎమ్మెల్యే మనోర అన్నదేనని అన్నారు.ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేలా నూతన దుకాణ సముదాయాలను ఏర్పాటు చేయడం ముందుచూపుతో కూడిన నిర్ణయమని మేడి మహేష్ అన్నారు. భక్తులు, వ్యాపారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడమే మా ఎమ్మెల్యే లక్ష్యమని తెలిపారు.గత బీఆర్ఎస్ పాలనలో భద్రేశ్వర దేవాలయ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని మేడి మహేష్ విమర్శించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవ చూపుతున్నారని అన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు స్థానిక వ్యాపారుల సంక్షేమాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు."భద్రేశ్వర దేవాలయ అభివృద్ధికి ముందుచూపుతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, గెలిచిన కొద్ది నెలల్లోనే దాసోహం, నిత్య అన్నదానం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత మనోహర్ రెడ్డికే దక్కుతుంది" అని మేడి మహేష్ అన్నారు. అనంతరం భద్రేశ్వర దుకాణదారులు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన మా దుకాణాలు ఎమ్మెల్యే మనోరైన చూడవద్దు సువిశాలంగా ఆకర్షినియంగా నూతన దుకాణాలను ఏర్పాటు చేసుకున్నామని మా వ్యాపార అభివృద్ధికి సహకరించిన గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అని అన్నారు. దుకాణ నిర్మాణాలు కూడా మేమే ముందుండి మా ఇంజనీర్ల సహకారంతో నిర్మించేలా కృషి చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రెవనేషన్ కమిటీ సభ్యులు దేవనూర్ శంకర్, శెట్టి చంద్రకాంత్,గాజుల విజయ్ కుమార్ అగ్గనూర్ సంకేత్, మాజీ కౌన్సిలర్ లింగదల్లి రవికుమార్, భద్రేశ్వర దుకాణ సంబంధాల యజమానులు సునీల్, శేషు ,మాణిక్ రావు, సుధాకర్ వినోద్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి




**మల్కాజిగిరి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** విద్యా వ్యాపారీకరణను అరికట్టి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా వినాయకనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. మల్కాజిగిరి డిగ్రీ, ఇంటర్ కళాశాల లో షిఫ్ట్ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలకు ప్రత్యేక భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.మల్కాజిగిరి మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా అనిరుధ్, కార్యదర్శిగా యశ్వంత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శివ, సాత్విక్, సహాయ కార్యదర్శులుగా శ్రావ్య, యశ్వంత్ సహా 16 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, డీసీ సభ్యుడు మాథ్యూ పాల్గొన్నారు.

# మహిళల హామీల అమలుకు మహా పోరాటం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) : బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా కొత్తపేట్ డివిజన్‌లోని ఓమిని హాస్పిటల్ నుంచి జైన్ మందిర్ వరకు బీఆర్ఎస్ మహిళా నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్ పునరుద్ధరణతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర హామీలను నెరవేర్చాలని కోరారు. మహిళల హక్కులు, హామీల అమలు కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోనేరు బావికి పునరుద్ధరణ పనులు చేపట్టాలి

- శిథిలావస్థకు చేరిన ఎల్లమ్మ తల్లి ఆలయ పురాతన కోనేరు..
- సంరక్షణకు గ్రామ పెద్దలు, భక్తులు చొరవ చూపాలని స్థానికుల విజ్ఞప్తి

**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోని నరసింహస్వామి గుట్ట సమీపంలో ఉన్న చారిత్రక ఎల్లమ్మ తల్లి ఆలయ కోనేరు బావి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పురాతన కట్టడంగా చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ కోనేరు సంరక్షణకు నోచుకోకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పండితులు, గ్రామస్థుల కథనం ప్రకారం సుమారు వెయ్యేళ్ల క్రితం గోన గన్నారెడ్డి వంశస్థులు తమ కులదైవంగా భావించిన ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతున్నారు. గతంలో ఆలయంలో పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరిగేవని, కోనేరు నీటిని పరిసర ప్రాంత ప్రజలు వివిధ అవసరాలకు వినియోగించేవారు ప్రస్తుతం కోనేరు పిచ్చిమొక్కలు,



చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా మారింది. కోనేరు చుట్టూ నిర్మించిన పురాతన రాతి కట్టడం పలుచోట్ల దెబ్బతింది. కొన్ని రాళ్లు ఊడిపడి కూలిపోగా, మెట్లు సైతం శిథిలమై ప్రమాదకరంగా మారాయి. పరిసర ప్రాంతమంతా పిచ్చిమొక్కలతో కప్పుకుపోవడంతో కోనేరు ఆనవాళ్లు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా నరసింహస్వామి గుట్ట వద్ద జరిగే పండుగ కార్యక్రమాలకు గతంలో ఈ కోనేరు నీటిని తీసుకెళ్లి వినియోగించేవారు స్వచ్ఛమైన నీటి వనరుగా ఉన్న ఈ కోనేరు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైంది.

చారిత్రక ప్రాధాన్యత కలిగిన కోనేరు రాతి నిర్మాణాన్ని సాధ్యమైనంత వరకు యథాతథంగా కాపాడుతూ పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. దెబ్బతిన్న మెట్లు, కూలిపోయిన రాతి నిర్మాణాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి కోనేరు పరిసరాలను శుభ్రపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.భావితరాలకు ఈ వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది కోనేరు అభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు కొందరు భక్తులు, స్థానికులు సిద్ధంగా ఉన్నపటికీ కోనేరు మరమ్మత్తు పనులు ప్రారంభం కావడం లేదు ఇప్పటికైనా గ్రామ పెద్దలు, భక్తులు, చొరవ తీసుకుని పునరుద్ధరణ పనులు చేపడితే ఎల్లమ్మ తల్లి కోనేరు బావికి పూర్వ వైభవం తీసుకురావచ్చు.

# విట్టల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

- గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి



**నర్సాపూర్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ విట్టల్‌రెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం నర్సాపూర్‌లో ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. విట్టల్‌రెడ్డి ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారని, ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మురళిధర్ యాదవ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి ,మాజీ సర్పంచ్ రమణారావు ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, కౌన్సిలర్ శ్రీకాంత్, శ్రీశైలం యాదవ్, కిషన్ నాయక్, బాలరాజు, సంఘసాని రాజు, చిరంజీవి, విట్టల్‌రెడ్డి అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దగా పాలనకు వంటా వార్పుతో నిరసనలు

**నిజాంపేట్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద వంటా వార్పుతో నిరసన తెలిపిన బిఆర్ఎస్ శ్రేణులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి వివేకానంద, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో మహిళలు



బొంద పెట్టడం ఖాయం అని తెలిపారు. కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు బిఆర్ఎస్ శ్రేణులు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మూడవరోజు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను విస్మరించినందుకు ఈ నిరసనలు అని తెలిపారు. ఈ వంట వార్పు కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొని మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణికి ప్రజల వ్యతిరేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పథకాలు అమలుచేయడంలో విఫలం

- తుంకుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజేశ్వర్ రావు
- తూంకుంటలో బిఆర్ఎస్ పార్టీ వంటా వార్పు నిరసన

శామీర్‌పేట, సెప్టెంబర్ (జనం సాక్షి) : భారత్ రాష్ట్ర సమితి పార్టీ తూంకుంటలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనా వైఫల్యాలు, దగా పాలనపై పెద్ద ఎత్తున 'వంటా వార్పు' నిరసన కార్యక్రమాలను చేపట్టింది. ఎన్నికల ముందు మహిళలు, వృద్ధులు, వికలాంగులకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ శ్రేణులు ఈ వినూత్న నిరసనలతో రోడెక్కారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయం, రైతు రుణమాఫీ వంటి హామీలను పూర్తిగా నెరవేర్చాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక కల్యాణలక్ష్మి, రైతు బీమా వంటి పథకాలను అటకెక్కించిందని, క్షేత్రస్థాయిలో ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ నేతలు ఈ వేదికల ద్వారా విమర్శలు



గుప్పించారు. ఈ వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కారంగుల రాజేశ్వర్ రావ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్లుబాయి, మాజీ కౌన్సిలర్లు రాజు యాదవ్, నర్సింగ్ రావు, ఐలయ్య యాదవ్,జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అయ్యన్నగారి రవి కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**మొయినాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మొయినాబాద్‌లో శుక్రవారం నాడు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు, చేవెళ్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. మొయినాబాద్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలను కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 20 గంటల్లోనే రాబరీ కేసు ఛేదన..

- ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్ చేసిన మేడిపల్లి పోలీసులు
- 3 తులాల పుస్తెలతాడు,ద్విచక్ర వాహనం,2 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- సీసీ టీవీ,సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు

**బోడుప్పల్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించి పరారైన ఇద్దరు చైన్ స్నాచర్లను మేడిపల్లి పోలీసులు కేవలం 20 గంటల్లోనే అరెస్ట్ చేసి తమ దర్యాప్తు నైపుణ్యాన్ని చాటుకున్నారు. నిందితుల నుంచి 3 తులాల బంగారు పుస్తెలతాడు,ఒక ప్యాషన్ ద్విచక్ర వాహనం,రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 2వ తేదీ రాత్రి 8:20 గంటల సమయంలో చెంగిచెర్ల శాంతివనం సమీపంలోని ఆర్టీసీ కాలనీలో చల్ల భారతి(38) ఆమె అన్న ఇద్దరు నడుచుకుంటూ వెళ్తుండగా,ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు.అనంతరం సమీపంలో ద్విచక్ర వాహనంపై వేచి ఉన్న మరో వ్యక్తితో కలిసి చెంగిచెర్ల వైపు పారిపోయాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఘటనను సవాల్‌గా స్వీకరించిన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సీసీటీవీ ఫుటేజ్, సెల్‌ఫోన్ డేటా,సాంకేతిక ఆధారాలు,స్థానిక సమాచారాన్ని సమన్వయం చేస్తూ దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో నిందితుల కదలికలను గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన నిందితులు చెంగిచెర్లకు చెందిన కంగాల వీవీఎస్‌వీ ప్రసాద్ (39),వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అజ్మీరా వెంకటేష్ (24)గా పోలీసులు గుర్తించారు. విచారణలో వీరిద్దరూ గత ఏడాది నుంచి స్నేహితులుగా ఉండి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది.ఈ క్రమంలో ఓఎన్ఎన్ యాప్ ద్వారా ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకుని ఉప్పల్,పోచారం,చెంగిచెర్ల తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ మహిళల కదలికలను గమనించి రెక్కీ నిర్వహించారు.సెప్టెంబర్ 2న చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీ వద్ద ఒంటరిగా వెళ్తున్న మహిళను లక్ష్యంగా చేసుకుని ఈ నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఆదేశాల మేరకు,ఉప్పల్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్ మార్గదర్శకత్వంలో



మేడిపల్లి ఏసీపీ బి.మోహన్ కుమార్ పర్యవేక్షణలో మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ డి. జలేందర్ రెడ్డి నేతృత్వంలోని బృందం కేసును వేగంగా ఛేదించింది.డీఎస్ఐ బి.శ్రీనివాస్,ఏఎస్ఐ కె.బాల్‌సింగ్,హెడ్ కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు సమిష్టిగా కృషి చేసి నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు.కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని మేడిపల్లి ఏసీపీ నగదు రివార్డులతో అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# హామీలతో మోసపోయింది మహిళలే..

- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్
- మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ కార్యాలయంలో వంట-వార్పు, భారీ ర్యాలీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన వంట-వార్పు కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా తెలంగాణ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో మోసపోయింది మహిళలేనని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు, గౌరవం లేదు, వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆరోపించారు. 4000 పెన్షన్ ఇస్తామని, ఇంట్లో అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి మోసం చేసి ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. తులం బంగారం ఇస్తామని మాట తప్పారని, కళ్యాణ లక్ష్మి అందడం లేదని, పేదింట్లో ఆడపిల్ల పెళ్లి భారంగా మారిందని అన్నారు. పుట్టిన పిల్లలకు కేసీఆర్ కిట్ లేదు, ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు, మహిళలకు పౌష్టికాహారం అందడం లేదని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు



ఆడపిల్ల పుడితే 13 వేలు, మగ పిల్లవాడు పుడితే 12 వేల ప్రోత్సాహకంతో పాటు కేసీఆర్ కిట్ ఇచ్చామని గుర్తు చేశారు. మహిళలకు నీటి ఇబ్బంది లేకుండా ఇంటింటికీ నల్లా ఇచ్చామని, ఇప్పుడు స్కూటీ ఇస్తామని చెప్పి ఒక్కరికీ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పొలాలు ఎండుతున్నాయని, యూరియా దొరకడం లేదని, పెన్షన్ సరిగ్గా రావడం లేదని మహిళలు చెబుతున్నారని అన్నారు. రైతులు చనిపోతే రైతు బీమా ఇస్తే వారి కుటుంబాలకు ఆసరాగా ఉండేదని, ఇప్పుడు నిలిపివేశారని విమర్శించారు. కేసీఆర్ వెంట ఉంటామని ప్రతి ఒక్కరూ చెబుతున్నారని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసులకు భయపడవద్దని, తమను ఇబ్బంది పెట్టిన వారికి సమాధానం చెబుతామని, కార్యకర్తలను, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. నియోజకవర్గం పరిధిలో 400 ఎకరాల భూములను 22(ఏ) నిషేధిత జాబితాలో పెట్టారని, ఇండ్లు, భూములు నిషేధిత జాబితాలో పెట్టి కబ్జా చేయడానికి, పర్సంటేజీల కోసమే ఇలా చేశారని ఆరోపించారు. కలెక్టర్, ఇతర అధికారులు నిషేధిత జాబితాపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యవహారాలకు కారణమైన మంత్రులు పొంగులేటి, కొండా సురేఖలను తొలగించాలని, చాలా మంది మంత్రులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సతీమణి శారద, మహిళా కార్పొరేటర్లు ఆర్.జ్యోతి, సరస్వతి, మంజుల, మీరాబాయ్, లక్ష్మి, నాయకురాళ్లు జ్యోతి, సుధాశ్రీ, సుధ, గాయత్రి, తిరుపతమ్మ, లావణ్య, ప్రతిభ, జహీదా భాను, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నర్సింహులు, ముడా మాజీ ఛైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆంజనేయులు, రెహమాన్, మాజీ వైస్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాబిన్‌హుడ్ పండగ సాయన్న

- నీలం మధు ముదిరాజ్



**పటాన్‌చెరువు, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రాబిన్ హుడ్, పేద ప్రజల ఆకలి తీర్చిన మహానుభావుడు పండగ సాయన్న అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి విచ్చేసిన నాయకులు, నాగర్‌కర్నూల్ పట్టణంలో పండగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ముదిరాజ్ సమాజం చిరకాల కోరికను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన ఐదు లక్షల విరాళం ప్రకటించి ముందస్తుగా రెండు లక్షల రూపాయల విలువచేసే చెక్కును నిర్వాహకులకు అందజేశారు.. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేశానని ఆయన పేర్కొన్నారు, ముదిరాజ్ సమాజం చిరకాలంగా కోరుతున్న బీసీ-ఏ వర్గీకరణ సాధన కోసం అందరం ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజం న్యాయమైన డిమాండ్ల సాధనకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నీలం మధు ముదిరాజ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లికార్జున్, సుంకరబోయిన మహేష్, వాకిటి ఆంజనేయులు, ధనంజయ్, తిరుపతయ్యా, బాబు, నర్సయ్య, నిరంజన్, నరసింహ, లక్ష్మయ్య, రుద్రయ్య, శంకర్, చెనకేశువులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండా సురేఖ బర్తరఫ్ వెనుక కాంగ్రెస్ అంతర్గత విభేదాలు

- ఎంపీ డీకే అరుణ



**జడ్చర్ల, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత రాజకీయ విభేదాల కారణంగానే కొండా సురేఖ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయ్యారని బిజెపి ఎంపీ డీకే అరుణ తెలిపారు. మండల పరిధిలోని కొత్త తండాలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల్లో గ్రూపులు, విభేదాలు సహజమే అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో ఇవి తీవ్రస్థాయికి చేరి ఒక సీనియర్ బీసీ మహిళా నేత పదవి కోల్పోయే పరిస్థితికి దారితీశాయని పేర్కొన్నారు. ఒక మహిళా నాయకురాలిగా, సీనియర్ నేతగా ఉన్న కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం బాధాకరమని డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. 2004లో ఎమ్మెల్యేలుగా, 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇద్దరం కలిసి మంత్రులుగా బాధ్యతలు నిర్వహించామని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి బీసీల గురించి ఎంతో గొప్పగా మాట్లాడుతుంటారని, కానీ ఒక బీసీ మహిళా నేత కుమార్తె మాట్లాడిన అంశాన్ని సాకుగా చూపి సురేఖపై చర్యలు తీసుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని విమర్శించారు. సమాజంలో ఎన్నో కష్టనష్టాలు తట్టుకుని ఒక మహిళ రాజకీయాల్లో నిలదొక్కుకోవడమే గొప్ప విషయమని, అలాంటిది ఆమెను మంత్రి పదవి నుండి తొలగించడం సరికాదని హితవు పలికారు. అలాగే, కొండా సురేఖను బిజెపిలోకి ఆహ్వానిస్తున్నారా అన్న ప్రశ్నకు డీకే అరుణ స్పందిస్తూ, ఇప్పటి వరకు తమ పార్టీలో అలాంటి చర్చలేవీ జరగలేదని స్పష్టం చేశారు.

# మహిళా సాధికారత, గ్రామాభివృద్ధే లక్ష్యం

- పోలేపల్లి, పెద్దపల్లి, కొత్త తండాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం
- పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** మహిళా సాధికారత, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి, పెద్దపల్లి, కొత్త తండా గ్రామాల్లో వారు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పోలేపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం పోలేపల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించగా, పెద్దపల్లి, కొత్త తండాల్లో నూతన సమైక్య భవనాలను ప్రారంభించి, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేసి, వారికి అవసరమైన వసతులు కల్పించడం వల్ల గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబంతో పాటు సమాజం కూడా పురోగమిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను పెంచి, ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడేలా అండగా ఉంటామని తెలిపారు. ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా ప్రతి గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి

- నెలకు రూ.25 వేల పింఛను, 250 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలి
- జిల్లా కన్వీనర్ సరాఫ్ నాగరాజు, నియోజకవర్గ కన్వీనర్ నీలప్ప



**మక్తల్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సరాఫ్ నాగరాజు, మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ నీలప్ప ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మక్తల్ పట్టణంలో నీలప్ప ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ?ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సరాఫ్ నాగరాజు మాట్లాడుతూ ఉద్యమ సమయంలో అక్రమ కేసులు, బైండోవర్లు, జైలు శిక్షలను సైతం లెక్కచేయకుండా పోరాడిన నిజమైన ఉద్యమకారులను పాలకులు విస్మరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యమకారులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే నెలకు రూ.25,000 గౌరవ పింఛను, 250 గజాల నివాస స్థలం కేటాయించి తెలంగాణ ఉద్యమకారుల కాలనీ లుగా నామకరణం చేయాలన్నారు. వీటితో పాటు ఉచిత బస్సు పాసులు, ప్రత్యేక హెల్త్ కార్డులు మంజూరు చేసి ఉద్యమకారుల కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ మక్తల్ డివిజన్ కన్వీనర్‌గా నీలప్ప ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కడెంపల్లి మోహన్, బీజేపీ నాయకులు భగవంతు, ప్రజాఫ్రంట్ మాజీ నాయకులు కల్లూరి నాగప్ప, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాంలింగం, విద్యార్థి సంఘ నాయకులు ఏజీ భుట్టో, మాజీ కౌన్సిలర్ బి. భాస్కర్, చీరాల సత్యనారాయణ, ఉద్యమ నాయకులు అబ్దుల్ జాహిద్, మంగ్యా నాయక్, రమేష్ గౌడ్, క్రెమ్ కృష్ణ, ఉద్యమ ఫోటోగ్రాఫర్ అంబదాస్, మంథన్‌గోడ్ కృష్ణ, మాగనూర్ మండల నాయకులు మల్లేష్, నర్వ మండల నాయకులు ఖాజా, ఊట్కూరు మండల నాయకులు కృష్ణమీనన్ తదితరులు పాల్గొన్నారు.

## 223.85 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** ఓ వ్యవసాయ భూమి వద్ద అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం జగదేవ్ పూర్ మండలం గొల్లపల్లి గ్రామ శివారులో జరిగింది. స్థానిక ఎస్ ఐ జె.కృష్ణారెడ్డి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. విజిలెన్స్ అండ్ ఫోర్స్ మెంట్ అధికారులకు అందిన సమాచారం మేరకు గొల్లపల్లి శివారులో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వచేసిన 223.85 క్వింటాళ్ల పీడీఎస్ సన్న బియ్యాన్ని గుర్తించారు. వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు శంకర్ రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వివిధ రకాల ప్లాస్టిక్ సంచుల్లో వ్యవసాయ భూమి వద్ద నిలువ చేయగా స్వాధీనం చేసుకున్నారు. కాగా స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట ఏ సి ఎస్ ఓ మిట్టపల్లి సాయి రవి స్థానిక పోలీస్ స్టేషన్ లో స్వాధీనపరిచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జె. కృష్ణారెడ్డి వివరించారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిరసన ధర్నా



**సంగారెడ్డి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డిలో ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. వృద్ధులకు నెలకు రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తట్టుకోలేరని, ఇప్పటికే హరీశ్‌రావు, కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటేనే మంత్రులు సమాధానం చెప్పలేక తడబడుతున్నారని చింత ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మామిళ్ల రాజేందర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ ఛైర్మన్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, జుబేదా, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**పెద్దశంకరంపేట్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని .. హామీలు మరచి ప్రజలను అన్ని విధాలుగా మోసం చేస్తుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద శంకరంపేటలోని గాంధీ చౌరస్తా వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న ఎన్నికల ముందు ప్రజలకు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి రాగానే మహిళలకు 2500 తమన్న హామీ ఏమైందని.. కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం.. విద్యార్థులకు స్కూటీలు.. వృద్ధులు వితంతులు కు 4000 రూపాయలు. దివ్యాంగులకు 6000 రూపాయలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చాక మాటలతో మాయాజాలం సృష్టిస్తున్నారని విమర్శించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలలో ఎన్ని అమలు చేశారు ప్రజల ముందు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. 420 హామీల అమలు కోసం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్. మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ.. మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్.. మండల బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సురేష్ గౌడ్. బీ దత్తు. సుభాష్ వెంకటరెడ్డి. మాణిక్ రెడ్డి. ఆయా గ్రామాల నుండి అధిక సంఖ్యలో బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు న్యాల్‌కల్ కస్తూర్బకు ప్రత్యేకాధికారిణి నియామకం

- ఎస్ఓగా సంగీతను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన డీఈఓ
- "జనం సాక్షి" కథనాలకు స్పందించిన డీఈఓ, జిసిడిఓలు

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు ప్రత్యేకాధికారిణిగా నియమిస్తూ జిల్లా విద్యాధికారిణి రోహిణి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. డీఈఓ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం గురుకులంలో హిందీ ఉపాధ్యాయురాలుగా (సీనియర్ ఉపాధ్యాయురాలు) విధులు నిర్వహిస్తున్న సంగీతను పూర్తిస్థాయి ప్రత్యేలాధికారిణిగా (ఎస్ఓ)గా నియమిస్తూ గురువారం సాయంత్రం డీఈఓ, జిసిడిఓ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. నెల రోజులకు పైగా ఎస్ఓ, ఇన్చార్జి ఎస్ఓను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో సీనియర్ ఉపాధ్యాయురాలు పర్యవేక్షణలోనే గురుకులం కొనసాగింది.

నెల రోజుల అనంతరం ఉత్తర్వులు జారీ

నెల రోజులకు పైగా ప్రత్యేకాధికారిణి, ఇన్చార్జి అధికారిణి లేకుండానే గురుకులం కొనసాగింది. గురుకుల ఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న రుబీనా పర్వీన్ వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా విధుల నుండి (రిజైన్) తప్పుకున్నారు. జూలై 31 నుండి సెప్టెంబర్ 2 వరకు అధికారికంగా.. ప్రత్యేకాధికారిణి, ఇన్చార్జి అధికారిణిగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయలేకపోయారు. ఎట్టకేలకు జిల్లా పాలనాధికారి (కలెక్టర్) ఆదేశం మేరకు.. జిల్లా విద్యాధికారిణి, జీసీడీఓలు.. గురుకులంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ హిందీ ఉపాధ్యాయురాలు సంగీతను ఎస్ఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఓ గా పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించారు.

### గురుకులంలో నెలకొన్న పలు సమస్యలపై "జనం సాక్షి" ప్రత్యేక కథనాలు

ప్రత్యేకాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న అధికారిణి స్వచ్ఛందంగా విధుల (రిజైన్) నుంచి తప్పుకోవడం, ఇన్చార్జి



ఎస్ఓగా నియమించక పోవడం, గురుకులంలో నెలకొన్న అపరిశుభ్రత, పాటించని మెనూ, అస్తవ్యస్తంగా మారిన గురుకుల నిర్వహణపై "జనం సాక్షి".. పలు కథనాలను ప్రచూరించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆగస్టు 01న.."కంపు కొడుతున్న న్యాల్ కల్ కస్తూర్బా గాంధీ గురుకులం".. ఆగస్టు 02న "కారంపొడే దిక్కు".., ఆగస్టు 20న.. న్యాల్ కల్ కస్తూర్బా గాంధీ గురుకులానికి త్వరలో ప్రత్యేకాధికారిణి..? శీర్షికన.."జనం సాక్షి" పలు కథనాలను ప్రచూరించింది. గురుకులంలో నెలకొన్న పలు సమస్యలపై.. నేరుగా "జనం సాక్షి".. జిల్లా కలెక్టర్, విద్యాధికారిణి, జీసీడీఓల దృష్టికి తీసుకువెళ్లింది. కథనాలకు స్పందించిన.. కలెక్టర్ ఆదేశాల మేరకు.. డీఈవో, జిసిడిఓ నేరుగా గురుకులాన్ని పరిశీలించారు. సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ దృష్టికి నివేదికను పంపినట్లు జిల్లా విద్యాధికారిణీలు తెలిపారు.

## బండరాయిపాకులలో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం



**రేవల్లి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** రేవల్లి మండలంలోని బండరాయిపాకుల గ్రామంలో రేవల్లి మండల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలనలో 420 హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచిపోయి ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఇచ్చిన హామీలు, యువతకు ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. వెంటనే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# ఊరి లోపలికి రాని ఆర్టీసీ బస్సులు




- రాత్రి వేళల్లో మెయిన్ రోడ్డుపైనే ప్రయాణికుల గుర్తింపు
- మహిళలు, వృద్ధుల తీవ్ర ఇబ్బందులు
- మాదారం గ్రామస్తుల ఆవేదన

**తాండూర్, సెప్టెంబర్ 04(జనం సాక్షి)** : మండలంలో మాదారం గ్రామ ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి డిపోల నుండి వివిధ రూట్లలో నడిచే ఆర్టీసీ బస్సులు షెడ్యూల్ ప్రకారం మాదారం గ్రామం లోపలికి రావాల్సి ఉంది. అయితే, కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు సమయం ఆదా చేసుకోవడానికో లేదా మరే ఇతర కారణాల వల్లో బస్సులను ఊరి లోపలికి తీసుకురావడం లేదు.గ్రామ బయట ఉన్న మెయిన్ రోడ్డు (రహదారి) పైనే ప్రయాణికులను దించేసి వెళు తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల నిత్యం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులను మెయిన్ రోడ్డుపైనే దించేయడం వల్ల వారు చీకట్లో కిలోమీటర్ల దూరం ఊరి లోపలికి నడుచుకుంటూ రావడానికి తీవ్ర భయాందోళనలకు గురవుతు న్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.ఈ విషయమై పలుమార్లు డ్రైవర్లకు విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ స్పందించి మాదారం గ్రామం మీదుగా వెళ్లే అన్ని బస్సులు ఖచ్చితంగా ఊరి లోపలికి వచ్చి వెళ్లేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలని, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని మాదారం గ్రామ ప్రజలు, మహిళలు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

# రాజకీయ ప్రత్యర్థులు.. గుడిలో భక్తులు!

- ఒకే పూజలో ఎదురెదురుగా కూర్చున్న ఇద్దరు గండ్రలు..
- భూపాలపల్లిలో హాట్‌టాపిక్‌గా మారిన అరుదైన దృశ్యం..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు గండ్రలు ఒకే ఆలయంలో, ఒకే పూజలో ఎదురెదురుగా కూర్చొని ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది. మంజూరునగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఇద్దరూ ఎదురెదురుగా కూర్చొని సుమారు గంటపాటు స్వామివారికి పూజలు నిర్వహించారు. ప్రస్తుతం రాజకీయంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఇద్దరు నేతలు భూపాలపల్లి రాజకీయాల్లో ఒకరికొకరు ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. అయితే రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, స్వామివారి పవిత్రోత్సవాల్లో ఇద్దరూ ఒకే పూజలో పాల్గొనడం అక్కడికి వచ్చిన భక్తులు, కార్యకర్తల దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా రాజకీయ వేదికలపై పరస్పరం విమర్శలు, ఆరోపణలు చేసుకునే ఇద్దరు నేతలు ఆలయ ప్రాంగణంలో మాత్రం భక్తులుగా ఒకే కార్యక్రమంలో పాల్గొనడం ఆసక్తికర చర్చకు దారితీసింది. మంజూరునగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, పవిత్రోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజలో ఇద్దరూ ఎదురెదురుగా కూర్చొని పూజా కార్యక్రమాన్ని కొనసాగించారు. దాదాపు గంటపాటు జరిగిన పూజలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, ఆలయ ఆధ్యాత్మిక వాతావరణం మధ్య ఇద్దరు నేతలు స్వామివారిని సేవించుకున్నారు. ఇదిలా ఉండగా, కార్యక్రమానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. రాజకీయంగా భిన్న ధ్రువాలుగా ఉన్న ఇద్దరు గండ్రలు ఒకే పూజలో పాల్గొన్న దృశ్యాన్ని చూసేందుకు పలువురు ఆసక్తి చూపారు. కొందరు భక్తులు, కార్యకర్తలు తమ సెల్‌ఫోన్లలో ఈ అరుదైన దృశ్యాలను చిత్రీకరించుకున్నారు. ప్రస్తుతం ఆ దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రాజకీయాల్లో ఎన్ని విభేదాలు, పోటీలు ఉన్నా.. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మాత్రం అందరూ భక్తులుగానే కలిసిపోవచ్చనే సందేశాన్ని ఈ ఘటన చాటిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భూపాలపల్లి రాజకీయాల్లో ఎప్పుడూ ఆసక్తిని రేకెత్తించే ఇద్దరు గండ్రలు ఒకే పూజలో ఎదురెదురుగా కూర్చోవడం ఇప్పుడు నియోజకవర్గంలో ప్రత్యేక చర్చగా మారింది.

# కొండా సురేఖ బర్తరఫ్ సమంజసమే : ఎమ్మెల్యే నాయిని




**హనుమకొండ, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** మంత్రి పదవి నుంచి కొండా సరేఖను ముఖ్యమంత్రి బర్తరఫ్ చేయడం ముమ్మాటికీ సమంజసమేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిఅన్నారు. గురువారం ఆయన హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి పదవి అనుభవిస్తూ పార్టీపై పదేపదే విమర్శలు గుప్పిస్తూ,సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు. పాల్పడితే క్రమశిక్షణా చర్యలు కచ్చితంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆమె ఇప్పుడు ఆరోపించడంపై మండిపడ్డారు. ప్రభుత్వంలో మూడేళ్లుగా మంత్రులుగా కొనసాగిన తర్వాత, ఇప్పుడు పథకాల అమలుపైవిమర్శలు చేయడం ఏమిటని, ఇవాళే ఆ సంగతి గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. పార్టీలైన్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవడం సరైనదేన ఎమ్మెల్యే నాయిని రాజేందరరెడ్డిన మర్థించారు. ఎమ్మెల్యే నాయిని మొదటి నుంచి కొండా సరేఖ వైఖరిని, ముఖ్యమంత్రి పై వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. కొండా సరేఖ కూతురు కొండా సుస్మిత పటేల్ సిఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల అనంతరం హైదరాబాద్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొండా సురేఖ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

# చలో రైట్ రైట్... జానేదో!

- కెరమేరీలో రహదారుల దుస్థితి
- తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల డిమాండ్





**కెరమెరి,సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : కెరమెరి మండలంలో రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ఈ చిత్రాలు రహదారుల దుస్థితిని కళ్ళకు కట్టినట్టు చూపుతున్నాయి. కెరమెరి మండలం నుంచి అనార్పల్లి వెళ్లే ప్రధాన రహదారిలో తుమ్మగూడ శివారు వంతెన వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. గత వర్షాకాలంలో వంతెన అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో, అధికారులు మట్టితో తాత్కాలిక రోడ్డు వేయడంతో అది బురదమయంగా మారి గుంతలతో వాహనదారులకు నరకం చూపిస్తోంది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనార్పల్లి నుంచి కరంజీవాడకు వెళ్తున్న మార్గంలో వాగుకు ఇరువైపులా రహదారి కోతకు గురై పూర్తిగా బురదతో అధ్వాన్నంగా మారింది. బురదలో ఆటో కూరుకపోతే ప్రయాణికులు దిగి తోస్తున్న దృశ్యాలు అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అనార్పల్లి నుంచి బోరిలాల్గూడ వరకు రహదారి మంజూరై ఆరు నెలలు అవుతున్నా పనులు మొదలు కాకపోవడం గమనార్హం. ఈ రెండు ప్రధాన రహదారులకు శాశ్వత పరిష్కారం చూపి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.



## గంజాయి తో పట్టుబడ్డ ఇద్దరు నిందితుల అరెస్టు

**రెబ్బెన,సెప్టెంబర్04 (జనం సాక్షి):** మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయిని తీసుకొచ్చి రెబ్బెన ప్రాంతంలో విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఎ. వెంకటకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రెబ్బెన బస్టాండ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహి స్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ధాగం సందీప్ (24), జక్కులపల్లి, కొండగుర్ల రాజేందర్ ప్రసాద్ (19), శ్రీరాంపూర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి, మోటరోలా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బల్లార్షా నుంచి గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ వ్యవహారంలో మరో నిందితుడు దుర్గం అభినేష్ అలియాస్ చింటూతో పాటు పలు వురి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తిం చారు. మిగిలిన నిందితులను కూడా అరెస్ట్ చేస్తామని సీఐ ఎం. సంజయ్ తెలిపారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే మహిళలకు న్యాయం
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 04(జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రజాపాలన కాకుండా దోచుకో-దాచుకో పాలన సాగుతోందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. శుక్రవారం ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మహిళా సమాఖ్య సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, మహిళలకు రూ.2,500 పెన్షన్ హామీలను విస్మరించారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, ఉచిత విద్యుత్ విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. చెన్నూరు నియోజక వర్గంలో నిరుద్యోగులకు 45 వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మంత్రి వివేక్ ఇప్పుడు విదేశీ భాషలు నేర్చుకుని ఉద్యోగాలు పొందాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణి కాలనీల్లో నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ పాలకవర్గంతో సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ మురళీకృష్ణకు సూచించారు. కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మహిళలకు కాంగ్రెస్ పాలనలో అన్యాయం జరుగుతోందన్నారు. మహిళా సంక్షేమం, సమన్యాయం కోసం బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు పద్మ, అత్తి సరోజ, మున్సిపల్ చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణి, పలువురు కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

# విద్యా పరిపాలనలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు విశిష్ట ప్రతిభా పురస్కారం

- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం చేతుల మీదుగా విశిష్ట ప్రతిభా పురస్కారం



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : విద్యా పరిపాలనలో విశిష్ట ప్రతిభా పురస్కారం-2026"కు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 2025-26లో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 2026-27లో ఈ సంఖ్య 45 వేల 626కు పెరిగి 2 వేల 554 మంది అదనంగా చేరారు. 2024-25తో పోలిస్తే రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగింది. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించగా, మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాలలో 10 శాతానికి పైగా నమోదు పెరిగింది. అలాగే 2026-27లో 4 వేల 346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎం ఐ ఎస్, సి సి ఓ లు, సి ఆర్ పి ల సమన్వయంతో చేపట్టిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టి కృషి ఈ విజయానికి దోహదపడింది. సెప్టెంబర్ 5న కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ పురస్కారం మంచిర్యాల జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖతో పాటు మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో లభించిన విశిష్ట గుర్తింపు.

## పరకాల ఏఎంసీలో నిర్మాణాలకు నిధులు మంజూరు



**పరకాల,సెప్టెంబర్04,(జనం సాక్షి):** పరకాల వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి దిశలో కొనసాగించుటకు ఇంటిగ్రేటెడ్ కవర్ షెడ్ , రైతు విగ్రహా నిర్మాణం కోసం రెండు కోట్ల 18 లక్షల వ్యయంతో నిర్మించుటకు మంజూరు అయిన శుభ సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి, కండువా కప్పి, షాలువతో సత్కరించిన పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్(బుజ్జన్న) డైరెక్టర్స్ బుడేమే రాజయ్య, గాదె విజయ్, ఎండి రంజాన్, బొమ్మకంటి రుద్రమ చంద్రమౌళి, పెండెల కుమార్ స్వామి వారిని ఘనంగా సన్మానించారు.



# జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆందోళన

- నిరసన దీక్షను ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కార్మికులు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఏడు ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. జీఎం కార్యాలయం ఎదుట ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలబోయిన సుజేందర్ ఆధ్వర్యంలో జరిగిన దీక్షను బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, వారి కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడంతోపాటు గనుల్లో కార్మికులకు అవసరమైన పిట్ మెటీరియల్, డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్ తదితర సామగ్రిని సకాలంలో అందుబాటులో ఉంచాలన్నారు. 1000 క్వార్టర్స్, రామప్ప కాలనీల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎలక్ట్రీషియన్, హెల్పర్‌ను అందుబాటులో ఉంచాలని, వైకుంఠధామాలకు స్థలాలు కేటాయించాలని, కృష్ణాకాలనీలో నీటి నిల్వ ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. డిమాండ్లపై యాజమాన్యం వెంటనే స్పందించకపోతే బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని అప్పాని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు పి.మల్లేష్, కే.శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు రావు లక్ష్మణ్, రాజ్ నాయక్, పునీత్ రావు, కటకం శ్రీను, కనయ్య, రవికుమార్, నారాయణ, సాగర్, ప్రేమ్ సింగ్, అడపా రాజుతో పాటు సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# పాడి గేదెల పెంపకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ఆత్మకూర్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** ఆత్మకూరు, దామెర మండలాలకు 96 యూనిట్స్ పాడి గేదెల మంజూరి పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంనందు ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు పాడి గేదెల మంజూరి పత్రాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. అంతకుముందు పశు వైద్యులు లబ్ధిదారులకు పాడి గేదెల పెంపకం, పశు వులకు అందించాల్సిన పోషకాహారం, వ్యాధుల నివారణ, టీకాలు, వాతావరణ మార్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన, జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.పరకాల ఇందిరా మహిళా డైరీ ద్వారా రాబోయే 2 సంవత్సరాలలో దాదాపు 40వేల కుటుంబాలకు ప్రతి ఇంటికి 2 గేదెలను అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.పాడి గేదెల పెంపకం ద్వారా పేద కుటుంబాలు స్వయం ఉపాధిని పొందుతూ తమ కుటుంబ ఆర్థిక ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆత్మకూరు మండలం కు 72 యూనిట్స్, దామెర మండలానికి 24 యూనిట్స్ ప్రొసీడింగ్స్ పత్రాలను పంపిణీ చేశామని,యూనిట్ కాస్ట్ 2లక్షలు అని, దీనిలో సబ్సిడీ 1లక్ష 60 వేలు,బ్యాంక్ లోన్ 40 వేలు ఇస్తున్నామని అన్నారు.ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున, పాడి రైతులు పశు వుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువులకు సకాలంలో టీకాలు, వైద్య పరీక్షలు, పోషకాహారం అందిస్తూ ఆరోగ్యంగా పెంచితే పాల ఉత్పత్తి పెరిగి కుటుంబాలకు మరింత ఆదాయం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ ఈడి సురేశ్ , ఏడి వెటర్నరీ డా" బాలాజీ, ట్రైనర్స్ మమునూర్ వెటర్నరీ సెంటర్స్ డా రాజా బాబు,విక్రమ్, పరకాల సి ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కుభీర్‌లో విషాదం

- ఎల్లమ్మ చెరువులో మునిగి పదహారేళ్ల బాలుడు మృతి





**కుభీర్, సెప్టెంబర్ 04, (జనంసాక్షి):** చెరువులో దిగి ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ మండల కేంద్రానికి చెందిన దేవిదాస్ (16) అనే బాలుడు శుక్రవారం రోజున డోడర్నా గ్రామ సమీపంలో ఉన్న ఎల్లమ్మ చెరువులో గొర్రెలను మోపుతున్న క్రమంలో చెరువులో దిగాడు. అయితే నీటి లోతును గమనించకపోవడంతో ప్రమాదవ శాత్తు చెరువులో మునిగిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు వెంటనే బాలుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై కృష్ణారెడ్డి పోలీసు సిబ్బం దితో కలిసి ఘటనా స్థలానికి చేరు కున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరి శీలించి, వివ రాలను సేకరిం చారు. చేతికి వచ్చిన కొడుకు కళ్ల ముందే కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో కుభీర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుము కున్నాయి. కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
05 సెప్టెంబర్ 2026

## ముదిరాజుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు

- కొల్హాపూర్‌లో ఘనంగా 133వ జయంతి ఉత్సవాలు



**కొల్హాపూర్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన కొల్హాపూర్‌లో ముదిరాజుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు ఘన నివాళులు అర్పించారు. కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 1893లో సికింద్రాబాద్‌లో జన్మించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగిన ఆయన హైదరాబాద్ రాష్ట్రానికి తొలి మేయర్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన నిజాం కాలంలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసుకుని అనంతరం హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ముదిరాజులకు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యంగారి సంతోష్ కుమార్, అంసాన్ పల్లి రమేష్, వెంకటాపూర్ ముదిరాజ్ సంఘం సభ్యుడు మహిపాల్, ఎండుగుల యాదగిరి, టీచర్ యాదగిరి, చింతల యాదగిరి, ఎండు గుల శ్రీశైలం, ఎండుగుల రవీందర్, రాజు తదితర ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ముళ్లపొదల్లో నవజాత శిశువు..

- పట్వారిగూడెంలో కలకలం
- రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లినట్టు అనుమానం
- స్థానికులు గుర్తించి రక్షణ..
- రంగంలోకి పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు
- శిశువు తల్లిదండ్రుల ఆచూకీ కోసం పలు కోణాల్లో దర్యాప్తు



**దమ్మపేట సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** పుట్టిన పసికందును కంటికి రెప్పలా కాపాడాల్సిన వేళ.. ముళ్లపొదల్లో వదిలివెళ్లిన ఘటన దమ్మపేట మండలం పట్వారిగూడెంలో తీవ్ర కలకలం రేపింది. తల్లి ఒడిలో భద్రంగా ఉండాల్సిన నవజాత శిశువు ముళ్లపొదల్లో కనిపించడంతో స్థానికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.అయితే స్థానికులు సకాలంలో స్పందించి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పింది.గురువారం రాత్రి సమయంలో పట్వారిగూడెం ఎస్సీ కాలనీ సమీపంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్ వద్ద ఉన్న ముళ్లపొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు నవజాత శిశువును వదిలివెళ్లినట్టు తెలుస్తోంది.రాత్రి చీకట్లో ఎవరికీ కనిపించకుండా శిశువును అక్కడ వదిలివెళ్లగా.. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులకు ముళ్లపొదల నుంచి చిన్నారి ఏడుపు,కదలికలు వినిపించాయి.దీంతో వారు వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా ముళ్ల మధ్య నవజాత శిశువు కనిపించింది.దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో కలకలం నెలకొంది.స్థానికులు అప్రమత్తమై ముళ్లను తొలగించి చిన్నారిని జాగ్రత్తగా బయటకు తీసి సమీపంలోని ఇంటికి తరలించారు. అనంతరం పోలీసులకు,సంబంధిత అధికారులకు సమాచారం అందించారు.

### రంగంలోకి అధికారులు

సమాచారం అందుకున్న మహిళా సంక్షేమ అధికారి హేమసత్యతో పాటు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిశువు పరిస్థితిని పరిశీలించి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టారు. చిన్నారిని ఎవరు అక్కడికి తీసుకొచ్చారు? తల్లిదండ్రులు ఎవరు? రాత్రి సమయంలో ఆ ప్రాంతానికి అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా వచ్చారా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.పరిసర ప్రాంతాల్లో ఇటీవల ఎక్కడైనా ప్రసవం జరిగిందా? ఆసుపత్రులు, ప్రైవేటు క్లినిక్‌లు,వైద్య కేంద్రాల్లో ఇటీవల నమోదైన ప్రసవ వివరాలు ఏమైనా ఉన్నాయా?అనే కోణాల్లోనూ వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.అలాగే ఘటనకు సంబంధించిన ఆధారాలు,స్థానికుల సమాచారాన్ని సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### అనేక అనుమానాలు

శిశువును ముళ్లపొదల్లో వదిలివెళ్లడానికి కారణాలపై స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే అధికారిక దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.కుటుంబ పరిస్థితులు,సామాజిక భయాలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లోనూ పోలీసులు విచారణ చేపట్టే అవకాశం ఉంది.పుట్టిన కొద్దిసేపటికే తల్లిదండ్రుల ఆదరణకు దూరమై ముళ్లపొదల్లో కనిపించిన చిన్నారిని స్థానికులు సకాలంలో గుర్తించి రక్షించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.ఒకవైపు శిశువును అక్కడ వదిలివెళ్లిన వ్యక్తులు ఎవరు?అనే ప్రశ్నకు సమాధానం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తుండగా.. మరోవైపు ఆ చిన్నారికి భద్రత, సంరక్షణ కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.దర్యాప్తు పూర్తయితేనే ఈ ఘటన వెనుక అసలు కారణాలు,శిశువును అక్కడ వదిలివెళ్లిన వారి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.పసికందును నిర్లక్ష్యంగా వదిలివెళ్లిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను నిగ్గుతేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

## బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ సూర్యాపేట మీదుగా వెళ్లేలా కృషి

- రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



**సూర్యాపేట, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** సూర్యాపేట ప్రజల చిరకాల వాంఛ అయిన బుల్లెట్ ట్రైన్, జాతీయ రహదారి 65కు సమాంతరంగా రైల్వే కారిడార్ కొరకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, నితిన్ గడ్కరి, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ల సహకారంతో సూర్యాపేట వాసిగా కృషి చేస్తానని మాజీ పార్లమెంటు సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ అన్నారు.జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులకు మద్దతు తెలిపి మాట్లాడారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించాలని కోరిన సంగతి గుర్తు చేశారు. జాతీయ రహదారి 65కు సమాంతరంగా హైదరాబాద్, సూర్యాపేట, జగ్గయ్యపేట, అమరావతి మీదుగా చెన్నై, విశాఖ పట్టణాలకు సైంటిఫిక్ గా భూసేకరణ చేసి బుల్లెట్ ట్రైన్స్ సౌకర్యాన్ని కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.హైదరాబాదులో భూముల రేట్లు పెంచడానికే అలైన్మెంట్ మార్చారని ఆరోపించారు.తాను ఎంపీగా ఉన్న సమయంలో చిట్యాలకు డ్రై ఫోర్ట్ ను కూడా మంజూరు చేయించానని గుర్తు చేశారు. బిజెపి తరఫున సూర్యాపేటకు రైల్వే సౌకర్యాన్ని కల్పించేలా సాధించి తీరుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి కన్వీనర్ జానకి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ,బిజెపి జిల్లా నాయకులు చలమల్ల నరసింహ, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, బిజెపి పట్టణ అధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, గండూరి శంకర్, అఖిల పక్షాల నాయకులు, జర్నలిస్ట్ భూపతి రాములు, సట్టు నాగయ్య, సిఐటియు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 12న ముస్లిం ఐక్య సంఘం బహిరంగ సభ

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 12 (శనివారం)వ తేదీన నిర్వహించనున్న జిల్లాస్థాయి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్ ఇషాతి పిలుపునిచ్చారు. అసెంబ్లీ నియోజక వర్గం అయిన మధిర జామియా మస్జిద్‌లో శుక్రవారం ముస్లిం ఐక్య సంఘం అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ ఇషాఅతి ఆధ్వర్యంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఐక్య సంఘం ఆవిర్భావానికి మధిర గడ్డే పునాది అని, అందువల్ల కొత్తగూడెంలో జరుగుతున్న ఈ జిల్లాస్థాయి బహిరంగ సభతో మధిర నియోజకవర్గానికి ప్రత్యేకమైన అనుబంధం, బాధ్యత ఉన్నాయని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి మస్జిద్ పరిధి నుంచి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి. కుటుంబాలకు, యువతకు, పెద్దలకు సభ సందేశాన్ని చేరవేయాలి. కొత్తగూడెం గడ్డపై మధిర నియోజకవర్గ ముస్లిం సమాజ ఐక్యత, క్రమశిక్షణ, చైతన్యం స్పష్టంగా కనిపించాలి పిలుపునిచ్చారు. ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న విద్యా, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం, యువత భవిష్యత్తు, సామాజిక చైతన్యం, సమాజ అభివృద్ధి, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యతే ప్రధాన బలం అని పేర్కొన్నారు. వ్యక్తిగత, గ్రామ, మండల భేదాలను పక్కనపెట్టి సమాజ ప్రయోజనాల కోసం ఒకే వేదికపై నిలబడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒక్కరి అడుగు చిన్నదిగా కనిపించవచ్చు; వేలాది మంది ఒకే లక్ష్యంతో ముందుకు నడిస్తే అది సమాజ శక్తిగా మారుతుంది. సెప్టెంబర్ 12న కొత్తగూడెం గడ్డపై మన ఐక్యతను, మన క్రమశిక్షణను, మన సామాజిక చైతన్యాన్ని చాటుదాం అని తెలిపారు. సభను విజయవంతం చేయడం ప్రతి ముస్లిం ఐక్య సంఘం నాయకుడు, కార్యకర్త, సభ్యుడు తన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయి నుంచి విస్తృత ప్రచారం చేపట్టి, ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి, యువతను మరియు ముస్లిం సోదరులను సమీకరించి మధిర నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, యువకులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ఆలయ పనుల్లో వేగం పెంచాలి

- 24 గంటలు పనులు జరిగేలా మూడు షిఫ్టులు..
- అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు
- నాణ్యతలో రాజీ వద్దు.. అవసరాలు చెబితే నిధులు మంజూరు చేయిస్తా..
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**భద్రాచలం, సెప్టెంబరు 4 (జనంసాక్షి) :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పనులు మూడు షిఫ్టుల్లో, 24 గంటల పాటు నిరంతరాయంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు కేవలం 25 శాతం పనులు మాత్రమే పూర్తవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. దేవాదాయ శాఖపై తమకు పూర్తి నమ్మకం ఉందని, అయితే నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం తగ్గకూడదన్నారు. ఆలయ నిర్మాణానికి వినియోగించే రాళ్ల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి, అత్యుత్తమ నాణ్యత కలిగిన రాళ్లనే ఉపయోగించాలని సూచించారు.

ఆలయ నిర్మాణాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని, అవసరాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ క్షేత్రస్థాయిలో అవసరాలను పర్యవేక్షించాలని సూచించారు. ఏవైనా అదనపు అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి తక్షణమే అనుమతులు, నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

సమీక్షలో ఆలయ ఈవో దామోదర్, క్షేత్ర కన్సల్టెంట్ ప్రతినిధులు సత్యకృష్ణ, సూర్యనారాయణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్‌లో ప్రతిభ చాటిన గిరిజన విద్యార్థి



**ఆళ్లపల్లి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని నడిమిగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు పాయం నరసింహారావు కుమారుడు పాయం చాణిక్య కష్టపడి చదువుకొని నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. గిరిజన కుటుంబానికి చెందిన చాణక్య తల్లిదండ్రులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మారుమూల ప్రాంతంలో అనేక ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ చదువుపై ఆసక్తిని కోల్పోకుండా పట్టుదలతో శ్రమించి వైద్య విద్యలో ప్రవేశం సాధించారని తల్లిదండ్రులు తెలిపారు. (2026-27)విద్యా సంవత్సరానికి నిర్వహించిన నీట్ పరీక్షలో చాణక్య(434)మార్కులు సాధించి,(19,680)ర్యాంకు సాధించి ఎస్టీ కేటగిరీలో కౌన్సెలింగ్ ద్వారా మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్,బాచుపల్లి (హైదరాబాద్)లో ఎంబిబిఎస్( బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ యాప్ సర్జరీ) సీటు కేటాయించారని గిరిజన విద్యార్థిపాయం చాణిక్య తెలిపారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద పాయం చాణక్యకు ఈ సీటు లభించిందని ఆయన సాధించిన ఈ విజయం నడిమిగూడెం గ్రామంతో పాటు ఆళ్లపల్లి మండల ప్రజల్లో ఆనందాన్ని నింపిందని తల్లిదండ్రులు అన్నారు. మారుమూల గిరిజన గ్రామం నుంచి వైద్య విద్య వరకు చేరుకున్న పాయం చాణక్య ప్రయాణం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారని అన్నారు ఆర్థిక, భౌగోళిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను అధిరోహించొచ్చని గిరిజన విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపారు.

# కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- శిరీష తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి
- హాస్పిటల్ యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని ఆదేశం



**ములకలపల్లి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** ములకలపల్లి మండలం నుంచి హైదరాబాదులో స్టాఫ్ నర్స్‌గా పని చేసేందుకు వెళ్లిన ఊకే శిరీష ను హత్య చేసి, అనంతరం లైంగిక దాడి చేసిన మానవ మృగానికి చట్ట ప్రకారం కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ములకలపల్లి మండలంలోని మృతురాలి స్వగ్రామం చౌటిగూడెం గ్రామానికి వెళ్లి తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. సభ్యసమాజం తలదించుకునేలా శిరీష హత్య జరగడం దారుణమని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు.మానవ మృగం చేతిలో గిరిజన యువతి శిరీష హత్య కావడం దారుణమైన సంఘటన అని అన్నారు. భద్రాచలం ఐటిడిఏ పరిధిలో గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా ఉపాధి పొంది కుటుంబానికి అండగా నిలిచేందుకు హైదరాబాద్ వెళ్లిన శిరీష మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని అన్నారు. న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మీ కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్, రు.5 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,ఐటీడీఏ పీ.వో రాహుల్, హౌసింగ్ పీ.డీ సవయ్ రామ్‌ల సమక్షంలో మృతురాలి కుటుంబ సభ్యులను అందజేసినారు. అనంతరం హైదరాబాదులో శిరీష హత్య జరిగిన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీ.పీ తో మృతురాలి ఇంట్లో నుంచి కుటుంబ సభ్యుల ముందు ఫోన్ లో మంత్రి పొంగులేటి మాట్లాడారు. నర్సింగ్ విద్యార్థి శిరీష హత్య జరిగిన వసతి గృహాన్ని తక్షణమే తనిఖీలు చేపట్టి ఆసుపత్రికి అనుసంధానమైన వసతి గృహంలో రక్షణ చర్యలు పై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైతే ఆ ఆసుపత్రిని సీజ్ చేసేలా చర్యలు చేపడతామని, హత్యకు కారకుడైన నిందితుడిపై ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ లో ఆసుపత్రి, వసతి గృహాల సంబంధించిన వారిని ఎందుకు చేర్చలేదని అడిషనల్‌గా ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం అయ్యి శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి విలేఖరులతో అన్నారు. మంత్రి పొంగులేటి వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ములకలపల్లి తాహాసిల్దార్ స్వాతి, ఎంపీడీఓ సత్యనారాయణ, బత్తుల అంజి, జహిరుద్దీన్, కుంజా వినోద్, కారం సుధీర్, కొరసా చంద్రలేఖ,ఈర్ల రామ్మోహన్ రావ్, తమ్మిశెట్టి శ్రీను, గాడి తిరుపతి రెడ్డి, తాండ్ర ప్రభాకర్ రావ్, మడకం రవి, దేవల్ల బిక్షం, పాలకుర్తి సుమిత్, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, శ్రీనన్న అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించాలి



**సూర్యాపేట, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్, జాతీయ రహదారి 65కు సమాంతరంగా రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు, ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బిషప్ దుర్గం ప్రభాకర్ మద్దతు తెలిపి మాట్లాడారు.ప్రపంచంలోని అతి పెద్ద రైల్వే సంస్థలలో ఒకటైన భారతీయ రైల్వే దేశంలోని అనేక ప్రాంతాలను కలుపుతూ రైళ్లను నడిపిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లా ప్రాంతవాసులు రైల్వే సౌకర్యానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సూర్యాపేట జిల్లా ప్రజలు హైదరాబాద్,నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, జనగాం, వరంగల్ పట్టణాలు వెళ్లి ఇతర ప్రాంతాలకు రైల్వే ప్రయాణం చేయాల్సి వస్తుందని అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంకు రైల్వే మార్గం లేకపోవడం ఇక్కడి రాజకీయ నాయకుల వైఫల్యమని అన్నారు.ఈ దీక్షకు స్వచ్ఛందంగా పార్టీలకు అతీతంగా అన్నీ వర్గాల ప్రజల యొక్క మద్దతూ రోజు రోజుకు పెరుగుతుందని,ఈ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.సూర్యాపేటకు మొదట చేసిన అలైన్మెంట్ ప్రకారం బుల్లెట్ రైలు రావాల్సి ఉండగా,ఆ తర్వాత మార్చడం అన్యాయమని అన్నారు.మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ ను హైదరాబాద్, చౌటప్పల్, చిట్యాల, నార్కట్ పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ మీదుగా విజయవాడ, చెన్నైకి నడపాలని డిమాండ్ చేశారు.దీని ద్వారా జిల్లా ప్రజలకు విద్యా, వైద్య పరంగా, వ్యాపార వాణిజ్య పరంగా సూర్యాపేట జిల్లా చుట్టుప్రక్కల ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్.శ్యామ్ ప్రసాద్,ముల్లంగి జాకబ్ రాజు, జలగం జేమ్స్, చింత మనిషే, పి.మార్క్, కొండేటి లాజర్, యం.రూబెన్, పంది మార్క్, కొమ్ము హోసన్నా, మామిడి క్రిస్టోఫర్, పిట్టల సామెలు, రెంటాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.








## ఎన్ఎస్ఈ రూ.30వేల కోట్ల ఐపీఓకు
# సెబీ గ్రీన్ సిగ్నల్

**దిల్లీ:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. దీంతో సుమారు రూ.30వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించేందుకు ఎన్ఎస్ఈకి మార్గం సుగమమైంది. జూన్‌లో సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించగా.. శుక్రవారం సెబీ ఆమోద ముద్ర వేసింది. సెప్టెంబర్ 18న ఐపీఓ ప్రారంభం కావొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ధరల శ్రేణి, ఇతర వివరాలు సెప్టెంబర్ 15న వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఎన్ఎస్ఈ ఐపీఓ దాదాపు దశాబ్దం క్రితమే రావాల్సింది. కో-లొకేషన్ వివాదం కారణంగా దాదాపు దశాబ్ద కాలంగా పబ్లిక్ ఇష్యూ కోసం వేచి చూడాల్సి వచ్చింది. అన్ని అడ్డంకులూ దాటి సెబీ ఆమోదం కూడా పొందిన నేపథ్యంలో నిధుల సమీకరణకు ఎన్ఎస్ఈ సన్నాహాలు మొదలు పెట్టనుంది. ఈ ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. మొత్తం 14.89 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు 6 శాతం వాటాలను విక్రయించనున్నారు. ఇందులో ఒక్క ఎస్‌బీఐనే 2.48 కోట్ల షేర్లను విక్రయించనుంది. సుమారు రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రూ.30వేల కోట్లు ఐపీఓ ద్వారా సమీకరించొచ్చని భావిస్తున్నారు. తద్వారా హ్యుందాయ్ రూ.27,870 కోట్ల రికార్డును అధిగమించనుంది. మరోవైపు, టెలికాం కంపెనీ జియో కూడా ఐపీఓకు వస్తోంది. సుమారు రూ.37 వేల కోట్ల వేట చేపట్టనుంది.

# వరుస నష్టాలకు విరామం

## లాభాల్లో ముగిసిన సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అమెరికాలో వడ్డీ రేట్ల భయాలు సన్నగిల్లడంతో అంతర్జాతీయ మార్కెట్లు సహా దేశీయ మార్కెట్ సూచీలు లాభపడ్డాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది.సెన్సెక్స్ ఉదయం 76,657.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,152.86) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,883.14 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.49గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,472 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పోకో నుంచి 2 కొత్త ఫోన్లు..

**దిల్లీ:** షావోమీ అనుబంధ సంస్థ పోకో దేశీయ మార్కెట్‌లోకి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను తీసుకొచ్చింది. మిడ్‌రేంజ్‌లో ఎక్స్8 ఎక్స్8 పవర్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లో ఎక్స్8 ప్రో, ఎక్స్8 ప్రో మ్యాక్స్‌ను ఇది వరకే తీసుకొచ్చింది. ఇక, పోకో ఎక్స్8 పవర్ వేరియంట్‌ను 10,000 ఎంఏహెచ్ బ్యాటరీతో తీసుకురావడం విశేషం. స్టాండర్డ్ వేరియంట్ ఎక్స్8లో 9,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. రెండింట్లోనూ స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే ఇవ్వడం విశేషం.ఈ రెండు స్మార్ట్‌ఫోన్లు ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3తో పనిచేస్తాయి. నాలుగేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది.రెండు ఫోన్లనూ 6.83 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్‌ప్లేతో తీసుకురావడం గమనార్హం. 120 రిఫ్రెష్ రేటు, డాల్బీ విజన్, 3,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. రెండింటికీ కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 ప్రొటక్షన్ ఉంది. ఐపీ66, వాటర్ రెసిస్టెన్స్ ఇచ్చారు.రెండు ఫోన్లలోనూ 50 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. దీంతో పాటు 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. 2 ఎంపీ డెప్త్ సెన్సర్ అమర్చారు. ఎక్స్8 పవర్‌లో 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇవ్వగా.. పోకో ఎక్స్8లో మాత్రం 16 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇవ్వడం గమనార్హం. పోకో ఎక్స్8 పవర్‌లో 10,000 ఎంఏహెచ్ బ్యాటరీ 100చి ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 27చి రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. పోకో ఎక్స్8లో 9000 ఎంఏహెచ్ బ్యాటరీ 67చి ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 22.5చి వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సౌలభ్యం ఉంది. రెండింటిలోనూ ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ అమర్చారు.

## కెన్యా యూనిట్‌లో సమస్య పరిష్కారానికి సిద్ధం: టాటా కెమికల్స్

**నైరోబీ:**కెన్యాలోని టాటా కెమికల్స్ కార్యకలాపాలు నిలిపేయాలని ఆ దేశాధ్యక్షుడు చేసిన హెచ్చరికలపై టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కెమికల్స్ స్పందించింది. ఆ యూనిట్‌లో సమస్యను చట్టబద్ధంగా పరిష్కరించుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపింది. ఈ విషయంపై ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించింది. 2005లో టాటా కెమికల్స్ మగాడి లిమిటెడ్ ప్లాంట్‌ను ప్రారంభించినప్పటి నుంచి తూర్పు ఆఫ్రికా దేశ ఆర్థిక వ్యవస్థలో తమ సంస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపింది.జులై 28, 2026న ఆ ప్రదేశంలో మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేసినట్లు కంపెనీ వెల్లడించింది. వాటికి సంబంధించిన మైనింగ్ పత్రాలను సంబంధిత మంత్రిత్వ శాఖకు సమర్పించినట్లు తెలిపింది. మంత్రిత్వ శాఖ లేవనెత్తిన అన్ని అంశాలకు సంబంధించిన సమగ్ర నివేదికలు అందించినట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు స్పష్టం చేసింది. ఉద్యోగులు, మగాడి కమ్యూనిటీ, కెన్యాలోని వాటాదారుల సంక్షేమంపై కట్టుబడి ఉన్నామంది. కెన్యా ఆర్థికాభివృద్ధే తమ ప్రధాన ప్రాధాన్యతగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.




**కెన్యా అధ్యక్షుడు ఏమన్నారంటే..?:**కెన్యా అధ్యక్షుడు విలియం రూటో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లేక్ మగాడి ప్రాంతంలోని టాటా కెమికల్స్ కార్యకలాపాలు నిలిపేయాలని కంపెనీని ఆదేశించారు. తమ దేశంలోని వనరులను ఉపయోగించుకుంటున్నప్పటికీ.. ఆ కంపెనీ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వట్లేదని ఆరోపించారు. టాటాకు సుమారు 100 ఏళ్ల కాంట్రాక్ట్ ఉన్నప్పటికీ తమ పౌరులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అందువల్ల కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. కాగా, టాటా కెమికల్స్ మగాడి ఆఫ్రికాలోనే అతిపెద్ద సోడా యాష్ ఉత్పత్తి కేంద్రంగా పేరొందింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,60,754 (22 క్యారెట్లు) | ₹ 1,75,370 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000


## 76 శాతం ప్రీమియంతో లిస్టింగ్.. ఆపై అప్పర్ సర్క్యూట్

దిల్లీ: ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. మదుపర్లకు మంచి లాభాలను అందించింది. ఇష్యూ ధర రూ.429 కాగా.. 76 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు లిస్టయ్యాయి. అనంతరం షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.ఇష్యూ ధరతో పోలిస్తే ఈఎస్‌డీఎస్ షేర్లు ఎన్ఎస్ఈలో 76.46 శాతం ప్రీమియంతో రూ.757 వద్ద ప్రారంభమయ్యాయి. బీఎస్ఈలోనూ 73.96 శాతం ప్రీమియంతో రూ.746.30 వద్ద లిస్టయ్యాయి. లిస్టింగ్ తర్వాత కూడా షేర్లు రాణించాయి. ఇష్యూ ధరతో పోలిస్తే ఎన్ఎస్ఈలో 111.75 శాతం ప్రీమియంతో రూ.908.40 వద్ద, బీఎస్ఈలో 108.75 ప్రీమియంతో రూ.895.55 వద్ద షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.10,500 కోట్లు దాటింది.
ఏఐ ఆధారిత క్లౌడ్, డేటా సెంటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ రూ.720 కోట్లను పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది. ధరల శ్రేణిని రూ408- 429గా నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ సమయంలోనూ ఇన్వెస్టర్ల నుంచి మంచి డిమాండ్ రావడంతో 142 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెంటర్ ఎక్విప్‌మెంట్, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.



# ఏఐలో మనమే టాప్

## అంతర్జాతీయ సగటు కంటే రెట్టింపు స్థాయిలో ఫ్రంటియర్ ప్రొఫెషనల్స్




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మైక్రోసాఫ్ట్ వర్క్ ట్రెండ్ ఇండెక్స్ 2026 కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను రోజువారీ పనుల్లో ప్రభావవంతంగా అమలు చేయడంలో ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా నిలిచింది. మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన 'వర్క్ ట్రెండ్ ఇండెక్స్ 2026' ప్రకారం.. ప్రపంచంలోని 10 ప్రధాన మార్కెట్ల (అమెరికా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ, నెదర్లాండ్స్, బ్రెజిల్)లో పరిశోధన చేయగా.. అత్యధిక స్థాయిలో ఫ్రంటియర్ ప్రొఫెషనల్స్ ఉన్న దేశంగా భారత్ నిలిచింది. మన దేశంలోని ఏఐ వినియోగదారుల్లో 32% మంది సంక్లిష్ట మల్టీ-స్టెప్ వర్క్‌ఫ్లోస్‌లో ఏఐ ఏజెంట్‌లను వినియోగిస్తూ, పనితీరును పూర్తిగా పునర్నిర్మించుకుంటున్నారు. అంతర్జాతీయ సగటు (16%) కంటే ఇది రెట్టింపు. గతేడాదితో పోలిస్తే తాము చేయలేని పనులను సైతం ఏఐ సాయంతో సులభంగా చేయగలుగుతున్నామని 78% మంది భారత వినియోగదారులు తెలిపారు. ప్రపంచ సగటు 58 శాతంగా ఉంది. 10 దేశాల్లో 20,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలతో రూపొందించిన నివేదిక ప్రకారం.ఏఐ ఇచ్చిన వివరాలను గుడ్డిగా నమ్మకుండా, మానవ పర్యవేక్షణకు భారత నిపుణులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. 63% మంది నాణ్యత నియంత్రణకు, 59% మంది క్రిటికల్ థింకింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.87% మంది తాము ఇప్పటికీ నిర్ణయాధికారం తమ చేతుల్లోనే ఉంచుకుంటున్నామని, ఏఐ ఔట్‌పుట్‌ను తుది ఫలితంగా కాకుండా.. ప్రారంభ కేంద్రంగా మాత్రమే చూస్తున్నామని అంటున్నారు.'భారత్‌లో ప్రతి ముగ్గురిలో ఒకరు ఏఐ ఏజెంట్లతో కలిసి పనిచేస్తుంటే, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు మాత్రమే పనిచేస్తున్నారు. ఇది వ్యత్యాసం కాదు.. ప్రపంచానికే భారత్ అందిస్తున్న నాయకత్వం' అని మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు పునీత్ చందోక్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు భారత్ నుంచే 2.7 కోట్ల మంది సేవలందిస్తున్నారని వివరించారు.
ఐటీ దిగ్గజ సంస్థల్లో కోపైలట్ జోరు:దేశీయ ఐటీ సేవల సంస్థలు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌ను భారీగా వినియోగిస్తున్నాయి. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, ఎల్‌టీఐమైండ్‌ట్రీ సంస్థలు సంయుక్తంగా 4,00,000 కంటే ఎక్కువ కోపైలట్ సీట్లను సమకూర్చుకున్నాయి. ఇన్ఫోసిస్ కోపైలట్ లైసెన్స్ కలిగిన ఉద్యోగుల్లో 91 శాతానికి పైగా నెలవారీ యాక్టివ్ వినియోగదారులు ఉన్నారు. విప్రో నెలవారీ యాక్టివ్ వినియోగం 95 శాతానికి పైగా నమోదైంది. ఉద్యోగులే స్వయంగా 29,000 కంటే ఎక్కువ ఏజెంట్లను, 60కి పైగా ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్ ఏజెంటిక్ ఏఐ సొల్యూషన్లను అభివృద్ధి చేశారు. టీసీఎస్ 86% మంది లైసెన్స్‌డ్ ఉద్యోగులు రోజూ ఏఐని వినియోస్తుండగా, రీసెర్చ్-కంటెంట్ విభాగాల్లో ఉత్పాదకత 20-25% పెరిగిందని, వర్క్ సైకిల్ సమయం 25-35% తగ్గిందని గుర్తించారు.

## 1,00,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నాం

### ఫోక్స్‌వ్యాగన్ ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తగ్గించుకోనుంది ఈ దశాబ్దం చివరినాటికి లక్ష ఉద్యోగాలకు కోత పెట్టనుంది. ఈ మేరకు యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. తొలుత 50వేల మందిని తొలగించాలని నిర్ణయించిన సంస్థ.. అదనంగా మరో 50వేలమంది తొలగింపు ప్రణాళికను కూడా ఆమోదించినట్లు చెప్పింది. "కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా శ్రామికశక్తి సర్దుబాటు చేయడం తప్పనిసరి" అని పేర్కొంది. ఇదే జరిగితే.. ఇది ఆటో పరిశ్రమ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ కానుంది.కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఈ లక్ష మంది దాదాపు 15 శాతానికి సమానం. ప్రస్తుతం ఫోక్స్ వ్యాగన్ గ్రూప్‌లో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోనే 43 శాతం మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కోతలను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు కంపెనీ ప్రకటనలో కోతలకు ఆ సంఘాలు కూడా అంగీకరించినట్లు పేర్కొనడం గమనార్హం. అలాగే నాలుగు జర్మన్ ప్లాంట్లను మూసే ప్రణాళికను ప్రస్తావించింది.

## కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ కరువు

### ప్రాజెక్ట్‌కు ఒక్కరూ ముందుకు రాలేదు

దిల్లీ: కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ కరవైంది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఒక్కరూ ముందుకు రాలేదు. సెప్టెంబర్ 7తో ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగియనుండగా.. ప్రైవేటు సంస్థల నుంచి గానీ, ప్రభుత్వ రంగం నుంచి గానీ ఒక్క దరఖాస్తూ రాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.మన దేశంలో బొగ్గు నిల్వలు పుష్కలం. కానీ కర్బన ఉద్గారాల బెడద కారణంగా వాటిని సమర్థంగా వినియోగించుకోలేక.. ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతున్నాం. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' విధానాన్ని ఆయుధంగా మలచుకోవాలని కేంద్రం తాజాగా సంకల్పించింది. ఇందుకోసం రూ.37,500 కోట్లతో ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర పడింది. 75 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేయడమే లక్ష్యంగా ఇటీవల ఈ పథకాన్ని కేంద్రం ప్రకటించింది.



## ఆధార్‌లో పుట్టిన తేదీ ఒకటి కంటే ఎక్కువసార్లు మార్చుకోవచ్చా?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్చుకోవాలనుకుంటున్నారా? అనుకోని పొరపాట్ల వల్ల ఒకటి కంటే ఎక్కువ సార్లు సవరించాల్సి వస్తోందా? అయితే, ఇది మీకోసమే. ఆధార్‌లో పుట్టిన తేదీ వివరాలను ఒకటి కంటే ఎక్కువసార్లు మార్చుకునే అవకాశం ఉంది. అయితే, మొదటిసారితో పోలిస్తే రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు మార్చుకునే విషయంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. పుట్టిన తేదీని ఒకసారి అప్‌డేట్ చేసిన తర్వాత మళ్లీ మార్పు చేయడం అంత సులభమైన పని కాదని ఉడాయ్ 'ఎక్స్' వేదికగా తెలిపింది.ఆధార్ కార్డు నమోదు సమయంలో సరైన పత్రాలు ఇచ్చినప్పటికీ, ఆపరేటర్ చేసిన పొరపాటు వల్ల కొన్నిసార్లు పుట్టిన తేదీ తప్పుగా నమోదవ్వొచ్చు. అలాంటి సందర్భాల్లో మీరు గతంలో సమర్పించిన రికార్డులను పరిశీలించి సరైన సమాచారం ఇచ్చినట్లయితే పుట్టిన తేదీ సవరణ ప్రక్రియ సులభంగానే ఉంటుంది. పుట్టిన తేదీని నమోదు చేసినా సులభంగానే సరిచేసుకునే వెసులుబాటు ఉంటుంది. కొన్నిసార్లు ఇతర పత్రాల ద్వారా ఆధార్ పొంది ఉండొచ్చు. అలాంటప్పుడు తప్పుగా నమోదైన పుట్టినతేదీని సవరించుకునేందుకు ఉడాయ్ అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం 18ఏళ్లు పైబడిన భారతీయులు, ఎన్నారైలు అధికారిక జనన ధ్రువీకరణను నిర్ధరించే నిర్దిష్ట పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. 18ఏళ్ల లోపు భారతీయులకు మాత్రం బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి. 18 ఏళ్లలోపు ఎన్నారైలేతే.. బర్త్ సర్టిఫికెట్ లేదా భారతీయ పాస్‌పోర్టును సమర్పించాల్సి ఉంటుంది.




రెండోసారి మార్పు చేయాల్సి వస్తే..
ఆధార్‌లో రెండోసారి లేదా అంతకన్నా ఎక్కువ సార్లు పుట్టిన తేదీని మార్చడం కొంచెం కష్టమే. తొలిసారి అప్‌డేట్ చేసినప్పుడు బర్త్ సర్టిఫికెట్ కాకుండా వేరే ధ్రువీకరణ పత్రం ఇచ్చి ఉంటే.. రెండోసారి మాత్రం బర్త్ సర్టిఫికెట్‌తో పాటు అఫిడవిట్ సమర్పించాలి. ఒకవేళ మొదటిసారి కూడా బర్త్ సర్టిఫికెట్ ఇచ్చినట్లయితే... రెండోసారి కూడా అదే రిజిస్ట్రార్ జారీ చేసిన సవరించిన కొత్త బర్త్ సర్టిఫికెట్‌తో పాటు, అఫిడవిట్‌ను సమర్పించాలి. భారతీయులతో పాటు ప్రవాసీయులకూ ఈ నిబంధన వర్తిస్తుంది. మీరు సమర్పించిన పత్రాలు రెండుసార్లు సరైనవే అయ్యి ఉండి.. ఆపరేటర్ తప్పిదం వల్ల తప్పుగా పుట్టిన తేదీ నమోదై ఉంటే సరిదిద్దుకునే అవకాశాన్ని ఉడాయ్ కల్పిస్తోంది. గతంలో సమర్పించిన డాక్యుమెంట్ మీ దగ్గర ఉంటే నేరుగా దాంతోనే అప్‌డేట్ చేయొచ్చు. ఆ పాత పత్రం లేనప్పుడు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
వారికి ఆఖరి ఛాన్స్
దరఖాస్తుదారుడు నకిలీ లేదా తప్పుడు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తే దాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. అలాంటి వారి ఆధార్‌ను డీయాక్టివేట్ చేస్తారు. అలా డీయాక్టివేట్ అయిన సందర్భంలో ఉడాయ్ చివరి అవకాశం కల్పిస్తుంది. సంబంధిత ప్రాంతీయ కార్యాలయం ద్వారా పూర్తి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఫేస్, ఐరిస్, ఫింగర్స్) ఆన్‌లైన్ వెరిఫై చేయదగిన బర్త్ సర్టిఫికెట్, అఫిడవిట్ సమర్పించి మాత్రమే ఆధార్‌ను తిరిగి యాక్టివేట్ చేసుకోవచ్చు. ఐదేళ్ల లోపు కేటగిరీలో చేరినప్పుడు ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్నా, మైనర్‌గా చేరినప్పుడు 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న సందర్భాల్లో ఈ నిబంధన వర్తిస్తుంది.

## అడోబ్ సీఈఓగా మళ్లీ భారతీయుడే..

అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ నాయకత్వ పగ్గాలు మళ్లీ భారతీయుడికే దక్కాయి. ఇప్పటివరకు సీఈఓగా ఉన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కంపెనీ నూతన సీఈఓగా అనిల్ చక్రవర్తి నియమితులయ్యారు. డిసెంబర్ 1న అనిల్ ఈ కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఏఐ ప్రభావం నేపథ్యంలో డిజైన్ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్‌లో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి అడోబ్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థలో నాయకత్వ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు దశాబ్దాలుగా సీఈఓగా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఈ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు మార్చిలో కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం ఈయన ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఏఐ యుగంలో అడోబ్ వృద్ధికి నాయకత్వం వహించడానికి అనిల్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నానని శంతను నారాయణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.భారత్‌కు చెందిన అనిల్ చక్రవర్తి ఐఐటీ వారణాసి నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ చదివారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. 2020లో ఆయన అడోబ్‌లో చేరారు. కొన్నేళ్లపాటు డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ వ్యాపారానికి నాయకత్వం వహించారు. అనంతరం కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత చేపట్టారు. అదే సమయంలో సంస్థ గ్లోబల్ సేల్స్‌ను కూడా పర్యవేక్షించారు.

## ఉద్యోగుల 'స్లాక్' ఖాతాలు మాయం.. ఒరాకిల్‌లో 'సైలెంట్' లేఆఫ్‌లు..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారీగా లేఆఫ్‌లకు సిద్ధమైన టెక్ దిగ్గజం ఒరాకిల్ ఈసారి సైలెంట్‌గా ఉద్యోగులను తొలగిస్తోందని తెలుస్తోంది. గతంలో మాదిరిగా ఉదయం ఆరుగంటల సమయంలో ఉద్యోగులకు ఎలాంటి ఈ మెయిల్స్ రాలేదు. కానీ సిబ్బంది 'స్లాక్' ఖాతాలు మాత్రం మాయమవుతున్నాయట. రెడిట్ ఖాతాలో 'లేఆఫ్స్ స్టార్టెడ్ ఇన్ యూఎస్' అనే ఒక థ్రెడ్ తాజాగా వైరల్ అవుతోంది.కంపెనీ అంతర్గత కమ్యూనికేషన్ యాప్ 'స్లాక్'లో లేఆఫ్‌లకు గురైన వారి ఖాతాలు క్రమక్రమంగా కనిపించకుండా పోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. వీరందరికీ ఒకేసారి సందేశాలు పంపకపోయినా.. తొలగింపులు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. లేఆఫ్ తర్వాత ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే.. సదరు ఉద్యోగుల స్లాక్ ఖాతాలు కంపెనీ ఈ మెయిల్ యాక్సెస్‌ను నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కంపెనీ నుంచి ఎవరెవరిని తీసేస్తున్నారో అధికారికంగా తెలియకపోవడంతో, మిగిలిన ఉద్యోగులు స్లాక్ గ్రూప్‌లలోని సభ్యుల సంఖ్యను గమనిస్తున్నారట. ఎంతమంది తగ్గిపోయారో ట్రాక్ చేస్తున్నారు.ఒరాకిల్‌కు చెందిన అప్లికేషన్ ల్యాబ్స్ బృందంలోని వైస్ ప్రెసిడెంట్స్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్స్ పదవులు పోయినట్లు సమాచారం. ఈ బృందాన్ని ఇటీవల ఒరాకిల్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో విలీనం చేశారు. తాజా కోతలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7,000 నుంచి 10,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా. భారత్‌లో వివిధ విభాగాల మేనేజర్లు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ ఏడాది మార్చి నెలలో ఒరాకిల్ 10వేల మంది సిబ్బందిని తగ్గించుకుంది. అప్పుడు ఒకటో తేదీ ఉదయం ఆరుగంటల సమయంలో యూఎస్, ఇండియా, కెనడాలోని సిబ్బందికి తొలగింపు మెయిల్స్ పంపింది ఇప్పుడు సెప్టెంబర్ ఒకటిన అలాంటి మెయిల్స్ వస్తాయని భావించినా.. కంపెనీ భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

## 56వ ఇండస్ట్రియల్, ఇంజనీరింగ్ ఎక్స్‌పో ప్రారంభం



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 04 (జనం సాక్షి):** హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 56వ ఇండస్ట్రియల్, ఇంజనీరింగ్ ఎక్స్‌పో(ఇండెక్స్‌పో) శుక్రవారం ప్రారంభమైందని ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కె.అగర్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు జరిగే ఎక్స్‌పోలో హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాలకు చెందిన 100కు పైగా ఎగ్జిబిటర్లు, 12,000కు పైగా పారిశ్రామిక ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. హ్యాండ్ టూల్స్, మెషిన్ టూల్స్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, సోలార్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, భద్రతా ఉత్పత్తులు తదితర రంగాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 2015 నుంచి నిర్వహిస్తున్న ఇండెక్స్‌పో ఇప్పటివరకు 1,200కు పైగా ఎగ్జిబిటర్లు, లక్ష మందికి పైగా వాణిజ్య సందర్శకులను అనుసంధానించి, సుమారు రూ.800 కోట్ల వ్యాపారాన్ని సృష్టించిందన్నారు. ఎక్స్‌పో ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ప్రవేశం ఉచితమని అగర్వాల్ తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 9425054216ను సంప్రదించాలని కోరారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ ఆశయం

- ఆడబిడ్డల ఆర్థిక స్వావలంబనకు చేయూతనిస్తున్నాం.. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు
- ఇందిరమ్మ ఇండ్లతో పేదల ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నాం.. అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తున్నాం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)
- సత్తుపల్లిలో ఇందిర మహిళాశక్తి సదస్సు.. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04(జనం సాక్షి)**

మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో వెయ్యి రోజుల ప్రజా పాలనలో భాగంగా ఇందిర మహిళాశక్తి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

**సత్తుపల్లి అభివృద్ధికి రూ. 300 కోట్లు ఖర్చు**

మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి సీతక్క అన్నారు. మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్‌డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు.

**మహిళా సంఘాలు వ్యాపారంలోకి రావాలి..**

మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా అర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. మహిళా సంఘాల సమావేశాలు చెట్ల కింద లేదా ఇతరుల ఇళ్ల వద్ద నిర్వహించాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీవో భవనాలను నిర్మిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులందరికీ చదువు నేర్పించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మహిళలు విద్యావంతులై, తమ పిల్లలను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేర్లపై మంజూరు చేస్తున్నామని తద్వారా వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు.

**వనరులను ఆదాయంగా మార్చుకోవాలి**

గ్రామాల్లో లభించే సహజ వనరులు, అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలను మహిళలు వ్యాపారాలుగా మలచుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. ఇప్పపువ్వ లడ్డూల వంటి స్థానిక ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, వాటిని పరిశుభ్రంగా, నాణ్యతతో తయారు చేసి మార్కెట్ చేస్తే మహిళలకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. మహిళలు ప్రతి నెలా రూ.10 వేల నుంచి ప్రారంభించి లక్షలు, చివరకు కోట్లు సంపాదించే స్థాయికి ఎదగాలన్న పట్టుదలతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.





**ప్రభుత్వ పథకాలతో మంచి ఫలితాలు : కలెక్టర్ దివాకర్ టిఎస్**

మహిళ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమం కింద వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం కావడం విశేషమని, దాని ద్వారా నెలకు సుమారు రూ. 2.50 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని చెప్పారు.

**మహిళల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధబి మట్టా రాగమయి, ఎమ్మెల్యే..**

గతంలో మహిళా సంఘాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రుణాలపై అధిక వడ్డీ భారంతో చాలామంది సభ్యులు సంఘాల నుంచి వైదొలిగిన పరిస్థితులు ఉన్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్తగా సుమారు 470 మహిళా సంఘాలు ఏర్పడటం మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహ్మాన్ బేగం, కల్లూరు ఏసీపీ వసుందర, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతి



**హయత్ నగర్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూటీని స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 3న ఇంజాపూర్ నుంచి బీఎన్ రెడ్డి నగర్‌కు భర్త, ఇద్దరు చిన్నారులతో కలిసి స్కూటీపై వెళ్తున్న అడతి భాగ్యలక్ష్మి (32)ని లైఫ్‌కేర్ హాస్పిటల్ వద్ద మాంచెస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాగ్యలక్ష్మిని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సెప్టెంబర్ 4న తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుర్చీ వదలని పంతుళ్లు

### డిప్యుటేషన్లు రద్దైన కదలని వైనం
### 79 మంది ఉపాధ్యాయులు రిలీవ్ చేయాలి
### సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు బొడ్డు రవి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 4(జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో డిప్యుటేషన్ల రద్దు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు నిలిచిపోవడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డిప్యుటేషన్లు రద్దు చేసినపాటికీ 79మంది ఉపాధ్యాయులను వెంటనే వారి స్వస్థల పాఠశాలలకు పంపించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ హనీఫ్ కి సేవ్ టీచర్స్ సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు బొడ్డు రవి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా రంగారెడ్డి జిల్లాలో డిప్యుటేషన్ల వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు ఉపాధ్యాయులు వెళ్లడంతో పల్లెల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి విద్యార్థుల బోధన అస్తవ్యస్తంగా మారుతోందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుండి స్పష్టమైన ఆదేశాలు వెలువడినప్పటికీ, సంబంధిత ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగడం నిబంధనల ఉల్లంఘనేనని స్పష్టం చేశారు. డిప్యుటేషన్ రద్దు అయిన 79మంది ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి, వారిని కేటాయించిన సొంత పాఠశాలలకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయులను రిలీవ్ చేయడంలో కావాలనే జాప్యం చేస్తున్న సంబంధిత విద్యాశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, గత మూడు విద్యా సంవత్సరాలుగా గ్రామీణ మండలాల నుండి పట్టణ ప్రాంతాలకు జరిగిన వందలాది అక్రమ డిప్యుటేషన్లపై నివేదికలు సేకరించి వాటిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన నిబంధనలను పక్కాగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడంలో జరుగుతున్న ఈ అలసత్వాన్ని తక్షణమే సరిదిద్దాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల మధుకర్ రెడ్డి, తలారి సురేష్ కుమార్, ఎస్జిటియు జిల్లా అధ్యక్షులు దుగ్గి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## చెక్‌డ్యామ్ నిర్మాణంలో నిర్లక్ష్యం
### రైతులకు నష్టం

**వీణవంక, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** కల్వల--బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల 10 మంది రైతులు నష్టపోయారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ ఆరోపించారు. శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్‌తో కలిసి బ్రాహ్మణపల్లిలో చెక్‌డ్యామ్ కారణంగా నష్టపోయిన రైతుల వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. 2021లో నిర్మించిన చెక్‌డ్యామ్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, కరకట్ట సరిగా నిర్మించకపోవడం, మత్తడి ఎత్తు ఎక్కువగా ఉండటంతో వర్షపు నీరు పొంగి కరకట్ట తెగిపోయిందన్నారు. దీంతో 10 మంది రైతులకు చెందిన సుమారు 12 ఎకరాల భూమిలో మట్టి కొట్టుకుపోయి, ఐదేళ్లుగా పంటలు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కరకట్ట తెగిపోయిన సమయంలో అప్పటి కాంట్రాక్టర్ కర్ణాకర్‌రావు నష్టపరిహారం చెల్లించి, కొట్టుకుపోయిన మట్టిని తిరిగి పోయిస్తామని బాండ్ పేపర్‌పై హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే భూములను పరిశీలించి నష్టపరిహారం అందించడంతో పాటు సాగుకు అనుకూలంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బాధిత రైతులు సంగ మల్లేష్, కడ కొమురయ్య, కడ మల్లేష్, మండల నాగరాజు, మండల రాజయ్య, మండల చంద్రమౌళి, గెల్లు తిరుపతి, మండల మల్లేష్, మండల గట్టయ్య, మండల కొమురయ్య, తెడ్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మండలానికి అరుదైన గౌరవం

### జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపిక



ఎం. నీరజ



యు. అప్పిరెడ్డి



కే. రాజారెడ్డి



ఎం. విజయ్‌కుమార్

**గుమ్మడిదల, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):**

గురుపూజోత్సవం సందర్భంగా గుమ్మడిదల మండలానికి అరుదైన గౌరవం దక్కింది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికయ్యారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న గురుపూజోత్సవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం తో పాటు, విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

గుమ్మడిదల మండలంలోని కానుకుంట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఎం. నీరజ, నల్లవల్లి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు కే. రాజారెడ్డి, కానుకుంట జడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయులు యు. అప్పిరెడ్డి, మంబాపూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు ఎం. విజయ్‌కుమార్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి పోలీణ తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నలుగురికి మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఒకే మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి లో ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక కావడం గుమ్మడిదల మండలానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.



## కుటుంబ జీవనోపాధికి రూ.లక్ష ఆర్థిక సాయం

### ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా సుంకిరెడ్డి
### మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి భరోసా

**కల్వకుర్తి,సెప్టెంబర్ 4,(జనంసాక్షి):** కల్వకుర్తిమండలంలోని ముకురాల గ్రామానికి చెందిన సంకి నిరంజన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఆదాయం నిలిచిపోయి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. కనీస అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారిన విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మానవతా దృక్పథంతో ఆ కుటుంబానికి అండగా నిలిచారు.కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన జీవనోపాధికి ఉపయోగపడేలా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో కుటుంబ సభ్యురాలు శివలీలకు అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఆపద సమయంలో అందిన ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని సంకి నిరంజన్,ఆయన భార్య శివలీల,కుటుంబ సభ్యులు తెలిపారు.సహాయం అందించిన సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డికిగ్రామస్తులుహృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య,సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి,మల్లేష్,శరత్,నరసింహ,కృష్ణయ్య, జంగయ్య,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేని ఆసుపత్రులు, నకిలీ డాక్టర్లపై చర్యలు

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా (డీఎంహెచ్ఓ) డాక్టర్ కే ఆనంద్

**నాచారం (జనంసాక్షి) :** వైద్యో నారాయణ హరి అనే పదానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా ప్రతి వైద్యుడు అంకితభావంతో తమ సేవలను అందించాలని మేడ్చల్ జిల్లా వైద్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ కే ఆనంద్ తెలిపారు. కంటికి కనిపించని భగవంతుడే తమ ప్రాణాలను కాపాడుతాడని ప్రజలు ఆ భగవంతుడిని వేడుకుంటారు. కానీ కంటికి కనిపించే దేవుడు తమ ముందున్న వైద్యుడేనని వైద్యో నారాయణ హరి అనేటువంటి మాటకు పరమార్థంగా భావించి ప్రజలు వైద్యులను నమ్ముకుంటారు. కాబట్టి ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం ఎన్నెన్నో జన్మల పుణ్యమని జిల్లా వైద్య శాఖ అధికారి( డి ఎం హెచ్ వో) డాక్టర్ కే. ఆనంద్ అన్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్యులు సిబ్బంది నిరంతరం ప్రజల కోసం పనిచేయాలని ఎవరికీ ఎలాంటి ఆపద ఉన్న వైద్యం విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం వహించకుండా తమ విధులు కర్తవ్యం గా భావించి విధినిర్వాహన చేపట్టాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రభుత్వ వైద్యుల పై ఉన్న నమ్మకాన్ని పోగొట్టుకునే దిశగా ఏ ఒక్కరు కూడా నిర్లక్ష్యం వహించకుండా తగిన జాగ్రత్తలతో సేవే మార్గం ప్రేమే లక్ష్యంగా పనిచేయాలని వారు అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన ముందుగా ఆశ్రయించేది ప్రభుత్వాసుపత్రులే కాబట్టి తమకు ఎలాంటి రోగం వచ్చినా నయం చేసే దేవుడే తమ డాక్టర్ గా భావించి నమ్ముకుంటారు కాబట్టి వారికి తగిన సూచనలు సలహాలు ఇస్తూ వారి ప్రాణాలను కాపాడే దిశగా వారి రోగాన్ని నయం చేసేటువంటి క్రమంగా పనిచేస్తున్న వైద్యులను సిబ్బందిని ప్రజలు ఎన్నడూ మర్చిపోరని ఆయన అన్నారు.

**అనుమతులు లేని క్లినిక్‌లు, ఎలాంటి నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులు**



ఎలాంటి అనుమతులు లేకుండానే ఇలాంటి నియమ నిబంధనలను పాటించకుండానే గల్లి కోటి క్లినిక్లు నర్సింగ్ హోమ్లు ఈ రోజుల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆ విధంగా పుట్టుకొచ్చిన అనుమతులు లేని క్లినిక్కుల్లో ఆసుపత్రులలో చికిత్స కోసం వెళ్లకూడదని ఆయన సూచించారు.

నకిలీ సర్టిఫికెట్లతో తమకు తాము డాక్టర్లమని చెప్పుకుంటూ వైద్యం పేరుతో కేవలం డబ్బుల సంపాదన కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఆ విధంగా ప్రజల్లో డాక్టర్లుగా చలామణి అవుతున్న నకిలీ డాక్టర్లను కచ్చితంగా గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆసుపత్రులను ఏర్పాటు చేసి మోసాలకు పాధ్పడుతున్న వారిపై చట్టరీత్యా సైతం చర్యలు తీసుకొని ప్రజలకు అండగా నిలుస్తామని మేడ్చల్ జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ తెలిపారు. చిన్నచిన్న క్లినిక్లను ఏర్పాటు చేసుకొని సూది మందులు , స్టెరాయిడ్ లకు సంబంధించినటువంటి మందులను సైతం పెయిన్ కిల్లర్లు రోగులకు ఇవ్వడం చాలా నేరమని ఇలాంటివి ఎక్కడా కూడా గుర్తించినా కూడా కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. సమస్యలను కొని తెచ్చే విధంగా ఏ ఒక్క ఆసుపత్రి కూడా యాజమాన్యం కూడా వహించరాదని అన్నారు.

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీలు చేపట్టి కచ్చితంగా రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యం విషయంలో కట్టుదిట్టమైన చర్యలు కూడా తీసుకుంటామని అన్నారు. నకిలీ డాక్టర్ల విషయంలో, అనుమతులు లేకుండానే వెలసిన ఆసుపత్రుల విషయంలో పౌరులకు ఎలాంటి సందేహాలు ఉన్నా, నిజంగా ప్రజలను మోసం చేసే విధంగా వైద్య వృత్తిలో ఉండి ఎవరు మోసాలకు పాల్పడిన కచ్చితంగా తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నట్లుగా నిరూపించబడిన అనుమతులు లేకుండా ఆసుపత్రులను నడిపిన, నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతున్నా కూడా కచ్చితంగా వారిపై కఠినంగా చర్యలు తీసుకొని చట్టరీత్యా సైతం వారిని కటకటాలకు నెట్టడం ఖాయమని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్యశాఖ అధికారి డిఎంహెచ్వో డాక్టర్ కే ఆనంద్ తెలిపారు.



## కక్షతోనే రౌఫ్ హత్య

### ముగ్గురు నిందితులు అరెస్ట్
### రాజేంద్రనగర్ డిసిపి ఎస్. శ్రీనివాస్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్4(జనం సాక్షి) :** కర్ణాటకలో తన తమ్ముడు సాజిద్ మృతికి మహమ్మద్ అబ్దుల్ రౌఫ్ కారణమనే కక్షతో అతడిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 2న మహమ్మద్ అబ్దుల్ రౌఫ్ హత్య కేసులో మహమ్మద్ జావీద్ అలియాస్ హెక్లా జావీద్, అతని సహచరులు మహమ్మద్ అబ్దుల్లా, షేక్ ఆరిఫ్‌లను సెప్టెంబర్ 4న ఉదయం ఆరామ్‌ఘర్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలో 2024 మే 19న తన తమ్ముడు సాజిద్ మృతికి రౌఫ్ కారణమనే ఆరోపణలతో జావీద్ అతనిపై కక్ష పెంచుకున్నాడు. రౌఫ్ తమను బెదిరించి ఎగతాళి చేయడంతో హత్యకు పథకం వేసినట్లు నిందితులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. పథకం ప్రకారం సెప్టెంబర్ 2న రాత్రి 11 గంటల సమయంలో ఆటోలో వెళ్తున్న రౌఫ్‌ను అడ్డగించి, పెప్పర్ స్ప్రే చేసి కత్తులతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలతో రౌఫ్ మృతి చెందగా, నిందితులు ఆయుధాలు, రక్తపు మరకలున్న దుస్తులు, పెప్పర్ స్ప్రే సీసాలను పల్లె చెరువు సమీపంలోని పొదల్లో పడేసి పరారయ్యారు. కర్ణాటకలోని బసవకళ్యాణ్ వైపు పారిపోతుండగా ఆరామ్‌ఘర్ వద్ద నిందితులను పోలీసులు పట్టుకున్నారు. జావీద్ వద్ద నుంచి మృతుడి మొబైల్ ఫోన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జావీద్‌పై హైదరాబాద్, పరిసర జిల్లాలు, కర్ణాటకలో 180 కేసులు, ఆరిఫ్‌పై 3, అబ్దుల్లాపై ఒక కేసు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ సమావేశంలో మైలార్ దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పిదాలు అధికారులవి.. తిప్పలు ప్రజలవి

## బిఎల్ఓ, బిఎల్ఎ, ఎన్యూమరేటర్ల తప్పిదాలతో ప్రజలకు తప్పని తిప్పలు



**ముషీరాబాద్, సెప్టెంబర్ 04 (జనం సాక్షి):** తప్పులు ఎవరు చేసినా తిప్పలు మాత్రం ప్రజలవే అన్న చందంగా ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఎస్ ఐ ఆర్ ((ప్రత్యేక సమగ్ర సవరణ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ)) ప్రక్రియ సేకరణలో భాగం గా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా జూలై నెలలో ప్రజల వద్ద నుంచి సేకరించిన డాటా ను బిఎల్ఓ, బిఎల్ఎ, ఎన్యూమరేటర్లు ఆన్లైన్లో ఫీడ్ చేయడం లో నే ఎక్కువగా తప్పిదాలు జరిగాయని అందువల్లే ప్రజలకు ఎలక్షన్ కమిషన్ నుండి నోటీసులు ఎక్కువ మొత్తంలో అందాయని ప్రజలు వాపోతున్నారు.

జాబితాను సరి చేయడానికి తగిన సాక్షాదారాలు గల పత్రాలతో ప్రజలందరూ వారికి కేటాయించిన ప్రత్యేక సెంటర్లకు వెళ్లిన సమయంలో ఆ సెంటర్లో బిఎల్వోలు బిఎల్ఎల తో పున పరిశీలన చేయించగా గతంలో పొరపాట్లు ఎక్కడ జరిగాయో తెలిసిపోతుంది. కొంతమందికి మ్యాపింగ్ చేయలేదని మరికొంతమందికి తండ్రి పేర్లు వేరే వారివి పొరపాటుగా ముద్రించారని, ఇలా అనేక కారణాలు అగుపిస్తున్నాయి. కారణము బిఎల్వోలు, బిఎల్ఎ లు మొదటి సరిగా మ్యాపింగ్ చేయలేదని ఫీడింగ్ లో పొరపాట్లు చేశారనీ అర్థమవుతుంది. అసలు దీనికి గల కారణం బిఎల్ఓ, బిఎల్ఎ, ఎన్యుమరేటర్ లకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వకుండానే వారికి పని కేటాయించడం వల్లే ఇలాంటి పొరపాటు జరిగాయని అంటున్నారు.

2002లో ఓటరు లిస్టో నమోదయి ఉన్న జాబితా, కొత్తగా అందించిన ఫారాలు జాబితా లో తేడా ఉంటే చిరునామా తప్ప వేరే ఏమి తేడా ఉండవు. కానీ కొత్తగా తిరస్కరించబడిన (సవరించిన) జాబితాలో అభ్యర్థుల పేర్లు, వారి యొక్క తల్లి, తండ్రి పేర్లు తేడా ఎందుకు ఉంటుందని సందేహించవలసి వస్తుంది. వీటన్నిటికీ కారణం సరైన శిక్షణ లేని బిఎల్వోలు, బిఎల్ఏలు ఎన్యుమ(రే)టర్లు, చేసిన పొరపాటు లేనని సందేహించక తప్పదు. వారు చేసిన పొరపాట్ల వల్ల వయసు పైబడిన వారు (వృద్ధులు) ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు సెలవు పెట్టుకుని మరి సమయం కేటాయించవలసి వస్తుంది. దీనికి తోడుగా ప్రజలు నివసించే ప్రాంతాల్లో కాకుండా వారికి కేటాయించిన కేంద్రం ఎంతో దూరంలో ఉండడం కూడా ఓటర్ జాబితా దారులకు ఇబ్బందికలిగిస్తుంది. మరియు వ్యయ ప్రయాసాల కోర్చి వెళ్లవలసి వస్తుంది.

**ఫారాలు తిరస్కరణకు గురైన సంఘటనలు**

ఫారాలు ఎక్కువగా తిరస్కరణకు గురైన ప్రాంతాలను గమనిస్తే ఇలాంటి సంఘటనలు పూర్తిస్థాయి శిక్షణ లేని బిఎల్వోలు, బి ఎల్ ఏ లు చేసిన ప్రాంతాల నుండే ఎక్కువ మొత్తంలో ఫారాలు తిరస్కరణకు గురై నోటీసులు అందినట్లుగా సెంటర్లను చూస్తే అర్థమవుతుంది. కొన్ని కేంద్రాల్లో ప్రజలు చాలా తక్కువ మొత్తంలో కనిపించగా, కొన్ని కేంద్రాల్లో అధిక శాతం ప్రజలు అగుపిస్తున్నారు. అంటే అధిక శాతం అప్లికేషన్ ఆయా ప్రాంతాల్లో సరైన క్రమంలో తప్పులు లేకుండా అప్లోడ్ చేయనీ ప్రాంతాల్లోని అప్లికేషన్లు మాత్రమే తిరస్కరణకు ఎక్కువగా గురైనట్టుగా అగుపిస్తుంది.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 92,88,112 నోటీసులు రూపొందించగా అందులో 33,00,000 నోటీసులు మాత్రమే సంబంధించిన ఓటర్లకు అందినట్లు సమాచారం. మిగతావి బిఎల్వోల వద్ద అందుబాటులో ఉన్నాయి. జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం తిరస్కరించబడితే నోటీసులు ఇంటింటికి వెళ్లి అందించవలసిన సిబ్బంది ఒకచోట మాత్రమే కూర్చుని ప్రజలందరినీ ఫోన్ల ద్వారా పిలిపించుకోవడం వారికి ఫారాలు అందించడం గమనర్హం.

**ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి**

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. నోటీసుల్లో పేర్కొన్న తేదీ సమయానికి హాజరై అవసరమైన పత్రాలు సమర్పించాలని కోరారు. హియరింగ్ కు హాజరు కాకపోతే తుది ఓటర్ల జాబితాలో పేరు కొనసాగడం పై ప్రభావం పడుతుందని అందువల్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

**హైదరాబాద్లో**

హైదరాబాద్ జిల్లాలో కూడా ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం సుమారు 12.54 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు సుమారు 4.3 0 లక్షల మందికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటివరకు 15,000 మంది వరకు మాత్రమే హియర్ కు హాజరైనట్లు సమాచారం హైదరాబాద్లో సుమారు లక్ష మంది ఓటర్ల హియరింగ్ స్లాట్ లో ల్యాప్స్ అయినట్లుగా అధికారులు వెల్లడించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో హియరింగ్ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని సమాచారం. అక్టోబర్ 15 వరకు హియరింగ్ అవకాశం ఉన్నందున నోటీసులు అందుకున్న ఓటర్లు వెంటనే సంబంధిత అధికారులు సంప్రదించాలని సూచించారు. ఓటర్లు తమ పేర్లను ముసాయిదా జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం కోసం అవసరమైన సవరణలు కొత్తగా పేరు నమోదుకు ఫారం 6 ఫారం 7, ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అందుకోసం పోలింగ్ కేంద్రాలు లేదా సంబంధిత విఆర్వో కార్యాలయం సంప్రదించవచ్చని తెలిపారు.

# తారా కళాశాలలో విద్యార్థినిపై దాడికి యత్నం

- ముఖాలకు మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు యువకులు
- చేతులు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి వీడియో చిత్రీకరణ
- విద్యార్థిని ఫోన్ నుంచే తండ్రికి వీడియోలు పంపి పరారీ
- నిందితుల కోసం సంగారెడ్డి టౌన్ పోలీసుల గాలింపు



**సంగారెడ్డి బ్యూరో, సంగారెడ్డి సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిపై ఇద్దరు యువకులు దాడికి యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ముఖాలకు మాస్కులు ధరించి కళాశాలలోకి ప్రవేశించిన యువకులు విద్యార్థినిని వెంబడించి, కళాశాలలోని 2 ఫ్లోర్ తీసుకెళ్లి ఆమె చేతులను చున్నీతో కట్టి, నోట్లో గుడ్డ కుక్కి వీడియోలు, ఫొటోలు తీసినట్లు సమాచారం.

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలానికి చెందిన సెకండ్ ఇయర్ విద్యార్థిని గురువారం మధ్యాహ్నం కళాశాలలో ఉండగా ఇద్దరు యువకులు మాస్కులు ధరించి కళాశాలలోకి ప్రవేశించినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. రెండో అంతస్తులో విద్యార్థినిపై దాడికి యత్నించడంతో ఆమె తప్పించుకుని మూడో అంతస్తుకు వెళ్లింది. తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నం చేస్తుండగా యువకులు అక్కడికి చేరుకుని ఆమెను అడ్డుకున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థిని చేతులను చున్నీతో కట్టి, నోట్లో గుడ్డ కుక్కి ఆమె ఫోన్ను తీసుకున్న యువకులు ఘటనను వీడియో, ఫొటోలు తీశారు. అనంతరం అదే ఫోన్ నుంచి వాటిని విద్యార్థిని తండ్రికి పంపి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కళాశాల మూడో అంతస్తులో విద్యార్థిని ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది, విద్యార్థులు అక్కడికి చేరుకునే సమయానికి ఆమె స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

**పది రోజులుగా విద్యార్థిని కోసం గాలింపు?**

బాధిత విద్యార్థినికి చెందిన ఫోన్ నుంచి ఓ యువకుడికి ఇటీవల అసభ్యకర వీడియోలు వెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న యువకులు కొంతకాలంగా విద్యార్థిని కోసం గాలిస్తున్నట్లు సమాచారం. అయితే ఆ వీడియోలను తాను పంపలేదని, తన ఫోన్ నుంచి మరో విద్యార్థిని పంపిందని బాధితురాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఘటనపై సంగారెడ్డి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కళాశాల పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

**కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఉందా?**

సంగారెడ్డిలోని ప్రభుత్వ తార కళాశాలలో విద్యార్థినిపై జరిగిన సంఘటనలో కళాశాల యజమాన్యం నిర్లక్ష్యం ఉందా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తార కళాశాల ఆవరణలో రెండు రెండు వసతి గృహాలు ఉండగా విద్యార్థులు ఎప్పుడు కళాశాల ప్రాంగణంలో తిరుగాడుతుంటారు. కళాశాల సమయంలోనే సంఘటన జరగడం అనుమానాలకు తావిస్తుంది. విద్యార్థినిని వెంబడించిన దుండగులు మధ్యాహ్నం 3 గంటలకు కళాశాలలోని రెండవ అంతస్తు వరకు తీసుకెళ్లినప్పటికీ అక్కడ ఉన్న విద్యార్థులు , అధ్యాపకులు, సిబ్బంది గమనించకపోవడం ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా గమనించి ఉంటే విద్యార్థినిపై సంఘటన జరిగేది కాదని పలువురు అనుకుంటున్నారు.

# వికలాంగుల హక్కుల పోరాటానికి దిక్సూచి

## అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.. వికలాంగుల వాయిస్‌కు 12 ఏళ్లు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04 (జనంసాక్షి) :** వికలాంగుల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు వారి హక్కుల సాధనకు 'వికలాంగుల వాయిస్' మాసపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. పత్రిక 12వ వార్షికోత్సవ సంచికను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వికలాంగుల వాయిస్' పత్రిక సామాజిక చైతన్యంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పత్రిక 12వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణలో వికలాంగుల కోసం నడుస్తున్న ఏకైక మాసపత్రికగా 'వికలాంగుల వాయిస్' కొనసాగుతోందన్నారు. గత 11 ఏళ్లుగా పత్రికను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. వికలాంగులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటాలకు పత్రిక దిక్సూచిగా నిలుస్తోందన్నారు. చట్టాలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాల సమాచారాన్ని వికలాంగులకు చేరవేయడమే లక్ష్యంగా పత్రిక పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వికలాంగుల్లో అవగాహన, చైతన్యం పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ షేన్ బేగం, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, శివకుమార్, కోటయ్య, మేఘమాల, నాయకులు భాను, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక దాడులు..
# 5 షాపులపై కేసులు నమోదు



**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** పాఠశాలల సమీపంలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే సమాచారంతో శంకర్ పల్లి పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.సీ.ఐ రుద్వీర్ కుమార్ సిబ్బందితో కలిసి శంకర్పల్లి లోని చేవెళ్ల రోడ్డులో గల తెలంగాణ మోడల్ స్కూల్,రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న కిరాణా,టిఫిన్,టీ షాపుల్లో తనిఖీలు చేశారు.తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన గుట్కా,సిగరెట్లు,పాన్ మసాలా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు.నిబంధనలు ఉల్లంఘించిన షాపులపై కేసులు నమోదు చేశారు.పాఠశాలలకు 100 మీటర్ల లోపు పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని,అమ్మిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీ.ఐ తెలిపారు.



# తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యం

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** తల్లి తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోకిలా సి.ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముదావత్ కిమ్యా నాయక్ (40) బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం వికారాబాద్ జిల్లా, జహీరాబాద్ మండలం బహుదూర్పుర తండా నుండి భార్య తన ముగ్గురు పిల్లలతో భార్య కవిత (37) కూతుర్లు సరిత (16) సవిత (15) కొడుకు గణేష్ (12) మోకిలాకు వచ్చి భర్త డ్రైవర్ గాను భార్య కిరాణం దుకాణం వ్యాపారంతో పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే గత నెల 31వ తేదీన ముదావత్ కిమ్యా నాయక్ రోజు మాదిరిగానే డ్రైవింగ్ కి వెళ్లగా మధ్యాహ్నం మూడు గంటలకి ఇంటికి వచ్చే చూడగా భార్యతోపాటు పిల్లలు కాలేజీ,స్కూల్ నుండి రాలేకపోగా చుట్టుపక్కల వారితో పాటు బంధువులకు బంధువులకు సమాచారం ఇవ్వడంతో ఎక్కడ ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం మోకిలా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# కబ్జారాయుళ్ళ చెరలో రేగులకుంట చెరువు శిఖం

- రెవెన్యూ అధికారులు నిగ్గు తేల్చినా.. సిఎంసి అధికారుల ప్రత్యేక అనుమతులు
- యథేచ్ఛగా కొనసాగుతున్న భారీ భవనం అక్రమ నిర్మాణం
- అనుమతులు రద్దుచేసి నిర్మాణాన్ని కూల్చేయండి : జనంకోసం సంస్థ డిమాండ్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (జనంసాక్షి) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం రేగులకుంట చెరువుకు సంబంధించిన శిఖం భూమి సర్వే నెంబర్ 151 లో 372 గజాల ప్రభుత్వ భూమిలో కొంతమంది భూకబ్జారాయుళ్లు 150వ సర్వే నంబర్ అంటూ తప్పుడు ధృవపత్రాలను సృష్టించి వాటి సహకారంతో ఏకంగా జిహెచ్ఎంసి నుండి అనుమతులను పొంది ఓ 5 అంతస్తుల భారీ భవనాన్ని నిర్మిస్తున్నా దానిపై చర్యలు తీసుకునే నాథుడు లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదే సర్వే నెంబర్ ను 2020 లోనే మరో తప్పుడు ధృవపత్రం సహకారంతో 12 వందల గజాల పైచిలుకు స్థలాన్ని బైనంబర్ గా చూపిస్తూ కొన్ని భారీ అపార్ట్మెంట్ లను నిర్మించి సామాన్యులకు అమ్మి సొమ్ము చేసుకున్న దళారులు ఈ దఫా దాని పక్కనే ప్రస్తుతానికి 372 గజాలను చెరబట్టి మరో భారీ భవనాన్ని నిర్మిస్తుండడం ఆందోళన కలిగించే అంశం.

**రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా నిగ్గు తేల్చినా ఆగని అక్రమం**



దీప్తి శ్రీనగర్ పరిధి రేగులకుంట చెరువు శిఖం భూమి అయిన సర్వేనెంబర్ 151 లో 372 గజాలలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణానికి సంబంధించి అప్పట్లో మీడియాలో(పలు జనం సాక్షి విశ్లేషణాత్మక కథనాలు) వచ్చిన కథనాలు, జనం కోసం స్వచ్ఛంద సంస్థ సుదీర్ఘ పోరాటం ఫలితంగా 2023 సెప్టెంబర్ లో జిహెచ్ఎంసి అనుమతులను రద్దు చేయాలని సూచిస్తూ శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి అప్పట్లో జిహెచ్ఎంసి(ప్రస్తుత సిఎంసి)కి ఆదేశాలు జారీ చేసినా... పట్టించుకోని పట్టణ ప్రణాళిక విభాగం అన్నితామై కాగల కార్యాన్ని గంధర్వులు చేసినట్లు తెర వెనుక సంపూర్ణ మద్దతును అందిస్తూ ఏకంగా ఐదంతస్తుల భవనానికి సకల సేవలను అందించడం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక అక్రమ నిర్మాణానికి ఇంత పకడ్బందీగా అప్పటి జిహెచ్ఎంసి అధికారులు సమగ్ర తోడ్పాటు అందించడం వెనుక ఆంతర్యం కేవలం లక్షలాది రూపాయల ముడుపులను దండుకోవడంతప్ప వేరే కారణమేమీ లేదని సామాజికవేత్తలు ఆరోపిస్తున్నారు. అయితే 2023లో ఆదేశాలను జారీ చేసిన మండల డిప్యూటీ కలెక్టర్ తదనంతరం సదరు భవనంపై ఎలాంటి తదుపరి చర్యలకు పూనుకోకపోవడం వెనక అనేక అనుమానాలు తలెత్తడంతో 'దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకున్నారన్న' నానుడిని నిజం చేస్తున్నారని శేరిలింగంపల్లి వాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.

**భేషరతుగా అనుమతులను రద్దుచేసి నిర్మాణాన్ని తొలగించండి : జనం కోసం సంస్థ డిమాండ్**

రేగులకుంట చెరువు శిఖం భూమిలో కొనసాగుతున్న 372 గజాల అక్రమ నిర్మాణానికి సంబంధించి ఓవైపు శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్, మరోవైపు 2026 ఫిబ్రవరిలో హైకోర్టు ఆదేశాలను తక్షణమే పరిగణలోకి తీసుకొని సదరు అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేయడంతో పాటు ప్రభుత్వ పరిధిలోకి తీసుకొని అక్రమ చొరబాట్లు జరగకుండా ఫెన్సింగ్ ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన బాధ్యతను ప్రభుత్వాధికారులు తీసుకోవాల్సిందిపోయి తమ కుటుంబ, వ్యక్తిగత జీవితాన్నిసైతం పక్కనపెట్టి ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం స్వచ్ఛంద సేవలు అందిస్తుంటే పందికొక్కులను, దండుపాళ్యం బందిపోట్లను తలపిస్తూ కోట్లాది రూపాయలను దండుకొని అక్రమ నిర్మాణంపై అధికారులు అవలంబిస్తున్న ఉదాసీన వైఖరి తీవ్ర గర్హనీయమని ఇది 'దున్నపోతు మీద వాన'ను తలపిస్తోందని కసిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. ఇప్పటికే 15 వందల గజాల స్థలం దళారులపాలయిందని తద్వారా కోట్లాది రూపాయల అక్రమార్జన అధికారుల జేబుల్లోకి వెళ్ళగా... అంతే స్థాయిలో ప్రభుత్వ ఆస్తికి, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని ఆయన ధ్యాయబట్టారు. ప్రస్తుతం అక్కడ మరో నాలుగు వేల గజాల వరకు చెరువు శిఖం భూమి ఖాళీగా ఉందని, ఇప్పటికే దానిపై మరింత మంది దళారులు కన్నేశారో తెలియదని... అధికారులతో ఈపాటికే లోపాయికారి ఒప్పందం జరిగిపోయి ఉంటుందని ప్రజా సంఘాల ప్రతినిధులు ఎద్దేవా చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణాన్ని కూల్చకుంటే ప్రజా పోరాటానికి సిద్ధం : కసిరెడ్డి**

ప్రభుత్వ శిఖం భూమిలో సర్వేనెంబర్ 150గా చూపిస్తూ జిహెచ్ఎంసి నుండి తప్పుడు అనుమతులు పొందిన దళారులపై భూకబ్జా కేసులను నమోదు చేయడంతో పాటు 372 గజాలలో వెలసిన అక్రమ భవనాన్ని కూల్చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారా.. ప్రజా యుద్ధానికి సిద్ధం కావాలా..? అధికారులు తేల్చుకోండి అని శుక్రవారం జనంకోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి అధికారులకు అల్టిమేట్ జారీచేశారు. తమ సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రభుత్వ భూముల పరిరక్షణకోసం సంవత్సరాల పోరాటం ఎందుకు చేయాలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, హైడ్రా అధికారులు వివరించాలని... ప్రజలే ఆస్తుల పరిరక్షణకు పూనుకుంటే ఇక అధికారులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. భేషరతుగా అక్రమ నిర్మాణాన్ని కూల్చేయాల్సిందేనని, పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి తదుపరి అక్రమాలు జరగకుండా గట్టి నిఘా చర్యలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వ ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు.





# హర్ష బేకర్స్ కంపెనీలో భారీ నగదు చోరీ చేసిన నిందితుడు అరెస్ట్

## లాకర్ పగులగొట్టి రూ.24 లక్షలు చోరీ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్4(జనంసాక్షి) :** తిన్న ఇంటికే కన్నం పెట్టిన పాత ఉద్యోగి.. కాటేదాన్‌లోని హర్ష్ బేకర్స్ కంపెనీలో రూ.24.49 లక్షల నగదు చోరీ చేసి పోలీసులకు చిక్కాడు మైలార్ దేవ్ పల్లి లో ని హర్ష్ బేకర్స్ బిస్కట్ కంపెనీలో జరిగిన భారీ నగదు చోరీ కేసును పోలీసులు చేదించారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఏసిపి శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసును ఛేదించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 31న కాటేదాన్‌లోని హర్ష్ బేకర్స్ కంపెనీ క్యాషియర్ రూ.24-25 లక్షలను ఆఫీస్ లాకర్‌లో ఉంచి తాళం వేసి వెళ్లారు. సెప్టెంబర్ 1 ఉదయం తలుపులు, అల్మరా, లాకర్ పగులగొట్టి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక ఆధారాలు, సాక్షుల విచారణ ద్వారా నిందితుడు అనిల్ నాగరావ్ కాంబ్లే (28) గా గుర్తించారు. విచారణలో నిందితుడు నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేశారు. అతడి ఇంట్లో దాచిన మొత్తం నగదు రూ.24,49,500 నగదు, రెడ్మి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో ఇదే హర్ష్ బేకర్స్ కంపెనీలో పనిచేసిన ఉద్యోగిగా పోలీసులు గుర్తించారు.ఈ సమావేశంలో చంద్రానికిట ఏసిపి సుధాకర్, మైలార్ దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డీఐ. మహమ్మద్ మక్సుద్ అలీ, ఎస్సై విశ్వనాథ్, డీఏఎస్ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## నిమ్స్‌లో పీ సేవలు ఉచితంగా అందించాలి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




హైదరాబాద్ (జనంసాక్షి) : ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కింద నిమ్స్‌లో అవుట్ పేషెంట్ సేవలు ఉచితంగా అందించాలని నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కొత్త గైడ్‌లైన్స్ ప్రకారం ఈహెచ్ఎస్ పేషెంట్లకు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఐపీ సేవలు, వెల్‌నెస్ సెంటర్లలో మాత్రమే ఓపీ సేవలు అందించాల్సి ఉండగా, నిమ్స్‌లో కూడా అవుట్‌పేషెంట్ సేవలు యథావిధిగా ఉచితంగానే కొనసాగించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా, మరో 24 సెంటర్లను కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకూ వెల్‌నెస్ సెంటర్లు లేని, అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. హైదరాబాద్‌లోనూ మరో 3 వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. జనరల్ హాస్పిటళ్లకు అనుసంధానించి వెల్‌నెస్ సెంటర్లలోనూ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను బటప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్నది.

# సభ్యసమాజం తలదించుకునేలా శిరీష హత్య

### నిందితుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం


- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ములకలపల్లి మండలంలో మృతురాలు తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి పొంగులేటి
- రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్, ఐదు లక్షల చెక్కు అందజేత



కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 04( జనం సాక్షి): నిరుపేద గిరిజన కుటుంబ నేపథ్యం నుంచి హైదరాబాద్ లో స్టాఫ్ నర్స్ గా పనిచేసేందుకు ములకలపల్లి మండలం నుంచి వెళ్లిన ఊకే శిరీష ను హత్య చేసి, అనంతరం లైంగిక దాడి చేసిన మానవ మృగానికి చట్ట ప్రకారం కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ములకలపల్లి మండలంలోని మృతురాలి స్వగ్రామం చౌటిగూడెం గ్రామానికి వెళ్లి తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి సవ్యసమాజం తలదించుకునేలా శిరీష హత్య జరగడం దారుణమని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. మానవ మృగం చేతిలో గిరిజన యువతి శిరీష హత్య కావడం దారుణమైన సంఘటనని అన్నారు. భద్రాచలం ఐటిడిఏ పరిధిలో గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా ఉపాధి పొంది కుటుంబానికి అండగా నిలిచేందుకు హైదరాబాద్ వెళ్లిన శిరీష,ఆమె మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి, అన్న, వదిన, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తీరని నష్టం కుటుంబానికి జరిగిందని, సవ్యసమాజం తలదించుకునేలా శిరీష హత్య జరిగిందని, నిందితుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తప్పక న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని, రాష్ట్ర ప్రభుత్వం తరపున మీ కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్, రు.5 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,ఐటీడీఏ పీ.వో రాహుల్, హౌసింగ్ పీ.డీ సవయ్ రామ్ లతో సమక్షంలో మృతురాలి కుటుంబ సభ్యులను అందజేసి పరామర్శించారు.

అనంతరం హైదరాబాదులో శిరీష హత్య జరిగిన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీ.పీ తో మృతురాలి ఇంట్లో నుంచి కుటుంబ సభ్యుల ముందు ఫోన్ లో మంత్రి పొంగులేటి మాట్లాడారు నర్సింగ్ విద్యార్థి శిరీష హత్య జరిగిన వసతి గృహాన్ని తక్షణమే తనిఖీలు చేపట్టి ఆసుపత్రికి అనుసంధానమైన వసతి గృహంలో రక్షణ చర్యలు పై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైతే ఆ ఆసుపత్రిని సీజ్ చేసేలా చర్యలు చేపడతామని, హత్యకు కారకుడైన నిందితుడిపై ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఆసుపత్రి, వసతి గృహాల సంబంధించిన వారిని ఎందుకు చేర్చలేదని అడిషనల్ గా ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం అయ్యి శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి విలేఖరులతో అన్నారు. మృతురాలి తల్లి ఆవేదనకు, ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోయానని, ఆ తల్లి మనోవేదనకు నా మనసు కలత చెందిందని మంత్రి పొంగులేటి అన్నారు. మంత్రి పొంగులేటి వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ములకలపల్లి తాహాసిల్దార్ స్వాతి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి



- రేవంత్ రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించిన
- తాత ముత్తాతల భూమిని లాక్కోవడం నీ జాగిరా
- అసెంబ్లీలో నీ సంగతి తేలుస్తా అంటూ ఘాటు వ్యాఖ్యలు

కౌటాల సెప్టెంబర్ 04 (జనం సాక్షి) : రైతులను కబ్జాదారులుగా అవమానించిన ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతుల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదంటూ ఘాటు విమర్శలు చేశారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ భూములు లేవని రైతులను బ్యాంకు మేనేజర్లు గెంటేస్తున్నారని, పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, ఇది ఇందిరమ్మ రాజ్యమా? కబ్జాల రాజ్యమా? పేద రైతుల భూములు గుంజుకోవద్దు, వారి గొంతు నొక్కొద్దు, కోనప్ప ఈ మీటింగ్ పెడితే రైతుల కష్టాలు చూసి బాధేసిందని తెలిపారు. తాను హైదరాబాద్ చుట్టుపక్కల మాత్రమే రెండు లక్షల ఇండ్లను 22ఏ లో పెట్టారనుకున్నానని, ఒక్క సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి రైతుల నోటికాడ బుక్కను రేవంత్ రెడ్డి లాక్కున్నాడని దుయ్యబట్టారు. కేసీఆర్ గిరిజనులకు 6 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకుంటే, రేవంత్ రెడ్డి ఉన్న భూములను గుంజుకుంటున్నాడు.భూములు 22ఏలో పడితే రైతుల బతుకులు ఆగమాగం అవుతాయి. ఇందాక ఇక్కడ విజయలక్ష్మి, భీంబాయి, మల్లవ్వ లాంటి రైతులు చెప్తుంటే కన్నీళ్లు వచ్చాయి. పాత అప్పు కట్టి, కొత్త లోన్ కోసం పోతే మీ భూమి గవర్నమెంట్ తీసుకుందంటూ బ్యాంక్ మేనేజర్లు వారిని బయటకు పంపేశారు. కొత్తగా తీసుకొచ్చిన యాప్ వల్ల భూమి పేరు మీద లేకపోతే రేపు యూరియా, డీఏపీ కూడా దొరకదు, రైతుబంధు రాదు, ప్రమాదం జరిగితే బీమా రాదు. రైతులు, ఇక్కడ దరఖాస్తులు ఇచ్చిన 40 వేల మంది రైతులు దొంగలా? కబ్జాదారులా? హైదరాబాద్‌లో కూర్చుని పేద రైతులను దొంగలు అని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలి.ఇన్ని లక్షల మంది ఆస్తులను రాత్రికి రాత్రే సున్నా వాల్యూ చేసి, అడ్డగోలుగా మాట్లాడిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధిత జాబితాలో పెట్టాలి. అధికారులను కూడా హెచ్చరిస్తున్నాం, ఈ నెల 7 నుంచి అసెంబ్లీ మొదలవుతుంది, అక్కడ తేల్చుకుంటాం. అప్పటిలోగా తీయకపోతే మా కోవ లక్ష్మక్క ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముందే పొయ్యి పెట్టి, వంటా వార్పు చేసి అక్కడే పడుకుంటాం.ఈ నియోజకవర్గంలో ఎవరెన్ని కుట్రలు చేసినా గులాబీ జెండా ఎగరడం ఖాయం. కోనప్ప,మా ప్రవీణన్న ఇద్దరూ ఇప్పుడు ఒక్కటయ్యారు. ఇక ఇక్కడ ఏ శక్తి ఎదురొచ్చినా తుఫాన్‌లో కొట్టుకుపోవాల్సిందే. మళ్లీ కేసీఆర్ గారు వస్తేనే ఈ రాష్ట్రం బాగుపడుతుందని ప్రతి అవ్వా తాత, అక్కా చెల్లెలు నమ్ముతున్నారు. దళారులను నమ్మి రైతులు రూపాయి లంచం ఇవ్వొద్దు, మీ భూములు మీకు దక్కేంతవరకు బీఆర్ఎస్ పార్టీ అండగా కొట్లాడుతుంది.

# రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలి

- అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సింగరేణి సీఎండీ
- డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం




హైదరాబాద్ (జనంసాక్షి) : పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన సరఫరా ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడానికి సింగరేణిలో రోజుకు 1.9 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో నుంచి ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో శుక్రవారం బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, అలాగే రాష్ట్ర ఇంధన శాఖ వారు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందించాలంటూ, సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారని, దేశ ఇంధన భద్రత రీత్యా తగినంత బొగ్గును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థల పైన ఉంది కాబట్టి సింగరేణి కూడా శక్తి వంచన లేకుండా కృషిచేసి బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన ఏరియాల వారీగా ఇప్పటివరకు ఇవ్వబడిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఆగస్టు 31వ తేదీ నాటికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల కాలం పూర్తి కాగా సింగరేణి సంస్థ 253 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిందని, దీనిలో 90% పైగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందని అధికారులు వివరించారు, కాగా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సంస్థ సీఎండీ స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని నుండి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మొదటి రైల్వే రేకుతో బొగ్గు సరఫరా చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంపై దామరచర్ల లోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మరొక రేకు ఇటీవల సరఫరా చేశామని, ఇకముందు కూడా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నైనీ బ్లాక్ నుండి బొగ్గును రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం జరుగుతుందని ఆయన వివరించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాతోపాటు ఓవర్ బర్డెన్ తొలగింపు పై కూడా ఛైర్మన్ సమీక్షించారు. ఆగస్టు నెలాఖరి వరకు ఆఫ్ లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించడం జరిగిందని, అయితే ఇచ్చిన లక్ష్యాలలో ఇది 95 శాతం మాత్రమే కనుక నూరు శాతం పైబడి ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఆఫ్ లోడింగ్ ఏజెన్సీ లను సమాయత్తం చేయాలని ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన ఈ సమయం ఉత్పత్తికి అనుకూలంగా ఉంది కనుక రోజువారీ లక్ష్యాలను దాటి బొగ్గు ఉత్పత్తి సాధించాలని, రైల్వే విభాగం వారితో సమన్వయం జరుపుతూ నూరు శాతం పైబడి బొగ్గు రవాణా సాధించాలన్నారు. రక్షణా ప్రమాణాలు పాటిస్తూ తగిన నాణ్యత గల బొగ్గును సరఫరా చేయడానికి పై అధికారుల నుండి కింది వరకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్. వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎమ్. తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ ఉ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



## ఐఎస్ఓఐ 32వ జాతీయ సదస్సు ప్రారంభం


హైదరాబాద్ (జనంసాక్షి) : ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటాలజిస్ట్స్ (ఐఎస్ఓఐ) 32వ వార్షిక జాతీయ సదస్సును హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం సాయంత్రం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఓరల్ ఇంప్లాంటాలజీ ప్రస్తుతం ఆధునిక దంత వైద్యంలో కీలక భాగంగా మారిందని, కోల్పోయిన దంతాలను భర్తీ చేయడానికే పరిమితం కాకుండా రోగుల నమలే సామర్థ్యం, సౌందర్యం, ఆత్మవిశ్వాసం, జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఇంప్లాంట్ డెంటిస్ట్రీ ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ దంత వైద్య సేవలను విస్తరిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 50 మంది డెంటల్ డాక్టర్లను నియమిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఓరల్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నివారణ, ముందస్తు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

## రేపు ఛలో నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) : కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఛలో నాగిరెడ్డిపేట్ కార్యక్రమం జరగనుంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల వైఫల్యాలపై శుక్రవారం ఈ నిరసన కార్యక్రమం చేపట్టనుంది. ఉ 11 గంటలకు నాగిరెడ్డిపేట్ పట్టణ కేంద్రంలో జరిగే ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ కొరకు విద్యార్థులు, యువతతో నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు.

# రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి

- మల్లిఖార్జున్ ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి, సెప్టెంబర్4 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేరిపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి” అని డిమాండ్ చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370